Dwaraka

fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 15 | విజయవాడ, సోమవారం 15 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



ప్రజాశక్తి పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు
- ఎడిటర్

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మా కార్యాలయానికి సెలవు. పునఃదర్శనం బుధవారం
- చీఫ్ జనరల్ మేనేజర్

పెదవి విప్పండి..!

ప్రధాన న్యాయమూర్తికి మాజీ న్యాయమూర్తుల లేఖ

తన తండ్రి మృతిపై అనుమానాలు లేవంటున్న అనుజ్ లోయ

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు పాలనలో అవకతవకలపై గొంతెత్తిన సహచర న్యాయమూర్తుల ఆవేదనపై ఇప్పటికైనా పెదవి విప్పాలని నలుగురు మాజీ న్యాయమూర్తులు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆయనకు రాసిన బహిరంగ లేఖను ఆదివారంనాడు మీడియాకు విడుదల చేశారు. వివిధ ధర్మాసనాల ఏర్పాటు, వాటికి కేటాయించే కేసుల విషయంలో నలుగురు న్యాయమూర్తులు ప్రస్తావించిన సమస్యలు అత్యంత తీవ్రమైనవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పిబి సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా (రిటైర్డ్), మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె చంద్రు (రిటైర్డ్), బొంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్ సురేశ్ (రిటైర్డ్) ఈ లేఖలో పేర్కొన్నారు. కేసుల కేటాయింపు విషయంలో మిగతా 9లో



పిబి సావంత్ | ఏపి షా | కె చంద్రు | హెచ్ సురేష్

25న 'పద్మావత్' విడుదల

న్యూఢిల్లీ : ఎట్టకేలకు 'పద్మావత్' సినిమా విడుదల తేదీని అధికారంగా ప్రకటించారు. ఈ నెల 25న పద్మావత్ విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారంగా ప్రకటించింది. సినిమా చిత్రీకరణ ప్రారంభమైన దగ్గర నుంచి పద్మావత్ ఎన్నో వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను ముందుగా గత ఏడాది డిసెంబరు 1న విడుదల చేయాలని ముందుగా చిత్ర నిర్మాతలు భావించారు. అయితే మతతత్వ శక్తులు, మితవాదులు ఈ సినిమా విడుదలకు అడ్డంకులు సృష్టించారు. దర్శకుడు సంజయ్ లీలా బన్సాలి, మిగతా 8లో



తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో కోడిపందేలు తిలకిస్తున్న ప్రజలు

9

కత్తులు దూసిన కోళ్లు

చేతులు మారిన కోట్లు

- నాయకులే ప్రారంభకులు
- పత్తా లేని పోలీసులు
- అనంతపురం'లో పందుల పోటీలు
- కృష్ణాలో పొట్టేళ్ల పందాలు
- చిత్తూరు జిల్లాలో జల్లికట్టు

భారత్ చేరిన నెతన్యాహూ

ఆరు రోజుల పాటు పర్యటన

అసాధారణ రీతిలో స్వాగతం పలికిన మోడీ

తీన్‌మూర్తి చౌక్‌కు హైఫియా చౌక్‌గా నామకరణం

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత విచ్చేశారు. న్యూఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో భార్య సారాతో కలిసి దిగిన నెతన్యాహూకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోటోకాల్‌ను సైతం పక్కనబెట్టి అసాధారణరీతిలో స్వాగతం పలికారు. కరచాలనం చేయడమేగాక ఆత్మీయంగా కౌగలించుకొని స్వాగతించారు. ఇద్దరు నేతలూ చేతులు పట్టుకొని కలిసికట్టుగా అభివాదం చేశారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆదివారం రాత్రి నేతన్యాహు దంపతులకు ప్రధాని మోడీ వ్యక్తిగతంగా విందు ఇచ్చారు. అంతకు ముందు 'నా నేస్తమా నెతన్యాహూ భారత్‌కు స్వాగతం. భారత్‌లో మీ పర్యటన చారిత్రాత్మకం, ప్రత్యేకం. మన ఇరు దేశాల మైత్రీబంధాన్ని మీ పర్యటన మరింత బలోపేతం చేస్తుంది' అని ఆంగ్లంలోనూ, హిబ్రూలోనూ మోడీ ట్వీట్ చేయడం విశేషం.

ఇక నుంచి తీన్‌మూర్తి హైఫియా చౌక్

భారత్, ఇజ్రాయిల్ స్నేహబంధానికి ప్రతీకగా నిలిచిన న్యూఢిల్లీలోని యుద్ధ స్మారకం తీన్ మూర్తి చౌక్‌కు ఇజ్రాయిల్ నగరమైన హైఫియా పేరు జతచేసి తీన్‌మూర్తి హైఫియా చౌక్‌గా మోడీ, నెతన్యాహూ సమక్షంలో నామకరణం చేశారు. ఈ స్మారకం వద్ద హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్‌కు చెందిన అశ్వికదళ వీరుల కాంస్య విగ్రహాలున్నాయి. నామకరణోత్సవానికి ముందు యుద్ధ వీరులకు మోడీ, నెతన్యాహూ శ్రద్ధాంజలి ఘటించారు. సందర్శకుల పుస్తకంలో సంతకాలు చేశారు.

తీన్‌మూర్తి స్మారకం ప్రత్యేకత ఇది..

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఒట్టోమాన్ ఆక్రమణ నుంచి మిగతా 9లో



పండగ వేళ ప్రమాదాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

విహారయాత్రలో మరొకరు మృతి

ప్రజాశక్తి -నెల్లూరు/తూ.గో/ప.గో

ఆదివారం రహదారులు రక్తసిక్తమయ్యాయి. పలుచోట్ల బోగి పండుగ రోజు జరిగిన రోడ్డు ప్రమాదాలతో ఆయా కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. నెల్లూరు జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. నెల్లూరు ఎన్‌టిఆర్ నగర్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో కారులోని ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు తొటపల్లి గూడూరు మండలం వెంకన్నపాళెంకు చెందిన వారుగా గుర్తించారు. వీరు తమిళనాడు నాగపట్నంకు వెళుతుండగా ఈ ప్రమాదం మిగతా 9లో



అన్న క్యాంటీన్లు ఏవీ?

నెరవేరని ప్రభుత్వ హామీ

సచివాలయం సమీపంలో ఒకేఒక్క క్యాంటీన్

ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతికల్లా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేస్తామన్న ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరలేదు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తామన్న ప్రకటనలు నీటిమూటలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి అతి తక్కువ ధరకే అల్పాహారం, భోజనం అందిస్తామని చెప్పి రెండున్నరేళ్ల మిగతా 9లో

బడ్జెట్ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం

అన్నిచోట్ల ఒకే రకమైన కనీస వేతనం

44 చట్టాలను ఏకం చేసి ఒకే బిల్లు

8

ఉర్దూ టీచర్ పోస్టుల వివరాల్ని పంపండి

డిఇవోలకు విద్యాశాఖ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టుల వివరాల్ని వెంటనే పంపించాలని జిల్లా విద్యాశాఖాధికారుల్ని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఇటీవల మెమో జారీ చేసింది. వచ్చే డిఎస్సీలో ఈ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. విశాఖపట్నం, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కాకుండా మిగిలిన జిల్లాల అధికారులు పోస్టుల వివరాల్ని ఈ నెల 18లోగా పంపాలని సూచించింది.

సందర్భం

శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ముఖ్యమంత్రి కుటుంబం



రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : సిఎం

శ్రీవారి సేవలో ముఖ్యమంత్రి కుటుంబం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, కరువు కాటకాలు లేకుండా చూడాలని శ్రీవారిని వేడుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. భోగి పండుగను పురస్కరించుకుని తిరుమల శ్రీవారిని చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. సంప్రదాయ దుస్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా మహద్వారం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆలయ మర్యాదలతో ఇష్టికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తన కులదైవమైన శ్రీవెంకటేశ్వరుడిని సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యులందరితో కలిసి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించానని పేర్కొన్నారు. శ్రీవారి అనుగ్రహంతో పోలవరం, అమరావతి త్వరలో పూర్తి చేయాలని కోరుకున్నానని తెలిపారు. తెలుగు వారికి మరో మారు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో ముఖ్యమంత్రితోపాటు అయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారా లోకేష్, కోడలు నారా బ్రాహ్మణి, మనుమడు దేవాన్ష్, తమ్ముడి కొడుకు సిని హీరో నారా రోహిత్, నందమూరి బాలకృష్ణ దంపతులు ఉన్నారు.



క్రమంగా పెరుగనున్న ఉష్ణోగ్రతలు

ఉత్తరాయన దిశగా సూర్యుడు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. శనివారం రాత్రి చలి తీవ్రత తగ్గింది. ఆదివారం స్వల్పంగా ఉక్కపోత మొదలైంది. సూర్యుడు ఉత్తర దిశగా పయనించడం వల్లే ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటాయని విశాఖ వాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ రాళ్లపల్లి మురళీ కృష్ణ తెలిపారు. సూర్యుడు మకరరేఖపైకి వచ్చిన తొలిరోజునే మకర సంక్రాంతిగా పేర్కొంటారు. దీంతో ఇక్కడ నుంచి పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. తద్వారా రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కోస్తాలో పగటి పూట 30 నుంచి 32 డిగ్రీలు, రాత్రి పూట 20 నుంచి 23 డిగ్రీలు నమోదవుతున్నాయి. అయితే రెండు మూడు రోజులు పొగ మంచు మాత్రం కురిసే అవకాశముందని రాళ్లపల్లి తెలిపారు.

కొనసాగుతున్న ద్రోణులు..

భూమధ్య రేఖా ప్రాంతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. మరోవైపు మాల్దీవుల నుంచి మహారాష్ట్ర తీరం వరకు అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంపై వీటి ప్రభావం ఏమీ ఉండదని వాతావరణ శాఖ పేర్కొంది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. దేశంలో తొలిసారిగా ఏ రైల్వే స్టేషన్‌లో శానిటరీ నేప్కిన్ల విక్రయ యంత్రాన్ని ఏర్పాటు చేశారు?
2. కేరళ నౌకా వాణిజ్య బోర్డు నూతన చైర్మన్?
3. ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన ఉత్పత్తి జాబితాలో భారత్ స్థానం?
4. భారత ఒలింపిక్ సమాఖ్యకు చెందిన ఆర్థిక కమిషన్ చైర్మన్?
5. చుటక్ జల విద్యుత్ కేంద్రం ఎక్కడ ఉంది?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నర్‌పేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సంక్రాంతికీ 'ఉపశమనం' లేదు

- మూడవ దఫా మాఫీ కోసం రైతుల నిరీక్షణ
- 20 లక్షల ఖాతాల్లో నయాపైసా పడలేదు
- సర్కారీ బకాయి రూ.2 వేల కోట్లు
- అందులో 500 కోట్లు ఏప్రిల్ తర్వాతే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతుల పండుగ సంక్రాంతిక్కూడా రైతులకు మూడవ విడత రుణమాఫీ కాలేదు. మాఫీ సొమ్ము కోసం నెలల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న అన్నదాతలకు చంద్రబాబు సర్కారు నిరాశే మిగిల్చింది. మాఫీ కిస్తీ కోసం లక్షలాది మంది రైతులు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, రైతు సాధికార సంస్థ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. మూడవ దఫాలో ముప్పైఆరున్నర లక్షల రైతు ఖాతాలకు మాఫీ సొమ్ము జమ కావాల్సి ఉండగా ఇప్పటికీ 20 లక్షల అకౌంట్లలో నయాపైసా పడలేదు.

మొత్తంగా మూడవ విడత మాఫీకి ప్రభుత్వం రూ.3,600 కోట్లు ఇవ్వాల్సి ఉండగా అందులో ఇప్పటి వరకు అదీ అనేక విడతల్లో రూ.1,900 కోట్లు సర్దినట్లు రాష్ట్ర స్థాయిలో చెపుతుండగా క్షేత్ర స్థాయిలో పరి స్థితి అగమ్యగోచరంగా ఉంది. బ్యాంకులకు రూ.1,500 కోట్లు మాత్రమే చేరగా బ్యాంకులు రూ.1,200 కోట్ల వరకు రైతుల ఖాతాలకు జమ చేశాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు సర్కారు ఎన్ని నిధులిచ్చింది, ఎంత మంది రైతులకు సొమ్ము అందింది అనే విషయాలపై స్పష్టత ఇచ్చే నాథుడే లేడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో, అనంతరం ప్రభుత్వ సలహాదారు కుటుంబరావు పత్రికా ప్రకటనలకు, గ్రామాల్లో నెలకొన్న పరిస్థితికి అస్సలు పొంతన లేదు. ఏ రైతునడిగినా తనకు మాఫీ సొమ్ము పడలేదనే జవాబే వస్తోంది. సర్కారు విడుదల చేశామంటున్న నిధులు ఎక్కడికి పోయాయో అంతుబట్టకుండా ఉంది.



ఏరువాక పోయి సంక్రాంతి వచ్చే

ఈసారి ఖరీఫ్‌కల్లా మూడవ దఫా రుణమాఫీ సొమ్ము రైతులకు అందిస్తామని, ఏరువాక డెడ్‌లైన్ అని ప్రభుత్వ పెద్దలు పదేపదే వల్లించారు. ఏరువాక పోయి ఆరు మాసాలు గడిచినా, ఖరీఫ్ ముగిసి రబీ సగంలో పడ్డా అంతూపొంతు లేదు. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి మరీ రుణ ఉపశమన పథకాన్ని అమలు చేస్తున్నామని ప్రచారం ఎత్తుకోగా రైతుల అకౌంట్లలో మాత్రం సొమ్ము జమ కావట్లేదు. విజయ బ్యాంక్ నుంచి రైతు సాధికార సంస్థ రూ.వెయ్యి కోట్లు రుణం తీసుకునేందుకు నిరుడు నవంబర్ 19న ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ రుణం ఇంకా పూర్తిగా విడుదల కాలేదని, సగమే అందాయని సమాచారం. ఆంధ్రాబ్యాంక్ నుంచి మరో రూ.వెయ్యి కోట్లు రైతు సాధికార సంస్థ తీసుకునేందుకు మొన్న డిసెంబర్ 18న సర్కారు అనుమతించింది. ఆంధ్రాబ్యాంక్ నుంచి రూపాయి కూడా విడుదల కాలేదని తెలిసింది. ఖజానా నుంచి నిధులివ్వకుండా, బ్యాంకుల నుంచి అప్పులు మంజూరు కాకుండా మాఫీ సొమ్ము ఇచ్చేశామనడంపై వ్యవసాయశాఖ వర్గాలు తలలు పట్టుకుంటున్నాయి.

వచ్చే బడ్జెట్‌లోనే

బ్యాంకుల నుంచి రూ.రెండు వేల కోట్లు అప్పు చేసినా, అవన్నీ రైతు సాధికార సంస్థకు అందుబాటులోకొచ్చినా ఇంకా రూ.500 కోట్లు తక్కువ పడతాయని తెలిసింది. రెండవ దఫాలో రూ.3,100 కోట్లు ఇచ్చామని, ఈ మధ్యకాలంలో రైతుల పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరిస్తుండటంతో మూడవ విడతలో చెల్లింపులు రూ.3,600 కోట్లకు పెరిగాయని, ఆ పెరిగిన మొత్తం రూ.500 కోట్లూ వచ్చే బడ్జెట్‌లో ఏప్రిల్ అనంతరం విడుదలవుతాయని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

లోకేష్‌కు అబ్దుల్ కలాం సెంటర్ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐటి,పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ డా. ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ అవార్డుకు ఎంపికయ్యారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో టెక్నాలజీ అనుసంధానంతో గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అధునాతన సాంకేతికతో పంచాయతీరాజ్ శాఖకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌కు గానూ మంత్రి లోకేష్‌కు డా. ఎపిజె అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్ అవార్డ్ -2018 కు ఎంపికయ్యారు. ఈ నెల 20న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే డా. అబ్దుల్ కలాం సమ్మిట్ ఆన్ ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్ 2018 కార్యక్రమంలో ఈ అవార్డును మంత్రి అందుకోనున్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో ఎసిబి కార్యాలయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సొంత కార్యాలయ భవనాల నిర్మాణాల్ని చేపట్టింది. రాష్ట్ర విభజనకు ముందు 13 జిల్లాల్లో ఒక్క సొంత కార్యాలయం లేకపోయినా గత మూడేళ్లుగా అధికారులు సొంత భవనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భవనాల్ని నిర్మించుకునేందుకు ఎసిబి అధికారులు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు.

13 జిల్లా కేంద్రాల్లో భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటికే రూ.15.94 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతోనే గతేడాది ఆగస్టులో తిరుపతి కార్యాల యాన్ని, సెప్టెంబర్‌లో ఏలూరు కార్యాలయాన్ని ప్రారంభిం చారు. తాజాగా నెల రోజుల క్రితం డిసెంబర్‌లో విశాఖ పట్నంలో ఎసిబి కార్యాలయాన్ని సిఎం చంద్రబాబు ప్రారం భించారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలోని అక్రమార్కులపై అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల నమోదు విషయంలో కొన్ని విమర్శలున్నా అవినీతిపరుల్లో మాత్రం ఒక భయాన్ని కలిగించింది. ఎసిబి డిజిగా ఆర్పీ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించిన తరువాత తనదైన శైలిలో శాఖాపరమైన సంస్కరణల్ని చేపట్టారు. ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి దాడుల్ని ముమ్మరం చేశారు. అవినీతి నిరోధక శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అన్ని అవకాశాల్నీ వినియోగించు కుంటున్నట్లు ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్ పేర్కొంటున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఎసిబి సొంత భవనాల నిర్మాణం కూడా ప్రజలకు భరోసా కల్పించేందుకే అంటున్నారు. బాధితులు ఎప్పుడైనా ధైర్యంగా ఎసిబి తలుపుతట్టే విధంగా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. 2018 చివరినాటికి మిగిలిన 10 జిల్లా కేంద్రాల్లోనూ నిర్మాణంలో ఉన్న సొంత భవనాల్ని పూర్తి చేసి కార్యకలాపాల్ని ప్రారంభి స్తామన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న వాట్సయాప్ నంబరు (8333995858), ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇమెయిల్, టోల్‌ఫ్రీ (1064), మీ కోసం (1100) ద్వారా ఎసిబిని ఆశ్రయించవచ్చని ఆయన తెలిపారు.

25న బిఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభ

- ప్రజలకు హక్కులు కల్పిస్తాం
- కార్పొరేట్, అగ్రకులాలకు అడ్డుకట్టవేస్తాం
- ప్రజల మద్దతుతో అధికారంలోకొస్తాం బిఎల్‌ఎఫ్ నేతలు వెల్లడి
- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాట ప్రియులైన తెలంగాణ ప్రజలు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్)ను ఆదరించడంతో పాటు అధికారంలోకి తీసుకొస్తారని పలువురు నేతలు ధీమా వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం తాయిలాలు ప్రకటిస్తూ బిచ్చమేస్తోందని, తాము మాత్రం ప్రజలకు హక్కులు కల్పిస్తామని వారు స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నల్లా సూర్యప్రకాశ్ అధ్యక్షతన బిఎల్‌ఎఫ్ ముఖ్యనేతల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అంశాలపై చర్చించారు. అనంతరం 25న బిఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

దోపిడీని అడ్డుకుంటాం: తమ్మినేని వీరభద్రం

తెలంగాణను తాము రెండు కళ్లతో చూస్తూ రెండు కాళ్లతో నడిపిస్తామని సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. బిఎల్‌ఎఫ్ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుల అండతో కార్పొరేట్ శక్తులు, అగ్రకులాలకు చెందిన ధనవంతులు దోపిడీ చేస్తూ, సంపదను కూడబెట్టుకుంటున్నారన్నారు. వారి దోపిడీ, ఆధిపత్యాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ రెండు శక్తుల్ని నిలువరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రజల్ని విముక్తి చేస్తామన్నారు. 119 స్థానాల్లో పోటీ చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. 25న నిర్వహించే బిఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రకాశ్ అంబేద్కర్, ఎంసిపిఐ(యు) ప్రధాన కార్యదర్శి ఎండి గౌస్ సహా పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బిఎల్‌ఎఫ్ నేతలు విస్తృతంగా పర్యటిస్తారని, ఆరు నెలల్లో రాజకీయంగా బలోపేతమవుతామని స్పష్టం చేశారు. పోరాట ప్రియులైన ప్రజల అండతో బిఎల్‌ఎఫ్ అధికారం చేపడతుందని ధీమా వ్యక్తం చేశారు. బిసిలకు సబ్‌ప్లాన్, ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించకుండా, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ప్రజలకు తాయిలాలు ప్రకటిస్తూ బిచ్చమేస్తోందని విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు అవసరం లేదన్నారు. రైతు పండించిన ధాన్యానికి 50 శాతం అదనపు మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌ను దోపిడీ నుంచి విముక్తి చేస్తామన్నారు. ఉద్యోగాల కల్పన కోసం స్థానికంగా పంట ఉత్పత్తులకు సంబంధించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవ్యవస్థలో సంక్షోభాన్ని న్యాయమూర్తులే పరిష్కరించుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఖాళీగా ఉన్న 2 లక్షల పోస్టుల్ని ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లకు సంబంధించిన ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిఎల్‌ఎఫ్‌లోకి సిపిఐ రావాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డితోనూ చర్చలు జరుపుతున్నామని తమ్మినేని ప్రకటించారు.



కాంగ్రెస్ కంటే దుర్మార్గపు పాలన: నల్లా సూర్యప్రకాశ్

కాంగ్రెస్ కంటే దుర్మార్గంగా టిఆర్ఎస్ పాలిస్తోందని బిఎల్‌ఎఫ్ నేత నల్లా సూర్యప్రకాశ్ విమర్శించారు. ప్రజల సమస్యల్ని పట్టించుకోవడం లేదని, అందుకే సిపిఎం నేతృత్వంలో బిఎల్‌ఎఫ్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాజ్యాధికారం చేజిక్కించుకుంటామని స్పష్టం చేశారు. ఆప్ నేత పిఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ అరాచకపాలన సాగుతోందన్నారు.

మత ప్రాతిపదికన ప్రజల్ని విభజిస్తున్నారన్నారు. ఆర్ఎస్‌పి నేత జానకిరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్న టిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సోషల్ జస్టిస్ రాంనర్సయ్య మాట్లాడుతూ విద్య, వైద్యం, సేద్యమే లక్ష్యంగా బిఎల్‌ఎఫ్ ముందుకు సాగుతుందని, రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఎంసిపిఐ(యు) నేత అశోక్ ఓంకార్ మాట్లాడుతూ సామాజిక న్యాయంతోనే దళిత, బహుజన, మైనార్టీలు అభ్యున్నతి సాధిస్తారన్నారు. ఎంబిటి నేత ఖాన్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ సాధిస్తామన్నారు. తెలంగాణ లేబర్ పార్టీ నేత గొర్రె రమేశ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో నాయిని నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో ఉద్యమద్రోహులు మంత్రి వర్గంలో ఉన్నారంటూ కెసిఆర్ మాట్లాడిస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో టిఆర్ఎస్‌ను గద్దె దించుతామని ఆయన ప్రకటించారు.

ప్రత్యేకం

తాడేపల్లిగూడెం కుంపటి ఆరేనా..!

- విచారణకు కమిటీని నియమించిన చంద్రబాబు
- ఆగని టిడిపి, బిజెపిల సవాళ్లు.. ప్రతిసవాళ్లు

ప్రజాశక్తి - పశ్చిమగోదావరి డెస్క్

మూడేళ్లుగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మిత్రపక్షాలైన టిడిపి, బిజెపి మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. గత ఎన్నికల్లో టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి బిజెపికి చెందిన పైడికొండల మాణిక్యాలరావు ఎంఎల్‌ఎగా గెలుపొందడంతోపాటు మంత్రివర్గంలోనూ స్థానం పొందారు. అప్పటికే ఈ సీటు ఆశించిన టిడిపి నేత ముళ్లపూడి బాపిరాజు తీవ్ర నిరాశకు గురయ్యారు. అధిష్టానం జోక్యం చేసుకుని జెడ్‌పి చైర్మన్ పదవిని కట్టబెడతామని హామీ ఇచ్చి నెరవేర్చడంతో వివాదం సమసింది. టిడిపి, బిజెపి పైకి కలిసి ఉన్నా మొదటి నుంచి లోలోన ఆధిపత్య పోరు కొనసాగింది. తాడేపల్లిగూడెంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) విద్యాసంస్థ ప్రారంభం సందర్భంగా తమకు సముచిత స్థానం కల్పించలేదని టిడిపి నాయకులు ప్రధానంగా జెడ్‌పి చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మున్సిపల్ చైర్మన్ అలకబూనారు. ద్వారకాతిరుమలలో విర్డ్స్ ఆసుపత్రి భవన ప్రారంభం సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించలేదని ద్వారకాతిరుమల దేవస్థాన ఇఒ, జెడ్‌పి చైర్మన్ మధ్య వివాదం చోటుచేసుకుంది. జెడ్‌పి చైర్మన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేసిన దేవస్థాన ఉద్యోగులను పట్టుబట్టి టిడిపి నేతలు సస్పెండ్ చేయించారు. దేవాదాయ శాఖా మంత్రిగా ఉన్న పైడికొండల మాణిక్యాలరావు సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేయించడంతో అదికాస్తా మాణిక్యాలరావు, బాపిరాజు నడుమ వివాదంగా మారింది. ఈ క్రమంలోనే వివిధ సందర్భాల్లో టిడిపి నుంచి బాపిరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బిజెపి నుంచి మంత్రి ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.

గతంలో రెండు దఫాలు టిడిపి అధిష్టానం చర్చలు జరిపి సర్దుబాటు చేసింది. ఇటీవల జన్మభూమి సభల్లో భాగంగా తాడేపల్లిగూడెం రూరల్ మండలం రామన్నగూడెం సభలో జెడ్‌పి చైర్మన్ తనను అవమానించేందుకు ప్రయత్నించారని, అభివృద్ధి జరగడం లేదని నిలదీసేలా జనాన్ని రెచ్చగొట్టారని మంత్రి మాణిక్యాలరావు ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఆరోపించారు. తనను మంత్రిగానే చూడటం లేదని, వైసిపి నేతల నుంచి రావాల్సిన విమర్శలు టిడిపి నేతల నుంచి రావడం బాధాకరమని అన్నారు. సిఎం చంద్రబాబు మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ఫైల్‌కు జెడ్‌పిలో ఆమోదం తెలపకుండా ముళ్లపూడి బాపిరాజు అడ్డుకున్నారని ఆరోపించారు. ఇలాగైతే కలిసి పని చేయడం అసాధ్యమని ప్రకటించారు.

కలకలం రేపిన బొలిశెట్టి శ్రీనివాస్ వ్యాఖ్యలు

ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టిడిపికి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆఫ్టరాల్ ఫొటోగ్రాఫర్ మంత్రి అని వ్యాఖ్యానించారని ఆరోపణలు రావడంతో కలకలం రేగింది. దీనిపై మంత్రి స్పందిస్తూ తాను వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్‌నేనని ప్రకటించారు. పైగా ఇక్కడి నేతలను టిడిపి అధిష్టానం సైతం నియంత్రించలేకపోతు న్నట్లు కన్పిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఆఫ్టరాల్ అనే పదం వాడలేదని ఆఫ్టర్ ఫొటోగ్రాఫర్ మంత్రి అని అన్నానని బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇక జెడ్‌పి చైర్మన్ బాపిరాజు మంత్రి ఆరోపణలపై స్పందించకుండా మంత్రి అవినీతికి పాల్పడుతున్నారని ప్రత్యారోపణలు చేశారు. దీంతో టిడిపి, బిజెపి నడుమ విబేధాలు ముదిరిపాకాన పడ్డాయి. టిడిపి జిల్లా నేతలు శనివారం అమరావతిలో జరిగిన ఒక సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. చంద్రబాబు తెలుగుతమ్ముళ్ల తీరుపై ఒకింత అసహనం ప్రదర్శించినట్లు సమాచారం. జెడ్‌పి చైర్మన్ బాపిరాజు తీరు బాగోలేదని, ఇప్పటికే పలుమార్లు క్రమశిక్షణ ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ వివాదంపై విచారణకు మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పిఠాపురం ఎంఎల్‌ఎ వర్మతో విచారణ కమిటీని నియమించారు. నివేదిక వీలైనంత త్వరగా ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు.

సంక్షిప్తం

సిఎం సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్షకుల జీవితాల్లో శుభక్రాంతి సంక్రాంతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దేశ విదేశాల్లోని తెలుగు వారికి ఆయన ఆదివారం ఒక ప్రకటనలో మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగిపండుగ కంటే ఉత్సాహంగా సంక్రాంతిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే శుభ సందర్భమే సంక్రాంతి అని ఆయన పేర్కొన్నారు. తెలుగువారికిది పెద్ద పండుగ అని, ప్రత్యేకించి పంటలు ఇంటికి చేరిన వేళ ఆనందోత్సవాలతో జరుపుకునే పండుగ అని తెలిపారు.

సంక్రాంతితో సకల శుభాలు : యనమల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

తెలుగు వారి జీవితాల్లో సంక్రాంతి పండుగ సకల శుభాలు తేవాలని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆకాంక్షించారు. పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు నూతన పథకం : కె.హరిబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే బడ్జెట్‌లో ప్రవేశపెట్టనున్న 'భవంతర్ భగతాన్ యోజన పథకం' కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సంక్రాంతి కానుకగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కె.హరిబాబు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించకపోవడంతో రైతులు నష్టపోతున్న తరుణంలో వారిని ఆదుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతితో రైతుల కష్టాలు తీరనున్నాయని వెల్లడించారు.

రైతులకు ఉచితంగా పంపుసెట్లు

దశలవారీగా 15 లక్షల పంపుసెట్ల పంపిణీ

ఈ ఏడాది 4 లక్షలు లక్ష్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులు ప్రస్తుతం వినియోగిస్తున్న సాధారణ పంప్‌సెట్ల స్థానంలో ఇంధన సామర్థ్యం కలిగిన పంపుసెట్లను ఉచితంగా సరఫరా చేయనున్నట్లు ఇంధన శాఖ వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది రైతులకు ఈ పంపుసెట్లను దశలవారీగా పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ కార్పొరేషన్ లిమిటెడ్ సిఇఒ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇంధన శాఖ అధికారులతో సిఎం ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించి పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో పంపుసెట్ విలువ రూ.40 వేలు ఉన్నందున, ఇందుకు రూ.6 వేల కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇఇఎస్‌ఎల్ సహకారం అందిస్తోందన్నారు. ఇంటి వద్ద నుండి ఆపరేట్ చేసేందుకు సిమ్ కార్డుతో కూడిన స్మార్ట్ ప్యానల్ ఉన్న ఫైవ్ స్టార్ రేటింగ్ పంపుసెట్లను ఈ పథకంలో రైతులకు అందిస్తారన్నారు. వీటి వల్ల 30 శాతం విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల పంపుసెట్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు లక్షల పంపుసెట్లను మార్పిడి చేసేందుకు డిస్కంలు ప్రణాళికలు రూపొందించాయని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు కోసం ప్రతి పంపుసెట్‌కూ ఏటా రూ.25వేలు వెచ్చిస్తోందన్నారు.

కత్తికట్టని కోడిపందేల నిర్వహణకు చర్యలు : చినరాజప్ప

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో సంప్రదాయబద్ధంగా వస్తున్న కత్తి కట్టని కోడిపందేల నిర్వహణకు చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ఆదివారం రాత్రి పాలకొల్లు వచ్చిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కోడిపందేల నిర్వహణపై కోర్టు తీసుకుంటున్న చర్యలపై తాను వ్యాఖ్యానించబోనని, చట్టం తన పని తాను చేసుకుంటుందని తెలిపారు. కత్తి కట్టని కోడిపందేల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే కోడిపందేల పేరుతో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పడవ పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం బహుమతులు ప్రధానం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్

ఏటేటా జల క్రీడలు

ముగిసిన దివిసీమ సంప్రదాయ పడవల పోటీలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఏటేటా ఈ జలక్రీడలను నిర్వహించి నాగాయలంకకు ప్రపంచ గుర్తింపు తీసుకొస్తామని డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా నాగాయలంక మండలం శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్లో రెండు రోజులపాటు జరిగిన దివిసీమ సంప్రదాయ పడవ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు డ్రాగను, మెడ్డాడ పడవ పోటీలను నిర్వహించారు. బుద్ధప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. డ్రాగను పడవ పోటీల్లో 36 టీంలు, మెడ్డాడ పడవ పోటీల్లో 30 టీంలు పాల్గొన్నాయి. డ్రాగను పడవ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కృష్ణాపురానికి చెందిన శ్రీను దక్కించుకోగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బావదేవరపల్లికి చెందిన గిరిజన యానాది సంఘం, లంకె రమేష్ నిలిచారు. మెడ్డాడ పడవ పోటీల్లో ప్రథమ స్థానాన్ని రేవు హరిబాబు చేజిక్కించుకోగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అంద్రాజు జయసూర్య, కన్నా వెంకట్రావ్ నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి రూ.1,000 కన్సోలేషన్ బహుమతిని అతిథులు అందజేశారు. పోటీలను క్రీడలు, యువజనుల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరి ఎల్వి.సుబ్రహ్మణ్యం, శాప్ ఎండి బంగార్రాజు పర్యవేక్షించారు.

పొగాకుపై వర్షాభావం దెబ్బ

- ఈ ఏడాదీ దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన
- ప్రకాశంలో 77 మిలియన్లకు అనుమతి..
- దిగుబడి 60 మిలియన్లు అంచనా
- వర్షాభావంతో ఒక్కో బ్యారన్‌కు
- అదనంగా నీటి ఖర్చు రూ.70 వేలకుపైనే
- వచ్చేనెలలో రాష్ట్రంలో ప్రారంభం కానున్న వేలం కేంద్రాలు



నీటి కొరతతో స్పింక్లర్ల ద్వారా పొగాకు పైరును తడుపుతున్న తీరు..

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి

వర్షాభావం పొగాకు సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. గతేడాది మాదిరిగానే ఈసారీ పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్డు 77 మిలియన్ల ఉత్పత్తికి అనుమతించగా 60 మిలియన్లే ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు నీటి కోసం ఖర్చు కూడా తడిసిమోపెడవుతోంది. ఒక్కొక్క బ్యారన్‌కు రూ.70వేలు నుంచి రూ.లక్ష వరకు అదనపు ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో వేలం ప్రారంభం కానుంది. కిలో రూ.160కు తగ్గకుండా ధర ఉంటేనే రైతులకు పెట్టుబడులైనా దక్కుతాయి. ప్రభుత్వం ఆ వైపుగా కృషి చేస్తేనే రైతుకు న్యాయం జరుగుతుంది.

15 మిలియన్లు తగ్గే అవకాశం

నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఈ ఏడాది 15 మిలియన్లు వరకూ ఉత్పత్తి తగ్గుతుందని అంచనా. జిల్లాలో 22 వేల బ్యారన్లున్నాయి. ఒక్కో బ్యారన్‌కు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వరకూ పెట్టుబడి అవుతోంది. బ్యాంకులు రైతులకు ఇతోధికంగా రుణాలు ఇస్తాయి. కారణం చెల్లింపులన్నీ బ్యాంకుల ద్వారానే పొగాకు బోర్డు చేస్తోంది. రైతులకు ఇచ్చిన రుణాలు చెల్లింపులు జరిగాకే మిగిలిన సొమ్ము రైతులకు ఇస్తారు. ఈ ఏడాది సాగు 1.20 లక్షల ఎకరాల్లో జరిగింది. వర్షాభావం వల్ల పంట తగ్గుతోంది. ఎక్కడా నీరు లేనందున తోటలు ఎదగలేదు. సాగర్ కాలువలకు ఇటీవలే నీరు వచ్చింది. ఇంజిన్లతో నీరు పెట్టుకుంటున్నారు. అయినా బ్యారన్‌కు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి తగ్గుతుందని చెబుతున్నారు. ఫలితంగా ఈ రెండు జిల్లాల్లో 15 మిలియన్ కిలోలు తగ్గుతుందని అంచనా. 70 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా 55 కిలోలు పండవచ్చంటున్నారు. గతేడాది దిగుబడి రాష్ట్రం మొత్తంలో తగ్గింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోని వేలం కేంద్రాల పరిధిలో 130 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా 120 మిలియన్లు పండింది. ప్రకాశం జిల్లాలో బాగా తగ్గింది. ఈ జిల్లాలో 70 మిలియన్లకు గానూ కేవలం 55 మిలియన్లు మాత్రమే పండింది.

వాగుల, వంకల నుంచి ఇంజిన్లు, మోటార్లతో నీరు

మూడు నెలలుగా జిల్లాలో వర్షాల జాడలేదు. 30 శాతం వర్షం లోటుగానే కనిపిస్తోంది. ఫలితంగా నాట్లు వేసే సమ యంలోనే ట్యాంకర్లతో నీటిని తెచ్చారు. తర్వాత వాగులు వంకల నుంచీ నీటిని వాడుకున్నారు. ఇంజిన్లు, మోటార్లతో నీటిని తోటలకు పెట్టుకుంటున్నారు. ఇలా నీటికోసం బ్యారన్ కు రూ.70 వేల నుంచి రూ.లక్ష అదనపు ఖర్చవుతోంది. ఇపుడు క్యూరింగు దశలో ఉంది. మూడు నాలుగుసార్లు కాల్పులు పూర్తయ్యాయి. గ్రేడింగు సాగు తోంది. రైతులు మాత్రం ఎంతో ఆశగా ధరల కోసం ఎదురుచూస్తున్నారు.

సగటు ధర రూ.140 ఉంటేనే గిట్టుబాటు

గతేడాది సగటు ధర రూ.116 పలికింది. వేలం ప్రారంభంలో గరిష్ట ధర రూ.160 ఉంది. ఈ ధరతోనే ఎక్కువ పొగాకు కొన్నారు. దిగుబడి బాగా తగ్గడంతో రైతులు ధరలు వస్తాయని ఆశపడ్డారు. పాలకులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వ్యాపారులపై నియంత్రణ పెట్టలేదు. ఫలితంగా వేలంలో దోపిడీ కొనసాగింది. గరిష్ట ధర ఆఖరులో రూ.198కి చేరినా రైతులకు దక్కిన సగటు ధర రూ.116 మాత్రమే. ఖర్చులు చూస్తే కిలోకు రూ.120 వరకూ అయిందని రైతులు చెబుతున్నారు. ఫలితంగా అందరూ నష్టాల్లో మునిగారు. ఈ ఏడాది సగటు ధర రూ.140 ఉండాలని రైతులు భావిస్తున్నారు.

ఫిబ్రవరిలో వేలం ప్రారంభం

ఇండెంట్లు కన్నా ఉత్పత్తి తగ్గుతున్నందున వ్యాపారుల మధ్య పోటీ తప్పకుండా ఉండాలి. మళ్లీ సిండికేట్‌గా మారితే రైతులకు నష్టాలు తప్పవు. వచ్చే నెలలో వేలం ప్రారంభం కానుంది. ముందుగానే పంట దిగుబడులు, రైతుల పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుని కేంద్రం, పొగాకు బోర్డు ధరలపై స్పష్టమైన అవగాహనతో నిర్ణయాలు తీసుకుంటేనే రైతులకు మేలు జరుగుతుంది.


7 క్వింటాళ్లకు మించి చేతికొచ్చేలా లేదు



'సెప్టెంబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో ఎకరా పొగాకు సాగు చేయడానికి కేవలం నాట్ల కోసమే రూ.15 వేలు ఖర్చు చేశా. బెట్టకు వస్తుండడంతో నీటి తడి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని కోసం మరో రూ.10 వేలు ఖర్చు చేశా. ఇంత కష్టపడితే ఏడు క్వింటాలకు మించి పంట చేతికి రాలేదు'

- గోగినేని శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు

నష్టపోయే ప్రమాద ముంది



'గ్రామంలో పొగాకు పంట వేసుకోవడానికి అనుకూల వాతావరణం ఉంది. నారు రేట్లు అధికంగా ఉండడంతో ఎకరా నాటుకు రూ.12 వేలు ఖర్చు చేశాం. ప్రస్తుతం కొంత ఆశాజనకంగా ఉంది. ఏడు క్వింటాల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. రేటు నిలకడగా ఉంటే కొంతమేర ఒడ్డున పడొచ్చు. లేకపోతే నష్టాలను చవిచూడాల్సి వస్తుంది'

- పెనుబోతు రంగారావు, మద్దిరాలపాడు



సాగర్ కుడి కాల్వకు తగ్గిన నీరు

మిర్చి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ ఆయకట్టులో కుడికాల్వ ద్వారా మెట్ట ప్రాంతానికి నీటి విడుదలను అధికారులు గణనీయంగా తగ్గిస్తున్నారు. దీంతో ఆయకట్టు పరిధిలో వివిధ రకాల పంటలు వేసిన రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం వరకూ 9 వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా ఆదివారం నుంచి 4,400 క్యూసెక్కులు అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రధానంగా మిర్చికి మరో తడి నీరు అవసరమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మంచు బాగా కురుస్తుండటంతో నీటి ఎద్దడి ఉన్నా ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. మిర్చి తొలి కోతలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ వరకూ కోతలు కొనసాగుతాయి. జిల్లాలో 2016 సీజన్‌లో 2.24 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా గత సీజన్‌లో మిర్చి ధరలు పతనం వల్ల గత ఖరీఫ్‌లో మిర్చి సాగు బాగా తగ్గింది. గతేడాది 1.46 లక్షల ఎకరాల్లో మిర్చి సాగైంది. ఫిబ్రవరి నాటికి తొలి కోతలు పూర్తయి వాటిని డయ్యర్ల ద్వారా ఆరబెట్టుకుని త్వరలో విక్రయానికి గుంటూరు మిర్చి యార్డుకు తీసుకురానున్నారు. ఈ ఏడాది సగానికి పైగా మిర్చి విస్తీర్ణం తగ్గడం వల్ల ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఉత్పత్తి ఎంత వరకూ వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో రెండు కోతలు వచ్చే అవకాశం ఉన్న క్రమంలో నీటి తడులు అవసరం. ప్రస్తుతం రాత్రి వేళ మంచు కురుస్తున్నా పగటి వేళ ఎండ తీవ్రత పెరిగితే ఉత్పత్తిపై ప్రభావం పడనుంది. తొలి కోతలో ఎకరాకు రెండు క్వింటాళ్లు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ఎకరాకు గరిష్టంగా 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఆదిలో మిర్చి సాగుకు సరిగా నీరందక రైతులు ఇబ్బంది పడ్డారు. ముందస్తుగా వేసిన ప్రాంతాల్లో మొదటి కోతలు కోస్తుండగా ఆలస్యంగా పంట వేసిన ప్రాంతాల్లో మాత్రం పంట బాగా ఎదిగి కొన్ని ప్రాంతాల్లో పూత, కాయ దశల్లో ఉంది. మరో నెల రోజులు నీరు అవసరం అని రైతులు చెబుతున్నారు. మరో వైపు డెల్టాలో వరి తరువాత రబీలో మొక్కజొన్న, మినుము, పెసర సాగు చేశారు. మెట్టలోనూ వరికి అవకాశం లేని ప్రాంతాల్లో అపరాలు సాగు చేశారు. ఈ పంటలకూ నీరు అవసరం. రాష్ట్రానికి కేటాయించిన మేరకు నీరు వినియోగించుకోవాల్సి ఉందని, అందువల్ల నీటి విడుదలను తగ్గిస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కొనసాగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణాజిల్లా)



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని తదితరులు

కృష్ణాజిల్లా గుడివాడ మండలం లింగవరంలోని కె-కన్వెన్షన్ వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఎన్‌టిఆర్ టు వైఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో జరుగుతున్న బండలాగుడు పోటీల్లో వివిధ విభాగాల్లో సుమారు 70 జతల ఒంగోలు జాతి ఎడ్లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరయ్యాయి. ఆదివారం సబ్ జూనియర్స్ విభాగంలో డివిఆర్ మెమోరియల్ దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత 3000 అడుగుల దూరం బండను లాగి ప్రథమ, కె.వెంకటసుబ్బయ్య మెమోరియల్ కోయ జగన్మోహనరావు, పెనమలూరు ఎడ్ల జత 2801.10 అడుగుల దూరంతో రెండో స్థానం, మండవ చేతన్ మొవ్వ ఎడ్ల జత 2786.70 అడుగుల దూరంతో తృతీయ స్థానం వ్యవసాయ విభాగంలో డివిఆర్ మెమోరియల్ దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత 3729 అడుగుల దూరంతో ప్రథమ, మేకా కృష్ణమోహన్, ఘంటశాల ఎడ్లజత 3600 అడుగుల దూరంతో ద్వితీయ, బి.జ్ఞానచార్య, నిరీక్షణ, నున్న ఎడ్లజత 3435 అడుగుల దూరంతో తృతీయ స్థానంలో నిలిచాయి, ఆయా ఎడ్లజతలకు నగదు పురస్కారాలతోపాటు జ్ఞాపికలను ఎమ్మెల్యే కొడాలి నాని, వైసిపి నాయకులు అందజేశారు. ప్రదర్శనను తిలకించేందుకు గుడివాడ పరిసర ప్రాంతాల నుంచే కాక ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, అభిమానులు తరలి వచ్చారు.

'కియో' మొర్రో

- ఇంటి అద్దెలు పెను'కొండ'ంత
- సామాన్యులను గదులు ఖాళీ

చేయాలని యజమానుల ఒత్తిళ్లు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలో వస్తున్న కియో కార్ల తయారీ పరిశ్రమల వల్ల ఇంటి అద్దెలు అమాంతంగా పెరిగాయి. వీటిని చూసి సామాన్యుడు 'కియో' మొర్రో అనే పరిస్థితులు నెలకొన్నాయి. అమాంతంగా మూడింతలు అద్దెలు పెంచేసే సరికి నిరుపేదలకు దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయి. పెంచినంత మేర అద్దె చెల్లించకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని ఇంటి యజమానులు ఒత్తిడి పెంచుతున్నారు. పెనుకొండ మొన్నటి వరకు ఓ చిన్న పట్టణం. 27 వేల జనాభా ఉంది. 6,752 గృహాలున్నాయి. ఈ పట్టణానికి ఆనుకుని ఉన్న యర్రమంచి గ్రామం వద్ద దక్షిణ కొరియాకు చెందిన 'కియో' కార్ల పరిశ్రమ ఏర్పాటు పనులు సాగుతున్నాయి. ఈ పనుల్లో సుమారు రెండు వేల మంది వరకు ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. వీరందరు ఉండటానికి అనువైన పట్టణం పెనుకొండ కావడంతో అందరూ అక్కడ ఇళ్ల కోసం వస్తున్నారు. దీంతో డిమాండ్ పెరగడంతో యజమానులు బాడుగలను మూడింతల వరకు పెంచేశారు. ఇప్పటివరకు రూ.1500 వరకున్న చిన్న ఇంటి బాడుగను రూ.ఐదువేలకు పెంచేశారు. చిన్న వ్యాపారాలు చేసు కునే జీవనం సాగిస్తూ వచ్చిన నిరుపేదలు అంత బాడుగలు కట్టలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాడుగలు కట్టలేకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తెస్తున్నారని, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని విచారం వ్యక్తం చేశారు. ఈ విధంగా సుమారు బాడుగకు ఉంటున్న వెయ్యి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీనితోపాటు గుట్టూరు వంటి చిన్న గ్రామాల్లోనూ రెండు గదుల ఇళ్లు పది వేల రూపాయలకు బాడుగ పెరిగింది.

బాడుగ రూ.5వేలకు పెంచారు

భర్త చనిపోయాడు. పూలు అల్లి వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తున్నాను. ఇప్పటివరకు రూ.1200 బాడుగ ఉండేది. ఇప్పుడు కార్ల పరిశ్రమ వస్తోందంటూ ఇంటి అద్దెలను ఒక్కసారిగా రూ.ఐదువేలకు పెంచారు. ఇంత చెల్లించలేమంటే ఇళ్లు ఖాళీ చేయాలని యజమానులు అంటున్నారు. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ పెనుకొండకు వచ్చినప్పుడు మా సమస్యను విన్నవించుకుని ఇళ్లు మంజూరు చేయాలని కోరేందుకు వెళితే ఆయన్నూ కలవనీయలేదు. ఉన్న ఫళంగా ఇళ్లు ఖాళీ చేస్తే మేము బజారులో పడాల్సిందే.

- సుగుణభాయి, పెనుకొండ, అనంతపురం జిల్లా

అరకొర ఆదాయంతో బాడుగ కట్టలేం..



చిన్న వ్యాపారం చేసుకుని జీవనం సాగించే మాకు నెలకు మహా అయితే రూ.10 వేల ఆదాయం వస్తుంది. ఇందులో షాపు బాడుగ కట్టాలి. ఇంటికీ కట్టాలి. ఇప్పటివరకు తక్కువ బాడుగలు కాబట్టి కట్టుకుంటూ వచ్చాం. ఇప్పుడు చూస్తే మూడింతలు పెరిగాయి. వచ్చే నెలసరి ఆదాయం బాడుగలకే సరిపోదు. ఇక తమ కుటుంబం ఎట్టా గడుస్తుందో తెలియకుండా ఉంది. కియో వస్తే కొత్తగా ఉపాధి వస్తుందని అందరం ఆశించాం. రాకపోగా ఉన్న బతుకులు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు యజమానులు ఇళు ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఖాళీ చేస్తే ఈ ఊళ్లో ఉండటానికి వీలుండదు.

- లీలా భాయి, కొత్తపేట కాలనీ, పెనుకొండ, అనంతపురం జిల్లా

ప్రత్యేకం

ఇక ఆన్‌లైన్ చెల్లింపులు

- మధ్యాహ్న భోజన పథకంలో మారిన బిల్లుల చెలింపు విధానం
- సెప్టెంబరు, అక్టోబరు మొత్తాలు నిర్వాహకుల ఖాతాల్లో జమ
- హైస్కూళ్లకు జూన్ నుంచి పెండింగు



మద్దికెరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు బిల్లుల చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వమే ఖాతాల్లో వేస్తోంది. గతేడాది డిసెంబరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సెప్టెంబరు, అక్టోబరు నెలల బిల్లులు చెల్లించింది. కానీ హైస్కూళ్లకు జూన్ నుంచి డిసెంబరు వరకు బిల్లులు పెండింగులో ఉంచింది. ఒక్క కర్నూలు జిల్లాకే రూ.10 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నట్లు సమాచారం. బిల్లులతోపాటు గౌరవ వేతనాలు కూడా చెల్లించాల్సి ఉంది. వాటి గురించి ఇటు విద్యాశాఖ అధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కర్నూలు జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1910, ప్రాథమికోన్నత 477, ఉన్నత పాఠశాలలు 544 ఉన్నాయి. ఎయిడెడ్‌లో ప్రాథమిక 103, ప్రాథమికోన్నత 25, ఉన్నత పాఠశాలలు 45 ఉన్నాయి. వీటిలో 6 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. 2003 జనవరి 2వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 2008 అక్టోబర్ 13 నుంచి 9, 10వ తరగతుల విద్యార్థులకు అమలు చేస్తున్నారు. 2017 జూన్ నెల నుంచి ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నిర్వాహకులకు నాలుగు నెలలు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. మొత్తం రూ.10 కోట్లకు పైగా బిల్లులు పేరుకుపోయాయి. నిర్వాహకులు అప్పులు చేసి అతికష్టంతో మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నారు. ఆర్థిక సమస్యల వల్ల భోజనంలో నాణ్యతను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. బిల్లుల అందకపోవడంతో భోజనం నాణ్యతపై నిర్వాహకులను ప్రశ్నించలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

నిర్వాహకుల ఖాతాలకే నిధులు : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు చెల్లింపులో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి నేరుగా వారి ఖాతాలకు నిధుల జమ కానున్నాయి. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం 2017 సెప్టెంబరు, అక్టోబరు నెలల బిల్లులు వారి ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ ముందున్న బిల్లుల చెల్లింపుల మాటేమిటి : ఆన్‌లైన్ కాకముందున్న బిల్లుల బకాయిలు దాదాపు రూ.7 కోట్లకు పైగా ఉన్నాయి. ప్రభుత్వం వీటి ప్రస్తావన తేవడం లేదు. జిల్లా వ్యాప్తంగా గతేడాది జూన్ నుంచి కొందరికి, ఆగస్టు, నవంబరు, డిసెంబరు నెలల బిల్లులు కొందరికి చెల్లించాల్సి ఉంది. వీటిని తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం సమీపిస్తున్నందున బకాయిలు నిలిచిపోతే ఆన్‌లైన్ గొడవలో ఎవరూ పట్టించుకోరని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

ఇక నుంచి బిల్లులన్నీ ఖాతాలకే వస్తాయి

జూన్ నెల నుంచి కొన్ని పాఠశాలలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఆలస్యమైనప్పటికీ ఆన్‌లైన్ ద్వారా ఖాతాలకే నిధులు జమ అవుతాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు సమస్య పరిష్కారం అవుతుంది.

శ్రీధర్, అవుకు ఎంఇఒ

సంక్షిప్తం

విశాఖలో వైభవంగా సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం: ప్రభుత్వ ఆధ్వర్యాన విశాఖలో సంక్రాంతి సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శాసనమండలి సభ్యులు పివిఎన్.మాధవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ భోగిమంటలను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. పలు జానపద నత్యాలు, గంగిరెడ్ల విన్యాసాలు, కోలాటాలు, ధింసా, డప్పుల వాయిద్యాలు, చెక్కభజన, బుడబుక్కలు, కొమ్మదాసరి, హరిదాసుల కీర్తనలు, తప్పెటగుళ్ల హోరుతో స్థానిక వుడా చిల్డ్రన్ థియేటర్ పరిసరాలు మారుమోగాయి.

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డిఆర్ఎం

ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా): శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్లో 2, 3, 4 ప్లాట్‌ఫారాల నుంచి వెలుపలకు రావడానికి చేపట్టిన కాలినడక బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఈస్ట్‌కోస్టు రైల్వే డిఆర్ఎం ముకుల్‌శరన్ మథూర్ సూచించారు. ఆదివారం ఆయన ఈ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రైల్వే ప్లాట్‌ఫారం, పరిసర ప్రాంతాలు, రైల్వే క్వార్టర్లలో అదనపు భవనాల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ డిసిఎం సునీల్, ఎఇ గురునాధరావు, బుకింగ్ సూపర్‌వైజర్ ఆనంద్, ఐడబ్ల్యు సత్యమూర్తి, ఆర్‌పిఎఫ్ ఒసి సునీల్‌కుమార్, రత్నకుమార్ ఉన్నారు.

మద్యం మత్తులో తండ్రీకొడుకు ఘర్షణ కొడుకు మృతి

సంతమాగులూరు : మద్యం మత్తులో తండ్రీ కొడుకులు ఘర్షణ పడిన ఘటనలో కొడుకు మృతి చెందాడు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. బ్రహ్మానాయుడు అనే వ్యక్తి తన కొడుకుతో గొడవ పడ్డాడు. ఆ సమయంలో తండ్రీకొడుకులిద్దరూ మద్యం సేవించి ఉన్నారు. ఇనుపరాడ్డుతో తండ్రి బ్రహ్మానాయుడు తన కొడుకును కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు

అత్యవసర కేసుల్లో జిల్లా కేంద్రాస్పత్రి వైద్యుల తీరు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రి వైద్యులు చిన్నచిన్న కేసులను కూడా విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు, వారి బంధువులు తీవ్ర వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. ప్రాణాపాయం లేని కేసులను, ఇక్కడ వైద్యం అందించేందుకు అవకాశం ఉన్న కేసులను సైతం ఆస్పత్రిలో సదుపాయాల్లేవంటూ పంపేస్తున్నారు. పలు కేసులను కెజిహెచ్‌కు రిఫర్ చేయడంతో కొంతమంది పేదలు గత్యంతరం లేక ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర కేసులను విశాఖ తరలించేందుకు ఈ ఆస్పతిలో అంబులెన్స్ సదుపాయం లేకపోవడంతో ప్రయివేట్ అంబులెన్స్‌లకు వేలాది రూపాయలు చెల్లించుకోవాల్సి వస్తోంది. కేంద్రాస్పత్రి అన్న మాటే తప్ప అత్యవసర వైద్యానికి నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోజుకు 300 కేసులు వరకూ జిల్లా కేంద్రాస్పత్రికి వస్తుంటాయి. విజయనగరం పట్టణ పరిసరాలే కాకుండా పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, ఎస్.కోట ప్రాంతాల నుంచి అత్యవసర కేసులు ఈ ఆస్పత్రికి రిఫర్ అవుతుంటాయి. ఎంతో ఆశగా ఈ ఆస్పత్రికి సుమారు 60, 70 కిలోమీటర్ల దూరం నుంచి వస్తే, ఇక్కడి వైద్యులు కెజిహెచ్‌కు రిఫర్ చేయడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. జిల్లా పాలకులు, అధికారులు చొరవ చూపి కేసులను అనవసరంగా రిఫర్ చేయకుండా చూడాలని, ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు కేంద్రాస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యం అందించేలా మౌలిక సదుపాయాలు, వైద్య నిపుణులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బాలసాయి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్:

కర్నూలు సాయిబాబా దేవాలయం సమీపంలో బాలసాయి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మానవ వనరుల సహాయ శాఖ మంత్రి ఉపేంద్రకుషవాహ, రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, ట్రస్టు ఆర్గనైజర్ రామరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలసాయి ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.అనంతరం బాలసాయిబాబా మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్‌లను, వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి విదేశాల నుంచి కూడా భక్తులు విచ్చేశారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ

సోమవారం 15 జనవరి 2018



మూఢనమ్మకాల ఇనుపగోడలు
బద్దలుగొట్టుకుని ఎక్కడ జ్ఞానం
వెల్లువై ప్రవహిస్తుందో...
అక్కడికే ఆస్వేచ్ఛాసీమకు
తండ్రీ! నా ఈదేశాన్ని మేల్కొల్పు!

\- రవీంద్రనాథ్ ఠాగూర్



వెలుతురు ముగ్గు

కష్టాల్ని పిండిచేసి
తూరుపు వాకిటిలో నేను
వెలుతురు ముగ్గును వేస్తున్నా
చీకట్లు కమ్మేసిన రాత్రులను చెరిపేస్తూ ..
పీడితుల కలలన్నీ కలబోసి
కవిత్వం అల్లుతున్నాను నేను
సమస్యల తీగలన్నీ సవరిస్తూ
పాట పాడుతున్నాను నేను
అరుణోదయ వాగ్దానమే కదా నా కలానిది

బంతిపువ్వులన్నీ ఏడాదంతా పూయిస్తూ
మార్కెట్ మైదానాల్లో కుప్పలయ్యాయి
రాలిన పువ్వుల్లాంటి జీవితాల్లోకి
తొంగి చూస్తున్నాను నేను
గుప్పెడు గొబ్బెమ్మకు పేడను అమ్ముతూ
మామిడాకునూ సరుకు చేస్తుంటే
కన్నీటి సుడిగుండాల్లో చిక్కుకున్న
జీవితాలు మళ్లీ చిగురించాలని
ఆశపడుతున్నా నేను

ఇంద్ర ధనస్సు రంగుల్లోని ఎరుపుని తీసుకుని
నీకూ నాకూ మధ్య దూరాన్ని తగ్గిస్తూ
సముద్ర ఘోషలు ఉప్పొంగేవేళ
తీరం చేరేందుకు వ్యూహం రచిస్తున్నా నేను
సంక్రాంతి సంక్రమణ వేళ ..!

\- శాంతిశ్రీ
83338 18985

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం,
ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ - 2.
prajasavvadi@gmail.com

భావ విప్లవ వైతాళికుడు త్రిపురనేని

సందర్భం

తెలుగునాట హేతువాద దృష్టితో భావవిప్లవం తీసుకొచ్చిన వైతాళికుడు కవిరాజుగా ప్రసిద్ధిగాంచిన త్రిపురనేని రామస్వామి చౌదరి. గురజాడ అప్పారావుతో మొదలైన కొత్తచూపును ఆయన ప్రచండశక్తితో కొనసాగించడమే కాదు, ప్రత్యామ్నాయ సాహిత్య సంస్కృతిని సృష్టించగలిగారు. దేశంలో రాజకీయ పాలనాధికారాన్ని నిర్ణయించడంలో కీలకపాత్ర వహిస్తున్న పలు హిందీ రాష్ట్రాల్లో మత సామరస్య పరిరక్షణ పెద్ద సవాలుగా ఉంటే- దక్షిణాదిన దాదాపుగా లౌకికభావాలదే ప్రధాన స్థానంగా ఉంది. అతి ముఖ్యమైన ఈ సామాజిక వ్యత్యాసానికి మూలాలు తెలుగు సాంస్కృతిక రంగచరిత్రలో ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే- ఎందరో మహామహులు ఇక్కడ సంఘ సంస్కరణ కోసం సాగించిన సమరాలు కనిపిస్తాయి. వేమన నుంచి గురజాడ, కందుకూరి వీరేశలింగం వరకూ సాగిన ఆ సంస్కరణ కృషికి హేతువాద దృష్టికి కొనసాగింపు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి. ఇది ఆయన 75వ వర్ధంతి సంవత్సరం. ఒక సందర్భంలో డిఎంకె వ్యవస్థాపకుడైన అన్నాదురై- త్రిపురనేని పెరియార్ రామస్వామి నాయకర్ (పెరియార్ అంటే పెద్దాయన)తో పోలుస్తూ- "మాకు ఒక రామస్వామి. మీకు ఒక రామస్వామి. వారిద్దరూ మన రామస్వాములే. వారి పేర్లలోనే కాదు, వారి మనస్సుల్లోనూ ఏకత్వం కనిపిస్తుంది. ఇద్దరూ సాంఘిక విప్లవయోధులే. వారి ఆలోచనా విధానాలతో హేతువాదం ప్రాతిపదికగా అన్ని పార్టీల వారూ సమైక్యంగా కృషి చేద్దాం." అన్నారు.



కృష్ణాజిల్లా అంగలూరులో రైతు కుటుంబంలో 1887 జనవరి 15న పుట్టిన త్రిపురనేని అప్పటి వాతావరణానికి భిన్నంగా చదువుపై చాలా శ్రద్ధ చూపేవారు. తన 23వ ఏట మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. అప్పుడే ఆయన కురుక్షేత్ర సంగ్రామం రాశారు. ఇంటర్మీడియట్ చదివేందుకు బందరు నోబుల్ కాలేజీలో చేరిన సమయంలోనే అవధాన విద్యలోనూ ప్రతిభ చూపించారు. బార్ ఎట్ లా కోసం ఐర్లాండు వెళ్లి నూతన భావాలు వంటపట్టించుకున్నారు. 'వీరగంధము తెచ్చినారము, వీరులెవ్వరో తెల్పుడి..' అంటూ స్వాతంత్ర్య పోరాటయోధులకు స్వాగతం పలికారు. ప్రజా జీవితంలోనూ, రాజకీయాల్లోనూ పాత్ర వహించిన ఆయన తెనాలి పట్టణానికి దీర్ఘకాలం పాటు ఛైర్మన్‌గా పనిచేశారు. రాజకీయంగా మితవాదానికి పేరొందిన జస్టిస్ పార్టీలో ఉన్నా హేతువాదానికి పెద్దపీట వేశారు. మూఢ నమ్మకాలు కులాధిక్యత దట్టంగా అలముకుని ఉన్న ఆ రోజుల్లో సనాతన విశ్వాసాలను, పురాణ ప్రబోధాలను నూతన దృష్టితో చూడటం అలవాటు చేసుకున్నారు. ఆయన కుమారుడు, ప్రసిద్ధ రచయిత అయిన గోపీచంద్ తన రచనను నాన్నకు అంకితం చేస్తూ- ఆ అంకితం 'ఎందుకు' అన్న ప్రశ్న నేర్పినందుకు అని కారణం చెప్పారు. కవిరాజు కుమారుడికి మాత్రమేగాక కొన్ని తరాలకు ఆ ప్రశ్న నేర్పారు. వివాహ విధులనూ సంస్కరించాలని చెబుతూ- పౌరోహిత్యం ఒక కులానికే పరిమితం కానక్కర్లేదన్నాడు. తేటతెలుగులో దానిపై ఓ పుస్తకం రాశారు. ఇవన్నీ సంచలనాలే! వీటిని ఈనాటి కుల రాజకీయాలతో పోల్చడం చారిత్రికంగా పొరబాటవుతుంది. సామాజిక చలనంలో భాగంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. హేతువాదం సామాజిక సమానతా సూత్రం ముందుకు తెచ్చిన సవాలుగా వాటిని చూడాల్సి ఉంటుంది.

'మట్టికుండలో పుట్టితివి కదా.. నీది ఏ కులము?' అంటూ ఎన్టీఆర్ డైలాగులు మార్మోగుతుంటే తెలుగువారు ఉర్రూతలూగిపోయారు. రాముడి పేరిట రాజకీయం నడిచే ఈ దేశంలో రావణ, దుర్యోధన పాత్రల్లో రాణించిన ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. దీని వెనుక కవిరాజు వంటి వారు వేసిన బీజాలు ఉన్నాయి. దుర్యోధన సంభాషణలు రాసిన కొండవీటి వెంకటకవి కూడా కవిరాజు శిష్యుడే. కురుక్షేత్ర సంగ్రామం నాటకంలోనే కవిరాజు ధర్మం పాండవులవైపే ఉందా అన్న సుదీర్ఘ చర్చ చేశారు.

కవిరాజు పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది ఆయన రాసిన 'శంభూకవధ 'నాటకం. ధర్మావతారుడుగా పూజలందుకునే రాముడు మహాతపస్సు చేస్తున్న శంభుకుణ్ని కేవలం శూద్రుడైన నేరానికి గాను నిస్సంకోచంగా వధించటం ఈ నాటకం ఇతివృత్తం. అలాగే బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించిన పాపానికి వేనరాజును అతని కుమారుడైన పృథుని చేతనే ఆర్య రుషులు హత్య చేయించిన ఉదంతం ఖూనీ.

తెలుగులో నూతన భావాలు అంకురించిన కాలం 1920వ దశకం. అప్పుడే ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల రాశారు. చలం ముందుకు వచ్చారు. ముద్దుకృష్ణ అశోకం వంటి నాటిక రాశారు. వీరిలో ఉన్నవ గాంధేయవాది అయినప్పటికీ తొలిసారి బొల్షివిక్ విప్లవ ప్రస్తావన చేశారు. ఇక ముద్దుకృష్ణ రామాయణ పాత్రలను కొత్త కోణంలో చిత్రిస్తూ అశోకం రాశారు. త్రిపురనేని రామస్వామి చౌదరి అలా గాక పురాణాల్లో చెప్పిన విషయాల ఆధారంగానే వాటిలోని అమానుషత్వాన్ని ఎత్తిచూపించగలిగారు. దీనిపై ఆ రోజుల్లో కమ్యూనిస్టు నాయకులైన మద్దుకూరి చంద్రం, పుచ్చలపల్లి సుందరయ్యల సాహిత్య విమర్శల్లోనూ ప్రముఖంగా ప్రస్తావనలు చూడొచ్చు.

'త్రిపురనేని రామస్వామి చౌదరి గారి *కురుక్షేత్ర సంగ్రామం, సూత పురాణం* వగైరా రచనలు ఇలాటివే. వీరి భాష కవిత్వ పోకడ చక్కగా ఉంటుంది. హిందూ సంప్రదాయాలను, బ్రాహ్మణ మతాన్ని నిరసించుతూ బయల్దేరిన వీరు రాజకీయంగా జమీందారీ నాయకత్వంలో ఉన్న జస్టిస్ పార్టీకి అనుబంధమైపోయారు. అందుకే ప్రజలను ఏమాత్రం ఉత్తేజపర్చలేకపోయారు. వీరు వేనరాజు కథను ఖూనీ పేరుతో నాటకంగా అభ్యుదయకరమైన పోకడలతో చిత్రించారు. వీరి రచనల్లో ఎన్నదగిన పాట 'వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడీ'.. త్రిపురనేని రామస్వామి శంభుకవధ, ముద్దుకృష్ణ అశోకం, చలం సావిత్రి వగైరాల్లో పురాణ గాథలనే తీసుకుని వాటిని కొత్త దృక్పథం నుంచి చిత్రించారు.' ఇది మద్దుకూరి చంద్రం విమర్శ. దీనిలోని లోపాన్ని పేర్కొంటూ పుచ్చలపల్లి సుందరయ్య వారి రచనల కన్నా త్రిపురనేని ఏ విధంగా మెరుగో ఇలా రాశారు : 'ఖూనీ, శంభుక వధ ఆ రోజుల్లోని దురాచారాన్ని ఖండిస్తూ నేటి ప్రజలకు మార్గం చూపిస్తూ రాసిన అభ్యుదయ రచనలు. అశోకం, సావిత్రి వంటి రచనలు అలాటివి కావు' దీనికి తన కారణాలేవో కూడా సుందరయ్య చూపించారు. మొత్తంపైన నాటి పురాణ పాత్రలను నేటి ప్రమాణాలతో మార్చి రాయడంలో కన్నా నాటి బోధలలో బూటకత్వాన్ని నిరూపించి నేటి కాలంలో మూఢ నమ్మకాలపైన కులాధిక్యతలపైన, వివక్షతలపైన పోరాటానికి వినియోగించుకోవడం కీలకం అన్నది సుందరయ్య భావన. రంగనాయకమ్మ రామాయణ విషవృక్షం, ఓల్గా మృణ్మయనాదం వంటి రచనలకు భిన్నమైంది కవిరాజు మార్గం. తాత్వికరంగంలో దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ అలాగే ప్రాచీన భారతంలోని హేతువాద భౌతికవాద వారసత్వాన్ని పరిశోధించి, గొప్ప అవగాహన ఇచ్చారు.

హైటెక్‌యుగంలో ఉన్నత విద్యావంతులనుకున్నవాళ్ళూ విచక్షణారహితంగా ప్రతిదానికి తల ఊపుతూ మూఢత్వంలో కూరుకుపోతున్న నేటి దశలో త్రిపురనేని వంటి వారి రచనల అవసరం మరింత పెరుగుతున్నది. నేడు ఎవరో చెప్పారని చదవకుండానే సంప్రదాయం పేరుతో ప్రతిదీ అనుసరించే విపరీతం చూస్తున్నాం. కవిరాజు ఆ రోజుల్లోనే పురాణాలను మథించి, వాటిలో విషయాల ప్రకారమే విశ్లేషించి, విమర్శించారు. ఆయన ఖూనీకి పూర్తి వ్యతిరేకమైన ఇతివృత్తంతో వేనరాజు రాసిన విశ్వనాథ సత్యనారాయణ కూడా కవిరాజును ఇలా ప్రశంసించారు : 'హేతువాద యుగంలో కవులందరికీ ఆది పురుషుడు త్రిపురనేని రామస్వామి చౌదరి. ఆయన సూత పురాణమొక మహాగ్రంథం. ఆయన పద్య రచనా శైలి ఎంతో మనోహరంగా ఉంటుంది. భావాలు పురాణాలకు వ్యతిరేకం. మొదట విప్లవం తెచ్చింది ఆయన.'

విశ్వనాథ ఏమన్నప్పటికీ నిజానికి కవిరాజు పురాణాల్లో చెప్పిన దాని ఆధారంగానే వాదించారు. వాటిని కావ్యాలుగా గౌరవిస్తూనే కాలానుగుణంగా అర్థం చేసుకోవడానికిగాను ఆ పేరిట చలామణి అవుతున్న అసంబద్ధ, అమానుష భావాలను ప్రశ్నించారు. ఆ ప్రశ్న, ప్రతిఘటన ఈనాడు మోడీ రాజ్యంలో మరింత అవసరం. మతోన్మాదం, ఛాందసం పెరిగిపోయిన నేపథ్యంలో ఆ అంశాలపై అధ్యయనంతో అవగాహన కలిగించాలి. కేవలం అవహేళన చేస్తే అది అవతలివారికే ఉపయోగం. లేక పురాణగాథలను మనకు నచ్చినట్టు తిరగరాసుకుంటే కలిగే ప్రయోజనమూ శూన్యం. చరిత్రలో ఆలోచనా పరిణామంలో భాగంగా వాటిని అర్థం చేసుకుంటూ ఇతరులకు చెప్పగలిగితే అందరికీ అవగాహన పెరుగుతుంది. తాము పూజించే దేవుళ్లను లేదా గ్రంథాలనూ అవమానిస్తున్నట్టు కనిపిస్తే మత రాజకీయాలకే మేలు కలుగుతుంది. కవిరాజు వర్ధంతి అందుకు దోహదం చేస్తుందని ఆశిద్దాం.

(త్రిపురనేని జయంతి జనవరి 15న, వర్ధంతి జనవరి 16న ఉండటం ఒక విశేషం.)

\- తెలకపల్లి రవి

పాపికొండల్లో కథల విహారం

నివేదిక

పండగ రోజుల్లో ప్రతి ముచ్చటా ఒక కథే! బాల్యం గుర్తు రావటం ఒక కథ. ఊరెళ్లటం ఒక ఉత్సాహపూరితమైన కథ. మరి కథను తలకెత్తుకొని కథకులే ప్రయాణం కడితే ఎలా ఉంటుంది. అదీ లాంచీ ఎక్కి పాపికొండల్లో విహరిస్తే ఎలా ఉంటుంది?

గతనెల 23, 24 తేదీల్లో చోటుచేసుకుందీ సన్నివేశం. ఈ అందమైన సమావేశం అందమైన గోదావరి గౌతమీ తీరాన ప్రారంభమైంది. ఆథర్స్ అండ్ రైటర్స్ అనే వాట్సప్ బృందం సభ్యులు దాదాపు 30 మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ బృందానికి రథసారథి ప్రముఖ రచయిత గొర్లి శ్రీనివాసరావు కాగా, ఇందూ రమణ, సూరపు శాంతారాం, విరించి, డాక్టర్ సుగుణరావు, ఆకునూరి మురళీకృష్ణ, కెకె భాగ్యశ్రీ, కట్టా రాంబాబు, తటవర్తి నాగేశ్వరి, పసుపులేటి సత్యవేణి, నండూరి సుందరీ నాగమణి, కళా గీత, డాక్టర్ చెల్లపిళ్ల సూర్యలక్ష్మి, సి.యమున, మీనాక్షి శ్రీనివాస్, బులుసు సరోజినీదేవి, ఇంద్రగంటి నరసింహమూర్తి, చింతా జగన్నాథరావు, ఎంఆర్‌వి సత్యనారాయణమూర్తి, ఆకుండి సాయిరాం, సీఎస్ రాంబాబు, రాజేష్ యాళ్ళ తదితరులు పాల్గొన్నారు. అనేక ప్రాంతాల నుంచి రెండు రోజుల ప్రణాళికతో రాజమహేంద్రవరానికి విచ్చేసిన కథకులు మొదటిరోజు రివర్‌బే హోటల్లో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవ్య వీక్లీ సంపాదకులు ఎఎస్ జగన్నాథశర్మ, ప్రముఖ హాస్యనటులు, రచయిత పోలాప్రగడ జనార్ధనరావు (జెన్నీ) హాజరయ్యారు. జగన్నాథశర్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ- వాట్సప్ వంటి ఆధునిక సాంకేతికతలు ఆత్మీయతలకు అవరోధాలుగా నిలుస్తున్నాయని అందరూ అనుకునే మాటను ఈ సమావేశం తప్పని రుజువు చేస్తోందని అన్నారు. కథకులంతా ఇలా కలుసుకోవడం, సాహిత్య చర్చలు, కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆత్మీయంగా ఉందని ప్రశంసించారు. ఆ తరువాత కథకులంతా తమ స్వీయకథా పఠనం ప్రారంభించారు. కథను చదివిన ప్రతి రచయిత(త్రి)కీ ఓ అందమైన కానుకను నిర్వాహకులు అందజేశారు. మధ్యమధ్య జెన్నీ ఛలోక్తులతో మధ్యాహ్నం వరకూ హుషారుగా సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా నడిచింది. కథపై జగన్నాథ శర్మ వ్యాఖ్యానం మరో ఆకర్షణగా నిలిచింది. భోజన విరామానంతరం తిరిగి సమావేశమైన కథకులు సాయంత్రం వరకూ ఒక ప్రశ్నోత్తరావళి కార్యక్రమాన్ని వినోదభరితంగా నిర్వహించారు. సాయంత్రపు గోదావరి సౌందర్యాన్ని తిలకించడానికి తీరం వైపు అడుగులు వేశారు. గోదావరి హారతి, ఇస్కాన్ దేవాలయ సందర్శన తరువాత తిరిగి బసకు వచ్చి భోజనం చేసి విశ్రమించారు.



రెండోరోజు పురుషోత్తపట్నం నుంచి లాంచీపై గోదావరి నదిలో విహారం. పాపికొండలకు ప్రయాణం. ఆరోజు ఆదివారం కావడంతో సందర్శకులతో లాంచీల సందోహం ఎక్కువగానే ఉంది. రచయిత మిత్రులు గోదావరి సోయగాలను తిలకించేందుకు లాంచీ పైఅంతస్తులో కూర్చున్నారు. 'పున్నమిలాగా వచ్చిపొమ్మని జాబిల్లడిగిందీ... పుష్కరమల్లే వచ్చిపొమ్మని గోదారడిగిందీ...', 'గోదారికి ఏ ఒడ్డయినా నీరు ఒక్కటే', 'ఉప్పొంగెలే గోదావరీ... ఊగిందిలే చేలో వరీ' వంటి అందమైన పాటలెన్నో మదిలో మెదిలాయి. మెత్తటి నీటి మధ్యలోంచి లాంచీ వెళు తున్న అనుభవం కథకుల హృదయాల్లో ఆనందగోదావరిని ఆవిష్కరించింది. దేవీపట్నం, గండిపోచమ్మ తల్లి నెలవు గొండూరు మీదుగా సాగిన ఈ ప్రయాణంలో ఎన్నో చలనచిత్రాలను చిత్రీకరించిన ప్రదేశాలను పరిచయం చేశాడు మా గైడ్ కమ్ యాంకర్ కమ్ డ్యాన్సర్. అనేక పచ్చని గ్రామాలను, అందమైన కొండలను, వాటిని కబళిస్తోన్న పోలవరం ప్రాజెక్టు పనులనూ దాటుకుని చివరకు పాపికొండల ప్రాంతాన్ని చేరుకుంది మా 'పున్నమి' లాంచీ. కొండల నడుమ, గోదావరి మధ్యలో ప్రయాణిస్తున్నప్పుడు రచయితల మనసులో రేగిన సంతోష సంరంభం అంతా ఇంతా కాదు. ఇంత సౌందర్యానికి నెలవైన ఈ ధరిత్రికి ప్రతిగా మనం ఏమిస్తున్నాం?

పాపికొండలు దాటి పేరంటాలపల్లి రేవుకు చేరుకుంది లాంచి. పాపికొండల చేరువలో పెద్ద రేవు ఇది. ఇక్కడినుంచి భద్రాచలం వెళ్లే లాంచీలు బయలుదేరతాయి. అక్కడ దాదాపు అరగంట విరామం తీసుకుని రాజమండ్రి దిశగా తిరుగు ప్రయాణం అయింది పున్నమి. అప్పుడు సాహిత్య కార్యక్రమాలు మొదలయ్యాయి. ముందుగా పోలాప్రగడ జనార్ధనరావు (జెన్నీ) రాసిన 'అమ్మకు అక్షరం' కథాసంపుటి ఆవిష్కరణ జరిగింది. సభకు ఆథర్స్ అండ్ స్టోరీస్ బృందం వ్యవస్థాపక పరిపాలకులు గొర్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జగన్నాథశర్మ పుస్తకావిష్కరణ చేశారు. మనసును కదిలించే ఎన్నో కథలు ఈ సంపుటిలో ఉన్నాయని, అన్ని కథలూ వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నవేనని వక్తలు ప్రశంసించారు. రచయిత తన కథల గురించి, కథల్లోని కొన్ని పాత్రల గురించి, తన అనుభవాల గురించి వివరించారు. తరువాత డీఎన్‌వీ రామశర్మ చిరు కవితల పుస్తకం 'స్వాతిముత్యాలు- త్రిపదలు' ఆవిష్కరించారు. సాహితీశోభను సింగారించుకున్న సాయంసంధ్య మరింత అందంగా తయారైంది. కథకుల బృందమంతా తమదైన శైలిలో ఛలోక్తులు, అందమైన మాటలు విసురుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. అంగులూరు తీరం చేరుకుని, అక్కడినుంచి రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం బయల్దేరారు. వాట్సప్‌వంటి సాధనాలు కుచ్చుటప్పాలకే కాదు, సక్రమంగా ఉపయోగించుకుంటే చక్కని ప్రయోజనాలు కూడా ఉంటాయని నిరూపించింది ఈ రచయితల పర్యటన. 30 మంది కథకులు ఒకచోట చేరి కథలు చెప్పుకోవడం, చర్చించుకోవడం, విశ్లేషించుకోవడం నిజంగా ఒక అద్భుతమైన అనుభవం.

\- రాజేష్ యాళ్ళ
97004 67675

గౌర హరిదాస్‌కు 'చాసో స్ఫూర్తి'

పురస్కారం

తెలుగు సాహిత్య అవార్డులన్నీ తెలుగువారి చుట్టూ, కొన్ని సందర్భాల్లో ప్రాంత ప్రేమ, వాదాల ప్రేమ, కుల సమీకరణాల అభిమానాల చుట్టూ తిరుగాడ్డం చూస్తూ ఉన్నాం. ఈ విషయంలో ఇరుగు పొరుగు భాషల వేపు చూసే అలవాటు పెద్దగా మనకు లేదు. ఒక ఎన్టీఆర్ పురస్కారం పేరిట మాత్రమే తెలుగు నేల మీంచి కొందరు భారతీయ స్థాయి రచయితలకు గౌరవ పురస్కార ప్రదానాలు జరుగుతున్నాయి. ఇటువంటి నేపథ్యంలో, 23వ చాసో స్ఫూర్తి అవార్డు ప్రముఖ ఒడియా కథా రచయిత గౌర హరిదాస్‌కు ఈ నెల 17న విజయనగరంలో ప్రదానం చేస్తుండడం ఎంతైనా సంతోషకరం.



కథలు 1981 నుంచి రాస్తూ నేటికీ 17 కథా సంపుటాలు ప్రచురించిన గౌర హరిదాస్, ఒడియా సాహిత్యంలో సుప్రసిద్ధ సాహితీవేత్త. అత్యధిక జనాదరణగల 'సంబాద్' దినపత్రికకు ఆయన ఫీచర్స్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 38 ఏళ్ల సాహిత్య జీవితంలో పలు అవార్డులు (రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డులతో బాటుగా) పొందారు. ఆరు నవలలు, కవిత్వం, నాటకం, యాత్రాసాహిత్యం, సంకలనాల సంపాదకత్వ నిర్వహణ, కాలమ్ నిర్వహణ, ఇలా పలు సాహిత్య రూపాల్లో తన రచనా ప్రతిభ కనబరుస్తున్నారు. పలు దేశాల్లో పర్యటించి, ప్రపంచ సాహిత్య స్వరాల్లో తన తూర్పు భారత, ఒడియా సాహిత్య స్వరాన్ని కూడా వినిపించారు.

'మేకు' అనే వీరి కథలో, 'ఏకు మేకయ్యాడు' అనే సామెతకు అన్వయం లాగా, కన్యాశుల్కంలో మన రామప్ప పంతులు వలె తోచే కయ్యాలకోరు (లిటిగంట్) నకుల్ నాయక్ పాత్రను చిత్రిస్తాడు. ఈ పాత్ర ఉన్నదానికీ, లేనిదానికీ అందరిపైనా క్రిమినల్ కేసులు బనాయించి, సాక్ష్యాలను పుట్టించి, వారి జీవితాలు అస్తవ్యస్తమయ్యేలా చేసి, అందులో ఒక పైశాచికానందాన్ని పొందే పాత్ర. ఇలా ప్రజలను బాధ పెట్టవద్దని అతని కొడుకు బ్రజకిషోర్ కూడా చెప్పి చూస్తాడు. అయినా అతడు వినడు. ఊరికి చెందిన గోపాల్ మాస్టర్‌ను పేదలకు సాయపడుతున్నందుకు, నకుల్ నాయక్ అతడిని అన్యాయంగా కేసుల్లో ఇరికిస్తాడు. గోపాల్ పోలీసుల ఆధీనంలో ఉన్న సమయంలో అతడి భార్య ప్రసవ వేళ తగు సహాయం లేక బిడ్డను కోల్పోతుంది. తండ్రి తప్పుడు కేసులకు పాల్పడ్డం చూడలేక, కొడుకు తండ్రిపై ఓ కేసు బనాయిస్తాడు. దేశ భద్రతా రహస్యాలను బంగ్లా దేశీయులకు అమ్మ చూపుతున్నాడని కేసు పెట్టి, ఫిర్యాదు చేస్తాడు. పోలీసులు దేశద్రోహ నేరం కింద, నకుల్ నాయక్‌ను అరెస్టు చేస్తారు. అందరికీ కోర్టు కేసుల మేకులు కొట్టే నకుల్ నాయక్‌కి కూడా, అలానే ఒక స్వానుభవం ఎదురు పడ్డమే ఈ 'మేకు' కథ.

'కొరాపుట్' అనే పేరుగల వీరి కథా సంపుటిలో అదే శీర్షికతో ఒక కథ రాశారు. పూర్ణిమ అనే కొత్తగా పెళ్ళైన యువతి, తన భర్త ఉద్యోగం చేస్తున్న చోటికి, మొదటిసారి వెళ్ళినప్పటి సంఘటన అది. ఆమెను కొరాపుట్ స్టేషన్‌లోనే, దిగీ దిగగానే నక్సల్స్ కిడ్నాప్ చేస్తారు. భర్త ప్రశాంత్ నుంచి కొంత సొమ్ము కోరతారు. ఈ కథ ఒడిశా మారుమూల గ్రామాల జీవన స్థితిగతులను వివరిస్తూ నడుస్తుంది. భర్త ప్రశాంత్ నక్సల్స్‌కు సొమ్ము చెల్లించి ఆమెను తీసుకువెళ్తుండగా, అంత సొమ్ము ఎలా ఇచ్చారు అని అడుగుతుంది పూర్ణిమ. 'ఈ ప్రాంతంలో పనిచేసే ప్రతి ప్రభుత్వ ఉన్నతాధికారి పది కోట్లకు పైగా విలువ చేస్తాడు. డబ్బు సమస్య కాదు' అని చెప్పగా, ఆమెకు ఈ సమస్య మూలాలు కొంత అర్థమవుతాయి. ఒక సమయంలో- తనను కిడ్నాప్ చేసిన వారే మెరుగైన వారిగా ఆమె భావిస్తుంది.

మరొక కథలో, పిన్న వయసులోనే భర్త చనిపోగా, తనను పెంచి పెద్ద చేసిన తల్లి, నడి వయసు దాటాక, ఒక వ్యక్తి ఆకర్షణలో పడడం.. ముందు అతని భార్య చూస్తుంది. అది పెద్ద ఆక్షేపణగా ఆమె భర్తకు చెప్పగా, అతను, తన తల్లి ఒకరి పట్ల ఒకరు గౌరవంతో కూడిన ఆసక్తి కలిగి ఉన్నారని కొడుకు తాను గమనించి గ్రహిస్తాడు. ఈ కథలో, తల్లి చూపుతున్న ఈ అనురాగం సమాజం ఎలా అర్థం చేసుకుంటుంది అన్న సమస్యను ఎత్తుకుని మంచి కథ రాసే ప్రయత్నం చేశారు గౌరహరి. చాసో స్త్రీ పాత్రలు కూడా ఇలాంటి సాహసంతో ప్రవర్తిస్తాయి. 'బలి' కథలో దేవతకి జంతు బలులు ఇస్తే కోర్కెలు తీరుతాయన్న మూఢ నమ్మకం ఎలా తప్పో పూజారి ఇంట్లో వచ్చిన ఒక సమస్య ద్వారా వెల్లడి చేస్తాడు. ఇంకా పలు కథల్లో సమాజ ప్రగతికి అవసరమైన చర్చను సజీవంగా ఉంచుతూ, ఒడియా ప్రజల జీవన సంపన్నత పాఠకులకు తెలిసేలా, కథా నేపథ్యాన్ని నిర్మిస్తూ గౌర హరిదాస్ సాహిత్య సృజన చేశారు. ఆయనకు చాసో స్ఫూర్తి అవార్డు ఇవ్వడం వల్ల తెలుగు - ఒడియా సాహిత్య సంబంధాలు మరింత మెరుగుపడతాయి.

\- రామతీర్థ
98492 00385

ప్రజాశక్తి

jeevanapageps@gmail.com

జీవన the family

JEEVANA





సంక్రాంతి ఓ..కళా వైవిధ్యం



సంక్రాంతిని.. కేవలం ఏడాదికోమారు వచ్చే ఇతర పండగల్లా చూడలేం. నిజానికి ఇది మూడురోజుల పండగ. ముక్కనుమను కలుపుకుంటే నాలుగురోజుల పండగ. ఈ నాలుగురోజుల పండగలో సారమేంటో గ్రహించేలోపే.. బాల్యాన్ని వీడి.. బతుకుబాటలో పడుతుంటాం. నిజం చెప్పాలంటే పండగలంటే బాల్యాన్ని గుర్తుచేసే సందర్భం. అందులో సంక్రాంతి పండగల్లో అడుగడుగునా బాల్యంలో పెనవేసుకున్న అనుబంధాలెన్నో. జీవితపు ప్రయాణంలో.. సంక్రాంతిని కలబోసుకున్న అందమైన జ్ఞాపకాలుగా కొనసాగుతూనే ఉంటాయి. ఆ అందమైన పండగ జ్ఞాపకాల్లో ఆటలుంటాయి.. పాటలుంటాయి.. జీవితానికి సరిపడేంత తీపి కబుర్లుంటాయి.. వెలకట్టలేని అనుభవాలూ ఉంటాయి. మన ఇంటి వాకిట నిండార విరబూసే కళాత్మక విషయాలూ ఉంటాయి. మొత్తానికి సంక్రాంతి అంటే తెలుగువారింట ఓ కళల పంట.



సంక్రాంతి పండగ గురించి నీకు తెలిసింది వివరించుము? అని పదిమార్కుల ప్రశ్న ఇస్తే.. సంక్రాంతి అనగా.. గంగిరెద్దులు.. హరిదాసులు.. కోళ్ళ పందాలు, గొబ్బెమ్మలు.. భోగి మంటలూ.. కోలాట గీతాలు.. ఇలా రొటీన్‌గా చెప్పుకునే విషయాలు చాలానే ఉంటాయి. కానీ లోతుగా వెళితే.. వీటితోపాటు మరికొన్ని కళాత్మకమైన అంశాలు చాలానే ఉన్నాయి. అసలు సంక్రాంతి అంటేనే.. ఓ అద్భుతమైన కళల సంబరం. ఆ సంబరాన.. మన ఊరు. మన ఊరిలోని ప్రజలు, ఊరి ప్రజల ఆత్మీయ పలకరింపులు. ఆ పలకరింపుల్లో లయ తప్పని అను'రాగాలు', గురి తప్పని ఆలింగనాలు.. తీపిరుచుల మమకారాలు.. ఆకాశాన ఎగిరే గాలిపటాల కేరింతలు.. ఇలా చెప్పుకుంటూపోతే.. పెద్ద పండగలో మనమంతా హాయిగా సేద తీరాల్సిన విశేషాలు చాలానే ఉన్నాయి.

పిండివంట.. జానపదాల పాట

కొన్నింటి గురించి నోరుతీపి చేసుకుని మాట్లాడుకోవాలి. అసలు పండగంటేనే తీపిరుచుల సమ్మేళనం. సంక్రాంతి అంటే తీపిరుచులతో పాటు, పల్లెపట్టు మమకారాలకు పెట్టింది పేరు. అసలు ఈ తీపి, కారాల్లోనే ఉంది అసలు సిసలైన పండగ కళంతా. హుషారుగా రోకలి దంచాలి. ఉల్లాసంగా తిరగలి తిప్పాలి. రోట్లో తడిసిన బియ్యంవేసి 'అహోం.. ఆ..హోం.. అత్తలేని కోడలు ఉత్తమరాలూ.. ఓయమ్మా" అంటూ.. చిలిపిగా, ఆటపట్టింపు గీతాల్ని.. కొంగుముడేసి మరీ నువ్వా నేనా అన్నట్టు దంచికొట్టాలి. అలా రోకలిమాటున అచ్చతెలుగు జానపదాల సాక్షిగా... రోట్లో బియ్యం పిండై.. మూకిట్లోపడ్డాక.. ఆ వచ్చే రుచులే వేరు. అరిసెలు, బూరెలు, జంతికలు.. అబ్బో.. బ్రహ్మాండం. అందుకే సంక్రాంతి అంటే మన ఇంట తనివితీరని కళల పంట. రోకలిపాట సమేతంగా మన ఆడపడుచులందర్నీ ఒక్కతాటిపైకి తెచ్చే జానపద గీతిక.



పలకరింత.. ఆత్మీయ పులకరింత

ముందే చెప్పుకున్నట్టు.. పండగ పట్ల అవగాహన లేనివారు ఎవరైనా... 'సంక్రాంతి ఎలా ఉంటుందయ్యా?' అని అడిగితే.. అచ్చంగా మా ఊరులా ఉంటుంది.. అని గుండెల మీద చెయ్యేసుకుని మరీ చెప్పేయొచ్చు. ఈ పండగలో ఉన్న అనుబంధాల ఆర్తి అలాంటిది. "ఏరా.. చిన్నబ్బాయ్.. ఎలా ఉన్నావ్రా..? ఊళ్ళో ఉన్నప్పుడు చీపురుపుల్లలా ఉండేటోడివి.. ఇప్పుడు కూసింత రంగొచ్చినట్టున్నావ్.." అని ఆత్మీయంగా పలకరిస్తాడు ఊళ్ళో బాబాయ్. ఆ పలకరింతలో మర్మం ఉండదు. మాయా ఉండదు. ఉండేదల్లా వెలకట్టలేని ఆత్మీయతే. ఆ ఆత్మీయతలోని అందం.. ఆ పలకరింతలోని లయాత్మకమైన యాసకు పట్నవాసులు పులకరించి పోవాల్సిందే! "ఏమే సీతాలూ... ఈడున్నప్పుడు చీముడు ముక్కేసుకుని.. అటూఇటూ పొట్టిగిత్తలా.. తిరిగేదానివి.. ఇప్పుడు.. తేగలో చందమామలా ఎంచక్కా నాజూగ్గా.. తయారయ్యావు.. ఏం మీ ఆయన అన్నం పెడతల్లేదా?" అని పక్కింటి రత్తాలు పిన్ని.. మెటికలు విరుస్తూ.. ప్రేమగా పలకరించే తీరును ఎలా కొనియాడినా తక్కువే. ఆ పలకరింతల్లో.. గోదారి యాసలో, ఆ.. అడిగే తీరులో కచ్చితంగా ఏదో ఒక రాగం ఉండే ఉంటుంది. ఆ రాగం పేరేంటో వెతకాలి.

పల్లెపట్టు.. ఆట

దుప్పటి కప్పుకున్నా.. వెచ్చదనం కుదరనంతగా వణకించే చలికాలంలో మనసు, శరీరాన్ని సరైన రీతిలో సమన్వయం చేసుకోవడానికి.. సరైన కసరత్తు కావాలి. ఆ కసరత్తులు సంఘ జీవనానికి ప్రతీకలుగా నిలవాలి. అలా పుట్టికొచ్చిన ఆటవిడుపు ఆటల్లో.. కబాడీ క్రీడ ఒకటి. ఇది అచ్చతెలుగు గ్రామీణ క్రీడ. కబడ్డీ అనగానే ఎక్కువగా పురుషులు మాత్రమే ఆడే క్రీడ అనే అపోహ చాలామందిలో ఉంది. కానీ సంక్రాంతి సంబరాలప్పుడు మహిళలూ కబడ్డీ ఆటల్లో హుషారుగా పాల్గొనడం చూస్తుంటాం.

వ్యవసాయం పనులు దాదాపు పూర్తయ్యేనాటికి వచ్చే ఈ సంక్రాంతి సంబరాల్లో అప్పటిదాకా వ్యవసాయ క్షేత్రాల్లో తాము పడిన కష్టాన్ని మరచిపోయి.. చిన్నాపెద్ద తారతమ్యాలు మరచిపోయి.. రైతు, వ్యవసాయకూలీలు ఆటపాటల్లో పాల్గొనడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలూ కబడ్డీ ఆటలో ఉత్సాహంగా పాల్గొనడం.. ఒక్క సంక్రాంతి సందర్భంలోనే చూస్తుంటాం. కాలం మారుతున్న క్రమంలో.. సంక్రాంతి వేళల్లో మునుపటి కబడ్డీ, కర్రసాము, కోలాటం వంటి సంప్రదాయ క్రీడలు, ఆటలు తగ్గుముఖం పడుతున్నాగానీ... ఇప్పటికీ సంక్రాంతి వస్తే తప్పనిసరిగా యువతీయువకుల్నీ లక్ష్యం చేసుకుని, గ్రామపెద్దలు ఆటలపోటీలు నిర్వహిస్తూనే ఉండటం గమనించవచ్చు. ఆ సంప్రదాయం పట్టణ ప్రాంతాల్లోనూ కొనసాగుతుంది. "చెట్టు మీద దెయ్యం నాకేం భయ్యం", "కబడ్డీ.. కబడ్డీ" అంటూ లయాత్మకంగా కూతలుపెట్టే ఈ ఆటలోనూ సంగీతం ఉంది. అచ్చమైన పల్లెపలుకు రాగమూ ఉంది. సరిగ్గా కూత కుదరాలేగానీ.. కబడ్డీ ఆడ్డమూ ఒక కళే.

గాలిపటాల కేరింత

గాలిపటాల ఎగరేయడం అనేది కేవలం ఏదో ఒక ప్రాంతానికే పరిమితం అనుకోలేం. సంక్రాంతి రోజుల్లో ప్రత్యేకించి పిల్లలు, యువకులు గాలిపటాలు ఎగరేయడానికి ఓ శాస్త్రీయతా ఉందని చెబుతారు పెద్దలు. శీతాకాలంలో పిల్లలకు చర్మవ్యాధులు రావడం సహజం. అలాంటి చర్మవ్యాధుల్ని తట్టుకోవాలంటే శరీరానికి తగినంత సూర్యరశ్మి తగలాలి. అందుకే ఈ కాలంలో ఆరుబయట తమ పిల్లలతో గాలిపటాలు ఎగరేయించడం మొదలైందంటారు. దీంట్లో నిజమెంతుందోగానీ.. గాలిపాటం ఎగరేయడంలో అసలు సిసలైన సైన్సూ ఉందని చెబుతారు మరికొందరు.

గాలిదిశ ఆధారంగా గాలిపటాన్ని పైకి ఎగరేసే క్రమంలో.. ఆ గాలిపటం తయారీలోనూ సైన్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ఇదే విషయం మన పిల్లల దగ్గర ప్రస్తావిస్తే.. "సైన్సా.. ఎక్కడా?" అని క్వొశ్చన్ మార్క్‌లా మొఖంపెట్టి అడగొచ్చు. కానీ, ఆ పిల్లాడు గాలిపటాన్ని తయారుచేసే పద్ధతిలో కొలతలు, ఆ'దారపు' సూత్రాలు సరిగ్గా ఉంటేనే.. ఆ పటం.. ఆకాశాన రివ్వున ఎగరగలదు. గాలిపటానికి కట్టే దారాలు మొదలుకుని.. ఆకట్టుకునే రూపాల వరకూ.. ప్రతిదీ కళాత్మకమైన అంశమే. అలా గాలిపటం.. రంగురంగుల శోభతో.. ఎగురుతూ.. ఆకాశాన తారాడే క్రమంలో ఆబాలగోపాలాల కేరింతలు మరింత కళాత్మకం. అందుకే సంక్రాంతి.. ఎగిరే ఓ గాలిపటం. అందుకే కళల సంక్రాంతిని.. అంతే కళాత్మకంగా జరుపుకుందాం!!

- గంగాధర్ వీర్ల





మీ కోసం

చలికాలంలో పాలు తోడుకోవాలంటే ఒక ఎండుమిరపకాయ వేస్తే చాలు.

జీవన సౌరభం

ఈ ప్రపంచంలో నీలా ఉండేది ఉండబోయేది ఉండాల్సింది కేవలం నీవు మాత్రమే. అందుకే ఎవరినీ అనుకరించవలసిన అవసరం లేదు.

బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్-పిఓ'స్, క్లర్క్స్)

Treasury bills are issued in India by?

MODEL QUESTIONS

1. According to accepting public deposits, NBFCs can be classified into ____ broad categories.
(a) Two (b) Three
(c) Four (d) One
(e) Five

2. Which of the following is the country's largest custodian and depository participant?
(a) CIBIL (b) SEBI
(c) NABARD (d) SHCIL
(e) None of the given options is true

3. StockHolding was incorporated as a Public Limited Company in-
(a) 1995 (b) 1992
(c) 1986 (d) 1981
(e) 1979

4. StockHolding is a subsidiary of-
(a) IFCI Limited (b) RBI
(c) Government of India
(d) SIDBI
(e) IDBI Limited

5. Which of the following is the parent organisation of UPI?
(a) RBI (b) GOI
(c) NPCI (d) PMMY
(e) SEBI

6. Which of the following is the dimension of new 500 rupee note?
(a) 157 × 73 mm
(b) 66 × 150 mm
(c) 66 × 166 mm
(d) 147 × 73 mm
(e) None of the given options is true

7. Which of the following is the base color of 2000 rupee note?
(a) Stone Grey (b) Green
(c) Orange – Violet (d) Magenta
(e) Red – Orange

8. Which of the following is the dimension of 2000 rupee note?
(a) 157 × 73 mm
(b) 66 × 150 mm
(c) 66 × 166 mm
(d) 147 × 73 mm
(e) None of the given options is true

9. Which of the following is the color of new 500 rupee note?
(a) Stone Grey (b) Green
(c) Orange– Violet (d) Magenta
(e) Red– Orange



10. Which of the following features on the reverse of 2000 rupee note?
(a) Mangalyaan
(b) Himalaya Mountains
(c) Red Fort
(d) Parliament of India
(e) Tractor

11. In which of the following types of banking, there is a direct execution of transaction between a bank and its consumers?
(a) Retail Banking
(b) Universal Banking
(c) Virtual Banking
(d) Unit Banking
(e) None of the given options is true

12. Maximum loan amount to individuals against physical security shares can be _____
(a) 30 lakh (b) 15 lakh
(c) 25 lakh (d) 50 lakh
(e) 10 lakh

13. The process by which the central bank of a country controls the supply of money in the economy by exercising its control over interest rates in order to maintain price stability and achieve high economic growth is known as:
(a) Economic Policy
(b) Monetary Policy
(c) Fiscal Policy
(d) Credit Policy
(e) Budgetary Policy

14. Loans granted by a bank to an exporter popularly known as 'Export credit' is guaranteed, in case of default,by which of the following
(a) EXIM Bank
(b) Ministry of International Trade, GOA
(c) ECGC
(d) DICGC
(e) None of the given options is true

15. Who amongst the following is the regulator in the financial system of the country?
(a) OIC (b) SEBI
(c) CRISIL (d) TRAN
(e) CERC

16. The Doing Business Report" is prepared by which of the following organizations every year?
(a) Asian Development Bank (ADB)
(b) World Bank (WB)
(c) New Development Bank (NDB)
(d) World Trade Organization (WTO)
(e) None of the given options is true

17. Which of the following cannot be called as a debt instrument as referred in financial transactions?
(a) Certificate of Deposits
(b) Bonds
(c) Stock
(d) Commercial Paper
(e) None of the given options is true

18. Which of the following is not a type of cheque issued by an individual?
(a) Bearer Cheque
(b) Crossed Cheque
(c) Order Cheque
(d) Savings Cheque
(e) None of the given options is true

19. "World Investment Report" is annually published by-
(a) IBRD (b) WTO
(c) IMF (d) UNCTAD
(e) ADB

20. Treasury bills are issued in India by ______
(a) RBI
(b) State Government
(c) Government of India
(d) SEBI
(e) NABARD ★

Answer:
1.a, 2.d, 3.c, 4.a, 5.c, 6.b, 7.d, 8.c, 9.a, 10.a, 11.a, 12.e, 13.b, 14.c, 15.c, 16.b, 17.c, 18.d, 19.d, 20.c.

Important Bits



1. The final draw for the 2018 FIFA World Cup was held recently in _______________.
Answer: Russia
2. In which country, an international conference was recently inaugurated to draw attention towards the adverse effects of global warming in the Hindu Kush mountain range.
Answer: Nepal
3. Name the person who has recently confered 'National Awards for Divyangjan 2017' on the occasion of International Day of Persons with Disabilities.
Answer: President Ramnath Kovind
4. The government of India has increased the budget of Agricultural Education by _______________ this year as compared to the financial year 2013-14.
Answer: 47.4%
5. Name the disastrous cyclone that has recently caused the major loss in the southern part of India.
Answer: Cyclone Ockhi
6. Under whose chairmanship the Fifteenth Finance Commission held its first meeting at North Block in New Delhi ?
Answer: NK Singh
7. The largest-ever floating solar power plant of India was inaugurated in which state?
Answer: Kerala
8. The Umbrella Agreement between India and Germany concerning Financial Cooperation in 2016 (II) under the Indo-German Development Cooperation was signed to formalize Financial Cooperation in form of loan for which project?
Answer: Climate Friendly Urban Mobility III
9. Who has been signed as a Global Goodwill Ambassador for UN Environment, joining the fight to save the lives and habitats of people and animals by cleaning up our air and seas, fighting climate change and protecting species?
Answer: Ellie Goulding
10. Indian-American California senator _______________ has topped the prestigious Foreign Policy magazine's 2017 list of '50 Leading Global Thinkers' which also features US Ambassador to the UN Nikki Haley.
Answer: Kamala Harris
11. Which country was banned from the 2018 Winter Games by the International Olympic Committee over its state-orchestrated doping program?
Answer: Russia
12. Sixteen-year-old Mohamad Al Jounde was recently awarded the International Children's Peace Prize for his efforts to ensure the rights of Syrian refugee children. In which country?
Answer: Syria
13. Name the state Assembly which has unanimously passed a Bill awarding death to those found guilty of raping girls aged 12 and below.
Answer: Madhya Pradesh
14. The International Solar Alliance (ISA) has now become a treaty-based international intergovernmental organization. The ISA is headquartered in _______________.
Answer: India
15. The US Supreme Court has allowed President Trump's travel ban to take full effect pending appeal, for people coming from how many Muslim-majority countries?
Answer: Six
6. In the recently concluded 48th Edition of International Film Festival of India who was honoured with the prestigious 'Indian film personality of the year' Award?
Answer: Amitabh Bachchan
7. Five Russian competitors from the 2014 Sochi Winter Olympics, including two gold medallists, have been banned for life over anti-doping rule violations by International Olympic Committee (IOC).Where is the 2020 Summer Olympics going to be held?
Answer: Tokyo
8. Jet Airways and _______________ announced a partnership to route more traffic through Europe and on to North America.
Answer: Air France-KLM
9. The Union Finance Minister Arun Jaitley formally launched a new payments bank. Which is the fourth payment bank to be launched?
Answer: Paytm Payments Banks
10. The largest dollar denominated bitcoin exchange _______________ gave the latest price of Bitcoin as $10,052 in Asia bringing its rise for the year to date to more than 900 per cent.
Answer: Coinbase
11. The government represented by Senior level government officials, at the rank of Additional Secretary and Joint Secretary, nominated as 'Prabhari' officers has embarked upon a major policy initiative for the rapid transformation of how many backward districts across the country by 2022.
Answer: 115
12. In which city, The iconic third Trump Tower comprising 140 ultra-luxury apartments has been launched whereby its Indian developers are expecting to garner around Rs 700 crore in sales from the project?
Answer: Kolkata
13. Indian online payments firm BillDesk-owned Hatio Innovations has launched cryptocurrency exchange in India offering trading of Bitcoin and Bitcoin Cash.What is the name of the exchange?
Answer: Coinome
14. What is the tagline of Bank of Baroda?
Answer: India's International Bank
15. Union Defence Minister Nirmala Sitharaman has been elected as President of the IDSA, set up in 1965 by the Ministry of Defence. What does 'A' stand for in IDSA?
Answer: Analysis

గ్రూప్స్‌, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జలరవాణా - ప్రాధాన్యత



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

మన దేశం అధికంగా ఇంధన దిగుమతులపై ఆధారపడిన దేశం. ప్రపంచంలోని మొత్తం చమురు నిక్షేపాలలో దేశంలో లభ్యమయ్యేవి 0.5 నుంచి 0.8 శాతం మాత్రమే. కానీ ప్రపంచ జనాభాలో సుమారు 17 శాతం భారతదేశంలోనే ఉంది. తలసరి ఇంధన వినిమయం తక్కువగా ఉన్నప్పటికీ ఇంధన అవసరాలు అధికంగానే ఉన్నాయి. భారతదేశం మొత్తం ముడి చమురు అవసరాల్లో 70 శాతం మేర దిగుమతులే ఆధారం. సహజవాయువు అవసరాల్లో 20 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్నాం.

మౌలిక సదుపాయాలు సజావుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. తక్కువ ఇంధన వ్యయంలో ఎక్కువ అభివృద్ధి సాధించే విధానాలు ఆర్థికవ్యవస్థను వృద్ధి పరుస్తాయి. ఉపరితల రవాణా, వాయురవాణాలతో పాటు జలరవాణా మార్గాలను సద్వినియోగం చేసుకుంటూ అమెరికా, జర్మనీ, చైనా వంటి దేశాలు పురోగపథంలో సాగుతున్నాయి.

దేశంలో 40 శాతం రవాణా ఉపరితల మార్గంలోనే సాగుతుంది. అతి తక్కువ సంఖ్యలో విమానాశ్రయాలు, చాలీచాలని రన్‌వేలు, విమానాలు నిలపడానికి సరిపడినంత స్థలం లేక వైమానిక రంగం తగినంతగా అభివృద్ధి చెందడంలేదు. చాలాచోట్ల రోడ్డు, రైలు మార్గాల మధ్య సరైన కనెక్టివిటీ ఉండటం లేదు. కేవలం 0.2 శాతం మాత్రమే అంతర్గత జలరవాణా మార్గాల ద్వారా రవాణా జరుగుతుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా దాదాపు శూన్యమని పేర్కొనాలి. అంతకంతకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రైలు రోడ్డు మార్గాలను విస్తరించడం సాధ్యంకాదు. ఈ పరిస్థితుల్లో జలరవాణా రంగం భవిష్యత్తులో తిరుగులేని ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నదనడంలో సందేహం లేదు. రాష్ట్ర ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడంలో జలరవాణా చాలా కీలకమైనది. వందల ఏళ్ల క్రితం రాష్ట్రంలో వెలుగు వెలిగిన అంతర్గత జలరవాణా రంగం స్వాతంత్ర్యం వచ్చేనాటికి రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగయ్యింది. రాష్ట్ర జలరవాణా రంగాన్ని సమర్థంగా అభివృద్ధి చేసుకునేందుకు పెట్టుబడులను ప్రోత్సహిస్తే పర్యాటక, వ్యాపార, వాణిజ్యాల మహర్దశను అందుకుంటాయనడంలో సందేహం లేదు. సుదీర్ఘ తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్ 974 కిలోమీటర్ల తీరంలో దేశంలోనే రెండో స్థానంలో ఉంది.

జాతీయ రహదారుల మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం జాతీయ జలరవాణా మార్గాలను గుర్తించింది.
1. గంగానదిపై హిల్దియా నుంచి అలహాబాద్ వరకూ 1620 కిలోమీటర్లు పొడవైన జలమార్గం (ఎన్‌డబ్ల్యూ -1)
2. బ్రహ్మపుత్ర నదిపై సాదియా నుంచి ధుబ్రి వరకూ 891 కిలోమీటర్లు మార్గం (ఎన్‌డబ్ల్యూ -2)
3. పశ్చిమ కోస్తా కాలువ మార్గం 623 కిలోమీటర్లు (ఎన్‌డబ్ల్యూ -3)
4. తూర్పు కోస్తా కాలువ మార్గం (ఎన్‌డబ్ల్యూ -5)
5. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి తమిళనాడు మీదుగా పుదుచ్చేరి వరకూ (767 కిలోమీటర్లు), దానికి అనుబంధంగా గోదావరి నదిపై రాజమండ్రి నుంచి భద్రాచలం వరకూ (171 కిలోమీటర్లు), కృష్ణానదిపై వజీరాబాద్ నుంచి విజయవాడ వరకూ (157 కిలోమీటర్లు) మొత్తం 1095 కిలోమీటర్లు మార్గాన్ని ఎన్‌హెచ్-4గా గుర్తించారు. ఎన్‌హెచ్-4గా గుర్తించిన ఈ మార్గం వందల సంవత్సరాల క్రితమే భారత ఆర్థికవ్యవస్థలో కీలకమైన పాత్ర వహించింది. దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ప్రతి సంవత్సరం కోటి 20 లక్షల టన్నుల సరుకును రవాణా చేసే అవకాశం లభిస్తుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో వేల మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి.

ఉపరితల, గగనతల రవాణాతో పోలిస్తే జలరవాణా మార్గల నిర్మాణం ఎంతో చౌక. ఒక అంచనా ప్రకారం రైల్వే, రోడ్డు మార్గంలో ఒక కిలోమీటర్ నిర్మాణానికి ఆరు నుంచి ఏడు కోట్ల రూపాయల వరకూ వ్యయమవుతుంది. అదే జలమార్గంలో ఒక కిలోమీటరు అభివృద్ధి చేయడానికి రూ.50 లక్షలు సరిపోతాయి. అంతేగాక బొగ్గు, సిమెంటు, రాళ్లు, ఖనిజాలు, ఆహారధాన్యాలు, ఎరువులు వంటి వస్తువులు, సరుకుల రవాణాకు జలమార్గం అత్యంత చవకైనది, అనువైనది.

దేశంలో చిన్న రాష్ట్రాలలో ఒకటైన కేరళ అంతర్గత జలరవాణాను బాగా అభివృద్ధి చేసుకుంది. ఆ రాష్ట్రంలో ప్రవహించే చిన్న పెద్ద నదులతో సరస్సులను, సముద్రాన్ని ఎక్కువభాగం అనుసంధానం చేసింది. ప్రతిరోజూ 85 వేల మంది పడవల మీదే ప్రయాణం కొనసాగిస్తున్నారు. పడవలు రోజూ ప్రయాణం చేసే దూరం 7,500 కిలోమీటర్లకు చేరింది. ఈ విధంగా అభివృద్ధి చెందిన అంతర్గత జలవ్యవస్థ పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. పర్యాటకుల ద్వారా ఏటా వందల రూపాయలను కేరళ ప్రభుత్వం సమకూరుస్తుంది. అంతేగాక కేవలం రెండే నదులతో ఉన్న గోవా రాష్ట్రం సైతం చక్కటి ఫలితాలను పొందుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో జల మార్గాలను పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసే ప్రపంచపర్యాటకుల దృష్టిని ఆకర్షించే ప్రత్యేకతలు చాలా ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద మడ అడవులుగల కోరంగి నేషనల్ పార్కు, కృష్ణా, గోదావరి నదుల మధ్యగల పచ్చని ద్వీపాలు, కోనసీమ అందాలు, కొల్లేరు సొగసులు, నదీ తీరాల్లో నెలవైన అమరావతి, భద్రాచలం వంటి అద్భుత ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి.



జలరవాణావల్ల ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరుతుంది. రైల్వే, రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. రహదారులపై ఒత్తిడి తగ్గడంలో ఆ మేరకు పర్యావరణ దుష్ప్రభావం తగ్గినట్లవుతుంది. చౌకగా ఉత్పత్తుల రవాణా కావడంవల్ల వినియోగదారులకు సరసమైన ధరలకు లభిస్తాయి. జలరవాణావల్ల పెద్దఎత్తున సరుకుల రవాణాతోపాటు ప్రయాణీకులను గమ్యస్థానానికి చేర్చవచ్చు. ★

ఉద్యోగాలు

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 12 బోధన ఖాళీలు

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్‌పీఎంవీవీ).. 12 బోధన ఖాళీల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు (బోధనాంశాల వారీ): అసోసియేట్ ప్రొఫెసర్-1 (అప్లైడ్ మైక్రోబయాలజీ), అసిస్టెంట్ ప్రొఫెసర్-11 (ఎడ్యుకేషన్-జనరల్)-1+ స్పెషల్ ఎడ్యుకేషన్-1+ మ్యూజిక్ అండ్ ఫైనార్ట్స్-1+ సోషల్ వర్క్-1+ ఉమెన్స్ స్టడీస్-1+ అప్లైడ్ మ్యాథమెటిక్స్-2+ ఫార్మసీ-1+ సీఎస్ఈ-1+ ఈసీఈ-1+ ఎంఈ-1).
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి పీహెచ్‌డీ/ మాస్టర్స్ డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం, జర్నల్స్ ప్రచురణ తదితర అర్హతలుండాలి.
దరఖాస్తు ఫీజు : రూ.1,000.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు రిసీట్, ఫొటోలు తదితర అవసరమైన వాటిని జతచేసి కవరులో ఉంచి 'రిజిస్ట్రార్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
గమనిక : అప్లైడ్ మైక్రోబయాలజీకి ఆఫ్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు, అప్లైడ్ మైక్రోబయాలజీ పోస్టుల ఆఫ్‌లైన్ దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : జనవరి 20, 2018.
దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ : జనవరి 22, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.spmvv.ac.in

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 118 ఖాళీలు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)... స్పోర్ట్స్ కోటా కింద 118 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)-31, హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ)-87.
క్రీడా విభాగాల వారీ ఖాళీలు : అథ్లెటిక్స్-20, బాక్సింగ్-9, బాస్కెట్‌బాల్-10, ఫుట్‌బాల్-10, జిమ్నాస్టిక్స్-3, హాకీ-6, జూడో-10, షూటింగ్-16, స్విమ్మింగ్-8, వాలీబాల్-10, రెజ్లింగ్-6, వెయిట్ లిఫ్టింగ్-10.
వేతనశ్రేణి : ఏఎస్ఐ-రూ.29,200-రూ.92,300, హెచ్‌సీ-రూ.25,500-రూ.81,100.
అర్హతలు : ఏఎస్ఐకి డిగ్రీ, హెచ్‌సీకి ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడల్లో సీనియర్/ జూనియర్ కేటగిరీల్లో అంతర్జాతీయ/ జాతీయ/ అంతర్రాష్ట్ర/ రాష్ట్ర/ ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో వ్యక్తిగత/ బృంద విభాగంలో ప్రాతినిధ్యం/ పతకం ఉండాలి.
వయసు : ఏఎస్ఐకి 20-25 ఏళ్ల లోపు, హెచ్‌సీకి 18-23 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
శారీరక ప్రమాణాలు : ఏఎస్ఐ పోస్టులకు ఎస్టీ కేటగిరీలోని పురుషులకు ఎత్తు-162.5 సెం.మీ., ఛాతీ-77 సెం.మీ. (సాధారణం)-82 సెం.మీ. (గాలి పీల్చినపుడు), మహిళలకు ఎత్తు-154 సెం.మీ. ఉండాలి. జనరల్/ ఓబీసీ/ ఎస్సీ కేటగిరీలోని పురుషులకు ఎత్తు-170 సెం.మీ., ఛాతీ-పురుషులకు 80 సెం.మీ. (సాధారణం)- 85 సెం.మీ. (గాలి పీల్చిన పుడు), మహిళలకు ఎత్తు-157 సెం.మీ.
హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు : ఎత్తు-పురుషులకు 167 సెం.మీ., మహిళలకు 153 సెం.మీ, ఛాతీ-పురుషులకు 81 సెం.మీ. (సాధారణం)-86 సెం.మీ. (గాలి పీల్చినపుడు).
గమనిక : అన్ని పోస్టుల అభ్యర్థులకూ ఎత్తు, వయసుకు అనుగుణంగా ఆరోగ్య/ క్రీడా ప్రమాణాలను బట్టి బరువు ఉండాలి.
మెడికల్ స్టాండర్డ్స్: దృష్టి సామర్థ్యం 6/6, 6/9 (గ్లాసెస్ లేకుండా) ఉండాలి. అలాగే తగిన వినికిడి సామర్థ్యం, ఆరోగ్యం తదితర ప్రమాణాలు తప్పనిసరి.
ఎంపిక : క్రీడా విభాగంలో ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్.
దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : జనవరి 25, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.cisfrectt.in

అత్యాచార బాధితులు ధర్నా

ప్రజాశక్తి-జి.మాడుగుల

అత్యాచార బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లిలో బాధితులతో పాటు స్థానికులు ఆదివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా తమకు అండగా నిలిచి, తగిన న్యాయం చేయాలని వాకపల్లి అత్యాచార బాధిత మహిళలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ.. తమపై అత్యాచారం చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని కోరారు. వాకపల్లి న్యాయ విచారణను అడ్డుకోవడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఆపాలని, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, గిరిజనులు తమకు అండగా నిలవాలని కోరారు. తమకు



బాధితుల ధర్నా
అత్యాచార బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లిలో బాధితులతో పాటు స్థానికులు ఆదివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మోడీ పాలనలో న్యాయ వ్యవస్థపైన నమ్మకం శూన్యం

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

పజాశక్తి-కందుకూరు

న్యాయవ్యవస్థపై నమ్మకం పోయి జడ్జీలు ఎదరు తిరిగే పరిస్థితి మోడీ పాలనలో వచ్చిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కందుకూరు వచ్చిన నారాయణ ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో ఒక నాడు చంక్రం తిప్పిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు మోడీ దగ్గర చక్రం తిప్పలేకపోతున్నారన్నారు. పోలవరం విషయంలో కూడా స్పష్టంగా తేల్చి చెప్పడం లేదన్నారు. జగన్ అవినీతి విషయంలో కూరుకుపోయినందున వీరెవరూ కేంద్రాన్ని ఒత్తిడి చేసి ఒప్పించగలిగే శక్తి లేదన్నారు. చంద్రబాబు, కెసిఆర్ పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి వెళ్ళి అక్కడి షాపుల్లో 'ధైర్యం' అనే మందు అమ్ముతారనీ, కొనుక్కొచ్చుకోవాలనీ చురక వేశారు.

కాంగ్రెస్ అవినీతి పార్టీ అని పదే పదే చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి అంతకన్నా పెద్దకుంభకోణంలో కూరుకుపోయిందని చెప్పారు. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ గుజరాత్‌లో మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఓ కార్పోరేషన్ బాద్యతలు నిర్వహిస్తూ ఇద్దరు కలిసి రూ.20వేల కోట్లు కాజేశారని చెప్పారు. అలాంటి ఉర్జిత్ పటేల్ ను ఆర్‌బిఐ గవర్నర్ చేయడం వెనుక ఆంతర్యం అర్థం చేసుకోవచ్చన్నారు.

హెరిటేజ్ క్వాలిటీలో రాజీ పడదు

ప్రజాశక్తి-చంద్రగిరి

హెరిటేజ్ డెయిరీ క్వాలిటీలో రాజీపడకుండా వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాలపదార్థాలను అందిస్తున్నట్లు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2017లో హెరిటేజ్ ఇందనపొదుపు జాతీయ అవార్డు గెలుచుకుంది. ఆదివారం కాశిపెంట్ల గోకుల్లో కార్మికుల అభినందనవ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు డెయిరీ ఎండి నారా భువనేశ్వరి, ఈడీ నారా బ్రాహ్మిణి, లోకేష్‌లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి హోదాలో డెయిరీకి విచ్చేసి ఈ అవార్డు రావడానికి కారణమైన కార్మికులను అభినందించారు. సమర్థవంతమైన నాయకుడి సంస్థలో పనిచేయడం సంతోషంగా ఉందని కార్మికులు తెలిపారు. సిల్వర్ జుబ్లిసమగ్రంలో ఈ అవార్డు వచ్చిందన్నారు. పది సంవత్సరాల్లో ఎనిమిది అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. పట్టుదలతో ఏదైనా సాధించొచ్చని నారా భువ నేశ్వరి పేర్కొన్నారు. గోకుల్ ప్రస్థానం భవిష్య త్తులో తలపెట్టిన అభివృద్ధి పనులను వివరిం చారు. చిత్తూరు డెయిరీలో పనిచేస్తూ పక్షవా తంతో బాధపడుతున్న టెక్నీషియన్ అశోక్‌కు సిబ్బంది, సంస్థ ఆధ్వర్యంలో రూ. 2లక్షలను కుటుంబ సభ్యులకు అందించారు. అవార్డు రావడానికి కృషి చేసిన ఎన్‌కాన్ టీంకు ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ సాంబమూర్తి, డివిఆర్‌కె ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. తనపై నమ్మకమంతో రైతులు భూమిలిచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

24న చలో పెదగొట్టిపాడు

దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ ఈనెల 24న 'చలో గొట్టిపాడు'కు పిలుపునిచ్చింది. పెత్తందార్ల చేతిలో దాడికి గురైన దళితులను ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా పరామర్శించి తీరుతామని కమిటీ స్పష్టం చేసింది. వామపక్ష పార్టీలు, దళిత, ప్రజాసంఘాలతో ఏర్పడిన గొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ సమావేశం గుంటూరులో కమిటీ కన్వీనర్, అడ్వకేట్ జి.శాంతకుమార్ అధ్యక్షతన ఆదివారం సమావేశమైంది. మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ గొట్టిపాడు ఉద్యమాన్ని విస్తరించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ.. గ్రామంలో ఇరు పక్షాలు ప్రశాంతంగా ఉన్నాయని ప్రభుత్వం బూటకపు ప్రచారం చేస్తోందన్నారు. దళితులపై దాడుల సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం పెత్తందార్లకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. గొట్టిపాడులో దళితులపై దాడి చేసిన కులోన్మాదుల్ని 307 సెక్షన్ కింద అరెస్ట్ చేయాలని, దళితులపై మోపిన అక్రమ కౌంటర్ కేసులు ఎత్తివేయాలని, దళితులకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసి, ఆ పంచాయతీకి ప్రత్యేక రహదారి సౌకర్యం కల్పించాలని, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయవాది వైకె మాట్లాడుతూ.. గొట్టిపాడు ప్రశాంతంగా ఉంటే బయటి



సమావేశంలో పాల్గొన్న పార్టీలు సంఘాల నాయకులు

వ్యక్తులను ఎందుకు సందర్శించకుండా అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వాస్తవంగా దాడి తర్వాత గ్రామంలో బీభత్సం నెలకొన్నదని, దళితులపై బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. వాటిని కప్పిబుచ్చేందుకే బయటి వ్యక్తుల్ని అడ్డుకుంటోందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. సమావేశంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎన్.బ్రహ్మయ్య, సిపిఐ(ఎంఎల్) యూనిటీ ఇనిషియేటివ్ నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, బహుజన మహాసభ నాయకులు భగత్‌సింగ్, డిబిఎఫ్ రాష్ట్ర నాయకులు కొరివి వినయ్‌కుమార్, కెవిపిఎస్ నాయకులు కృష్ణ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, విసికె కార్యదర్శి విద్యాసాగర్, వివిధ దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడకత్తెరలో డిఎడ్ అభ్యర్థులు

ప్రభుత్వ నిబంధనల్లో 'వయసు' తకరారు

తుది గడువు సమీపిస్తుండడంతో ఆందోళన

ప్రజాశక్తి- భీమునిపట్నం, విశాఖ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు అనుమతించినా దరఖాస్తులో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు డిఎడ్ అభ్యర్థులకు తల బొప్పి కట్టిస్తున్నాయి. టెట్‌కు కనీస అర్హత వయసు పద్దెనిమిదేళ్లున్నప్పటికీ వెబ్‌సైట్ తమ దరఖాస్తును నిరాకరిస్తుండడంతో డిఎడ్ అభ్యర్థులు హతాశులవుతున్నారు.

2016 – 18 బ్యాచ్ డిఎడ్ అభ్యర్థులకు మొదటి సంవత్సరం పరీక్షలు కూడా నిర్వహించలేదు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా బ్యాచ్ డిఎడ్ అభ్యర్థుల ఆందోళనలతో ప్రభుత్వం స్పందించింది. వారిని టెట్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారంతా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌సిటిఇ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్) మార్గదర్శకాల ప్రకారం టెట్ దరఖాస్తుదారులకు పద్దెనిమిదేళ్లు నిండాలి. అయితే 1999 జులై 1వ తేదీ తర్వాత జన్మించిన విద్యార్థుల దరఖాస్తులు వెబ్‌సైటులో నమోదు కావట్లేదు. తగిన వయసు ఉన్నప్పటికీ 1999 జులై 1వ తేదీ తర్వాత జన్మించిన అభ్యర్థుల ఆశలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీళ్లు చల్లుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు దరఖాస్తు నిబంధనల్లో హాల్‌టికెట్ వివరాలను అడుగుతున్నారనీ, తమకు డిఎడ్ పరీక్ష నిర్వహించకుండానే తమ హాల్‌టికెట్ నెంబరును ఎలా నమోదు చేయగలమని డిఎడ్ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. తుది గడువు 20వ తేదీలోపే ప్రభుత్వం స్పందించి దరఖాస్తు నిబంధనలను సవరించాలని కోరుతున్నారు.

తూర్పుపాలెంలో 35 ఎకరాల్లో బరులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో పెద్ద ఎత్తున కోడిపందేలు ప్రారంభం అయ్యాయి. 35 ఎకరాల విస్తీర్ణంలో బరులు ఏర్పాటు చేశారు. కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు తరలివస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పందేలు ప్రారంభం అయ్యాయి. పోలీసులు కూడా మధ్యాహ్నం నుంచి ఈ ప్రాంతం నుంచి నిష్క్రమించారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, జిడిసిసిబి చైర్మన్ ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఇనుప మెష్‌తో ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్ళు, కత్తులు కట్టేవారు మాత్రమే బరిలో ఉండేలా, ప్రేక్షకులు, పై పందేలు వేసేవారు ఇనుపమెష్‌కు వెలుపల ఉండేలా ఏర్పాట్లు చేశారు. పందేలను విఐపిలు వీక్షించేందుకు క్రికెట్ స్టేడియం మాదిరి కుర్చీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మైక్ ద్వారా ఎప్పటికప్పుడు పందేలు వేసేవారు, కోడి పుంజులు ఉన్నవారు, పందేలను నిర్ణయించుకునేందుకు బరిలోకి రావాలని స్వయంగా ఆహ్వానించారు.

పెదగొట్టిపాడు క్షతగాత్రులకు సిపిఎం నేతల పరామర్శ

అండగా ఉంటామని బాధితులకు హామీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో అగ్రకులాల దాడిలో గాయాలపాలై క్షతగాత్రులను సిపిఎం నేతలు ఆదివారం పరామర్శించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రి (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు జొన్నలగడ్డ ప్రకాష్, బూసి దీనాభరణంను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, న్యాయవాది వైకె, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. బాధితులకు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని మధు భరోసా కల్పించారు. పెత్తందార్లు మారణాయుధాలతో తమ ఇళ్లలోకి చొరబడి దాడి చేశారని బాధితులు నేతల దృష్టికి తెచ్చారు. ప్రకాష్‌కు



జొన్నలగడ్డ ప్రకాష్‌ను పరామర్శిస్తున్న మధు, ఇతర నేతలు

కాలుకి, దీనాభరణంకు చెయ్యి, కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు ఆపరేషన్ అవసరం అని నిర్ధారించినప్పటికీ ఆలస్యం జరుగుతున్నట్లు నాయకుల దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా మధు మీడియాతో మాట్లాడుతూ.. గొట్టిపాడు క్షతగాత్రుల్ని ప్రత్యేకంగా చూడాలని, సత్వరమే వైద్యసేవలు అందించాలని, బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో జిల్లా నాయకులూ ఉన్నారు.

త్వరలో యూనివర్శిటీ పోస్టుల భర్తీ

– మంత్రి గంటాశ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఒ ంగోలు కలెక్టరేట్ (ప్రకాశం)

రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాలలోని 1385 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుమతిచ్చారని మంత్రి తెలిపారు. అందులో కొన్ని యూనివర్శిటీల ద్వారా,మరికొన్ని ఎపిపిఎస్‌సి ద్వారా నియామకం జరుపుతామని ఆయన అన్నారు. తాత్కాలిక ట్రిపుల్ ఐటి కోసం ఆదివారం ఏడుగుండ్లపాడు సమీపంలోని పాత నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలను మంత్రి సందర్శించి అక్కడ గదులు, పరిసరాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి 3, 5, 6, 7 తేదీలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో ఆరోగ్యకరమైన పోటీల ఉండాలని, మంచి ప్రాక్టీసులు, ఒకరికొకరు పంచుకునేందుకు వీలుగా ప్రతి 3 నెలలకు ఒకసారి ఉప కులపతుల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జనవరి 24వ తేదీన గవర్నర్‌తో సహా ఉపకులపతుల సమావేశం విశాఖపట్టణంలో నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ప్రతి విద్యారిని బాధ్యత ఉన్న పౌరునిగా తయారు చేసేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నామనానరు. ఎస్‌ఆర్‌ఎం, ఐఐటి, వెల్‌టెక్, ఎంఐటి వంటి ప్రయివేట్ విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. పునర్విభజన చట్టంలో రాష్ట్రానికి ఐఐఎం, ట్రిపుల్ ఐటి వంటి 7 విద్యా సంస్థలు రావాల్సి ఉందన్నారు. అందులో ఐదు ఇప్పటికే వచ్చాయని, మరో 2 సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలు అనంతపురం, విజయనగరంలకు రావాల్సి ఉందన్నారు. ఐఐఎం వంటి విద్యా సంస్థలకు నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి ఆశించిన విధంగా రాలేదన్నారు. 2018–19లో రాష్ట్రం నూరుశాతం అక్షరాస్యత సాధించే దిశగా దూసుకెళుతుందన్నారు.



చెరువులో మునిగి గిరిజన దంపతులు మృతి

ప్రజాశక్తి – నెల్లూరు

చెరువులో మునిగి గిరిజన దంపతులు మృతి చెందిన సంఘటన నెల్లూరు జిల్లా అక్కచెరువులపాడులోని కిచ్చరగుంటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు కిచ్చరగుంటకు సమీపాన ఉన్న నెల్లూరు చెరువులోకి స్థానికంగా ఉన్న నాలుగు గిరిజన కుటుంబాలు వేటకు వెళ్లాయి. వారిలో గంధం వెంకటరమణయ్య (30), ధనమ్మ దంపతులున్నారు. వారికి చెరువులో వేటే జీవనాధారం. తెల్లవారుజామున ఐదున్నరగంటల సమయంలో వీరు తెప్పల సాయంతో వేటకు వెళ్లారు. విపరీతంగా మంచు కురుస్తోంది. వీరు ప్రయాణిస్తున్న తెప్ప అదుపుతప్పి పడిపోయింది. దాంతో వారిద్దరు నీటిలో పడిపోయారు. కేకలు పెట్టినా మంచు కారణంగా వారెక్కడ పడిపోయారో మిగిలిన వారికి తెలియలేదు. వారు గ్రామంలోకి వచ్చి స్థానికులకు తెలిపారు. సిపిఎం రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు దృష్టికి రావడంతో ఆయన స్పందించి ఆర్‌డిఒకి, తహశీల్దార్‌కు సమాచారం అందించారు. వారు చెరువు వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీయించారు.

ప్రజ్ఞ జవాబులు

1. భోపాల్ రైల్వే స్టేషన్
2. విజే మాధ్యూ
3. 30వ ర్యాంక్
4. అనిల్ ఖన్నా
5. జమ్మూ కాశ్మీర్

సూరసాని లక్ష్మీరెడ్డి దాతృత్వం మరువలేనిది

సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం)

సూరసాని లక్ష్మీరెడ్డి దాతృత్వం, సిపిఎంకు ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువలేవని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం లక్ష్మీరెడ్డి దంపతులకు స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. జిల్లాలో మొట్టమొదటి పార్టీ కార్యాలయం అయిన కనిగిరి సుందరయ్య భవన్‌కు స్థలాన్ని కొనిచ్చిన విశ్రాంత డివిజనల్ వ్యవసాయాధికారి సూరసాని లక్ష్మీరెడ్డి పేరుమీద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పార్టీ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ ఆఫీసుకు స్థలంతో పాటు, ప్రతి నెలా తన జీతంలో కొంత మొత్తాన్ని నగదు పార్టీకి అందజేసి ఉద్యమాలకు సహకరించారన్నారు. పార్టీ భవనానికి బండపరుపు, నీటి సౌకర్యాన్ని అందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త కుందురు రమణారెడ్డి తన భార్య సరితారెడ్డి పేరుమీద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ప్రకాశం కమిటీ కార్యదర్శి సయ్యద్ హనీఫ్, తూర్పు ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, నాయకులు ఎంవి రెడ్డి, ఎస్.అచ్చిరెడ్డి, మోడినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆనందోత్సవాల నడుమ రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పలు చోట్ల ప్రజానాట్య మండలి, సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం సంప్రదాయ ఆటల పోటీలు ఘనంగా జరిగాయి. వీటిలో మహిళలు, యువతీయువకులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభ చాటారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో విజయవాడ తూర్పు నియోజక వర్గం, పశ్చిమ నియోజకవర్గాల్లో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు, స్పూన్ అండ్ లెమన్, స్లో సైక్లింగ్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ, నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ, గుడివాడ, మచిలీపట్నం నియోజక వర్గాల్లో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు జరిగాయి. వీరులపాడు మండలం జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లో ఐద్వా రాష్ట్ర నాయ కులు కాట్రగడ్డ స్వరూపరాణి పాల్గొని బహుమతులు అందజేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రులో డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడ్రో జులుగా నిర్వహించిన బహుముఖ పోటీలు ముగిశాయి. ముప్పాళ్లలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వినుకొండలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన, పాత గుంటూరులో సిపిఎం, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. బహుమతులను ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ మంత్రూనాయక్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమశ్రీ ప్రదానం చేశారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బుడతనాపల్లిలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలకు ముగ్గులు, రంగవల్లులు, కుర్చీల పోటీలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో సిఐటియు ఆధ్వర్యాన, కొవ్వూరు, తాడేపల్లిగూడెంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన, యలమంచిలి మండలం చించినాడ, భీమవరం చినరంగనిపాలెంలో ఐద్వా ఆధ్వర్యాన వివిధ పోటీలు జరిగాయి. తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ ఎస్‌సి కాలనీలో నేచర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సొసైటీ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన యువకులకు కబడ్డీ, రన్నింగ్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కర్నూలులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఐద్వా, ప్రజాశక్తి ఆధ్వర్యంలో కబడ్డీ, ముగ్గుల పోటీలు జరిగాయి. చిత్తూరు జిల్లా తిరుపతిలోనూ, పలనేరులోనూ సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. తిరుపతిలో ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందారపు మురళి హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో గిరిజన సంఘం, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోనూ, సంతనూతలపాడు మండలం మైనంపాడులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలోనూ వివిధ పోటీలు నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో పలు చోట్ల డివైఎఫ్ఐ, ఐద్వా, తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆదివారం ఆటల పోటీలు జరిగాయి.



విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బుడతనాపల్లిలో ఐద్వా ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

మాన్‌సాంటోకు ప్రయోగశాల ఎపి

బహుళజాతి కంపెనీలకు దాసోహం

బిటి3 పేరుతో రైతులపై అక్రమ కేసులు

జన్యు మార్పిడి చేసే స్థాయి రైతులకుంటుందా..

ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విత్తనోత్పత్తి రంగంలో ప్రపంచ గుత్తాధిపత్యం కల్గిన మాన్‌సాంటో కంపెనీకి రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చుతుండడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. మాన్‌సాంటో, మైకో లాంటి కంపెనీల ప్రయోజనాల కోసం రైతులు, చిన్న వ్యాపారులపై విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులతో దాడులు చేయిస్తూ అక్రమ కేసులను బనాయిస్తూ విత్తనోత్పత్తి రైతులను ప్రభుత్వం భయాందోళనకు గురి చేస్తోంది. ఇటీవల కాలంలో బిటి 3 సీడ్‌ను ఉత్పత్తి చేస్తున్నారని కర్నూలులో విత్తనోత్పత్తి రైతులపై దాడులు పెంచారు. నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నా చర్యలు తీసుకోలేదంటూ మండల వ్యవసాయశాఖ అధికారిని సస్పెండ్ చేయడం చర్చనీయాంశమైంది.

రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఓ సీనియర్ ఐఎఎస్ అధికారి బహుళజాతి కంపెనీలకు వకాల్తా పుచ్చుకొని దాడులు చేయిస్తున్నట్లు సమాచారం. కలుపు మందును తట్టుకొని నిలబడే జీన్ బిటి 3 కాటన్‌లో ఉంటుంది. సాధారణంగా జీన్ విత్తనంలోకి ఎక్కించే పరిజ్ఞానం రాష్ట్రంలోని ప్రయోగశాలల్లోనే లేదు. అలాంటిది రైతులు ఎలా ఎక్కిస్తారనేది ప్రశ్నగా మిగిలింది. 2007లో బహుళజాతి కంపెనీలయిన మాన్‌సాంటో, మైకో కంపెనీలకు మల్టీ లొకేషన్ రీసెర్చ్ ట్రయల్స్ (ఎంఎల్‌ఆర్‌టి) ప్రయోగం చేయాలని కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ప్రభుత్వం మాన్‌సాంటో కంపెనీకి రాయల్టీ ప్రకటించకున్నా ఇవే కంపెనీలు వారి విత్తనాలను దేశంలోకి వదిలేశారు. ఇలా వదిలిన బిటి 3 విత్తనం పరపరాగ సంపర్కం వలన పుప్పొడి రేణువులు ఇతర పత్తి పంటలపై పడి బిటి 3 విస్తరించింది. ఇలాంటి బిటి 3 విత్తనాల ఉత్పత్తి ఇప్పుడు గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తృతంగా పండిస్తున్నారు.

గుజరాత్‌లోనైతే గడ్డి మందును తట్టుకొని నిలబడే బిటి 3 విత్తనాన్ని వాడాలని అక్కడ రైతులు, చిన్న వ్యాపారులు స్వయంగా విత్తనోత్పత్తి చేసి అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. మహారాష్ట్ర, కర్నాటకలోనూ బిటి 3 విత్తనాన్ని ఉత్పత్తి చేసి అమ్ముకుంటున్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో బిటి 3 విత్తనాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దేశవ్యాప్తంగా ఇలాంటి పత్తి విత్తన ప్యాకెట్లు నాలుగు కోట్ల దాకా రైతులు పండిస్తున్నారు. రాష్ట్రంలో పండిస్తోంది కేవలం 10 నుంచి 15 లక్షల విత్తన ప్యాకెట్లు మాత్రమే. కర్నూలు జిల్లాలో అక్కడక్కడ పండిస్తున్నారు. ఏ రాష్ట్రంలోనూ రైతులపై నియంత్రణ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కేవలం బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే రైతులను లక్ష్యంగా చేసుకొని విత్తనోత్పత్తిపై ఉక్కుపాదం మోపుతుండడం ఆందోళన కలిగిస్తోంది. బిటి 3లో గ్లైసిల్ అనే గడ్డిమందు నివారణ జన్యువు ఉంటుంది. ఇది పర్యావరణానికి హాని కల్గించడంతోపాటు పశువులకు గ్రాసం కొరత ఏర్పరుచుతుంది. దీంతో ప్రభుత్వం గ్లైసిల్ ఉండే బిటి రకాన్ని నిషేధించింది. నిషేధాన్ని అడ్డం పెట్టుకొని రైతులను వేధించడం సరైందికాదని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొదట బిటి 1 జీన్‌ను 1995లో మాన్‌సాంటో కంపెనీ తెచ్చింది. కేవలం 100 గ్రాముల పత్తి విత్తనాలను మార్కెట్‌లోకి తెచ్చి జిఇఎసి (జనటిక్ ఇంజినీరింగ్ అప్రూవల్ కమిటీ) అనుమతుల్లేకుండా మార్కెట్‌లోకి అక్రమంగా రవాణా చేసిన మాన్‌సాంటో, మైకో లాంటి కంపెనీలను వదిలి రైతులపై దాడులు చేయడం ఎంతవరకు సబబు అని రైతసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సాధారణ బిటి కాటన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తున్న రైతులను గ్లైఫో సెట్, హెర్బిసైడ్ టాలరెన్సు లాంటి మందులతో బిటి 3 పత్తి విత్తనాలను తయారు చేస్తున్నారని ప్రభుత్వం వేధించడాన్ని మానుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కోర్టు ప్రాంగణంలోనే ముగ్గురిపై హిందూ యువవాహిని కార్యకర్తల దాడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బగ్‌పట్ కోర్టు ప్రాంగణంలో లవ్‌జిహద్ ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులపై హిందూ యువవాహిని కార్యకర్తలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రేమికులు, మరో ఇద్దరు బగ్‌పట్ ప్రేమజంటకు బగ్‌పట్ కోర్టులో వివాహం జరిపించుటకు వారితో పాటు మరో ఇద్దరు పురుషులు వచ్చారు. వీరు కులాంతర వివాహం చేసుకుంటున్నారన్న ఆరోపణలతో హిందూ యువవాహిని కార్యకర్తలు న్యాయవాది ఛాంబర్‌లోనే దాడికి దిగారు. వారిని తీవ్రంగా కొట్టారు. ఆమెను తీసుకెళ్లి మతం మార్చుకోవాలని జిల్లా అధ్యక్షురాలు దుర్గవాహిని ఒత్తిడి చేశారన్నారు. ఈ సమాచారం అందిన వెంటనే అక్కడికెళ్లి వారిని యువవాహిని కార్యకర్తల దాడి నుంచి రక్షించి తమ జీపులో తీసుకెళ్లామన్నారు. ఈ నలుగురిపై పంజాబ్‌లోని బర్నాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.



శ్రద్ధాంజలి । న్యూఢిల్లీలోని యుద్ధ స్మారకం తీన్‌మూర్తి చౌక్‌లో యుద్ధవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న భారత, ఇజ్రాయిల్ ప్రధానుల మోడి, నెతన్యాహూ

వేధింపులు తట్టుకోలేకపోతున్నాం..

బీఫ్ వ్యాపారం చేయలేం : గోవా వ్యాపారుల గగ్గోలు

పనాజి (గోవా) : గోవాలో బీఫ్ వ్యాపారస్తులు ఇక తాము వ్యాపారాలు నిర్వహించలేమంటూ వాపోతున్నారు. కర్ణాటకలోని బెల్గాం నుంచి గోవాకు మాంసాన్ని తెచ్చుకొనే సందర్భంలో వేధింపులు ఎదుర్కోవలసి వస్తోందని వారు పేర్కొంటున్నారు. కర్ణాటక నుంచి బీఫ్ సరఫరా తగ్గిపోవడంతో వారికి ఈ పరిస్థితి ఎదురైనట్లు చెబుతున్నారు. కర్ణాటక నుంచి బీఫ్ సరఫరాను పునరుద్ధరించుకున్నప్పటికీ చాలా పరిమితంగానే సరఫరా జరుగుతున్నదని వారు చెబుతున్నారు. కర్ణాటక నుంచి దున్నపోతు మాంసాన్ని గోవాకు ఇన్సులేటెడ్ ఫ్రీజర్ వాన్‌లో దిగుమతి చేసుకుంటున్నామని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఆ మాంసం వినియోగానికి తగిన విధంగా ఉందని తెలిపే సర్టిఫికెట్లను కూడా ఆ వ్యాన్‌తో పాటు పంపుతున్నామని చెప్పారు. అంతకు మించి ఆ మాంసాన్ని అధీకృత వధ్యశాల నుండి తీసుకురావడం జరుగుతుందన్నారు. బతికివున్న పశువులను రవాణా సమయంలో 1996 నాటి నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను వ్యాపారస్తులు పొందాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఈ నిబంధన గురించి కొంతమంది వ్యాపారస్తులకు అవగాహన ఉండకపోవడంతో అధికారుల వేధింపులకు హద్దులేకుండా పోతోందని వాపోతున్నారు.

కేరళలో సిపిఎం ఎమ్మెల్యే మృతి



కొట్టాయం : కేరళలోని చెంగన్నూర్ నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే కెకె రామచంద్రన్ నాయిర్ అస్వస్థత కారణంగా ఆదివారం ఉదయం మృతి చెందారు. 65 ఏళ్ల రామచంద్రన్ కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో ఆయన మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మధ్యాహ్నానికి తిరువనంతపురం తరలించారు. అక్కడ నుంచి చెంగన్నూర్ తీసుకుని వెళ్తారు. చెంగన్నూర్ నియోజకవర్గంలోని అలా గ్రామంలో 1953లో రామచంద్రన్ జన్మించారు. కళాశాల స్థాయి నుంచే రాజకీయ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు కూడా వెళ్ళారు. చెంగన్నూర్ ప్రాంత సిపిఎం కార్యదర్శిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో చెంగన్నూర్ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. రామచంద్రన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి విజయన్, స్పీకర్ శ్రీరామకృష్ణన్, సిపిఐ నేత కనమ్ రాజేంద్రన్ సంతాపం ప్రకటించారు.

సమ్మిళిత, సామాజిక ఆర్థిక విధానాలే భారత్‌కు మేలు

సమతుల్యతలేని వృద్ధి వల్ల జీవన నాణ్యత మెరుగుపడదు

సంక్షేమం ఖర్చు పెరగాలి : ఆర్థికవేత్త జీన్‌డ్రెజే

న్యూఢిల్లీ: భారత్‌లో సమ్మిళిత, సామాజిక అభివృద్ధి ఆర్థిక విధానాలను అనుసరించాలని ప్రముఖ ఆర్థికవేత్త జీన్‌డ్రెజే సూచించారు. వృద్ధి రేట్ అధికంగా ఉన్న సందర్భాల్లోనూ దేశంలోని మెజారిటీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగులు అధికంగా ఉండటం, కార్మికుల వేతనాలు తక్కువగా ఉండటం ఆర్థిక వృద్ధిలో సమతుల్యత లోపించిందనేందుకు ఉదాహరణలని జీన్‌డ్రెజే గుర్తు చేశారు. దేశ ఆర్థికవృద్ధి వేగంగా కొనసాగుతున్న దశలోనూ ప్రజల జీవన నాణ్యతలో మెరుగుదల నెమ్మదిగా జరగడం ఆందోళన కలిగించే అంశమని ఆయన వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారత్‌లో జీడీపీకి అనుగుణంగా సామాజిక అవసరాలకు(సంక్షేమానికి) ఖర్చు చేస్తున్నది చాలా తక్కువని ఆయన విశ్లేషించారు. మహిళల భాగస్వామ్యాన్ని, శ్రామిక శక్తిని పెంచడం, వేతనాలను వృద్ధి చేయడం ద్వారానే భారత్ సమతుల్య అభివృద్ధిని సాధిస్తుందని జీన్‌డ్రెజే స్పష్టం చేశారు. అభివృద్ధి ఆర్థికవేత్తగా పేరున్న జీన్‌డ్రెజే భారత్‌లో ఆకలి, కరువు సమస్యల నివారణ కోసం కృషి చేసినవారిలో ఒకరు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలోనూ జీన్‌డ్రెజేది ప్రముఖ పాత్ర.

సైనిక చర్యతో పాటు రాజకీయ ప్రక్రియ అవసరం

కాశ్మీర్‌లో శాంతికి ఆర్మీ చీఫ్ సూచన



న్యూఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు సైనిక చర్యతో సమాంతరంగా రాజకీయ ప్రక్రియ కొనసాగాలని సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ సూచించారు. జమ్మూ కాశ్మీర్‌లో మిలిటెంట్ల ఏరివేతలో వున్న సైనికదళాలు ఎప్పుడూ 'యధాతథ స్థితి'లో వుండలేవని, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు, విధానాలు మార్చుకుంటూ ముందడుగు వేస్తుంటాయని అన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితి ఇప్పుడు 'మెరుగుపడింద'ని తాను భావిస్తున్నానన్నారు. ఆదివారం ఆయన ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సీమాంతర ఉగ్రవాద కార్యకలాపాల నిరోధానికి పాకిస్తాన్‌పై వత్తిడి తెచ్చేందుకు అవకాశం వుందని వ్యాఖ్యానించారు. మిలిటెన్సీని ఎదుర్కొనే విషయంలో సైన్యం తన దూకుడును యధావిధిగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిస్థాపనకు ఇటు సైనిక చర్యతో పాటు అటు రాజకీయ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకు 'రాజకీయ–సైనిక' పద్ధతిని అనుసరించాల్సి వుంటుందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో వివిధ పక్షాలతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వ ప్రతినిధిగా ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ దినేశ్వర్ శర్మ నియామకాన్ని ఆయన ప్రస్తావిస్తూ శర్మ ప్రభుత్వ ప్రతినిధిగా అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలను పరిశీలిస్తారని, అందులో రాజకీయ పరంగా పరిష్కరించగలిగే వాటిని ఆయన రాజకీయ స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారని వివరించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌పై వత్తిడి పెంచే అవకాశంపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఇందుకు సైనికదళాలు 'యధాతథ స్థితి'ని అనుసరించలేవన్నారు. సైన్యం ఎప్పుడూ ఆలోచించి ముందడుగు వేస్తూనే వుండాలని అన్నారు. సైన్యం తన చుట్టూ వున్న పరిస్థితులు, సంచరించే ప్రాంతాలకు అనుగుణంగా తన పద్ధతులు విధానాలు మార్చుకుంటూ ముందడుగు వేస్తుందని ఆయన చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు సైన్యం కొత్త వ్యూహాలతో ముందుకెళ్తుందని, అదే సమయంలో కాశ్మీర్ సమస్య పరిష్కారానికి సరైన విధానం అవసరమని అన్నారు. కాశ్మీర్ సమస్య పరిష్కారంలో సైన్యం ఒక భాగం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో హింసాకాండ సృష్టించే వారిని, అందుకు ప్రోత్సహించే వారిని నిరోధించటమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు. కొంత యువత తీవ్రవాద భావాలతో మిలిటెంట్ గ్రూపులతో చేతులు కలుపుతున్నారని, ఈ గ్రూపులను నిరోధించేందుకు సైన్యం ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని పరిస్థితిలో గత ఏడాది కన్నా కొద్ది మెరుగుదల కన్పిస్తోందంటూనే దీనిపై అతి ధీమాకు పోవటానికి వీలులేదని అన్నారు. పరిస్థితి అదుపులోనే వుందని భావిస్తే సరిహద్దుల నుండి అక్రమ చొరబాట్లు కొనసాగే అవకాశం వుందన్నారు.

25న 'పద్మావత్' విడుదల

(మొదటిపేజీ తరువాయి)

నటి దీపికా పదుకునేను హత్య చేస్తామని బెదిరించారు. వారి తల నరికితే బహుమతి ఇస్తామని కూడా ప్రకటించారు. చివరికి సినిమాకు కొన్ని మార్పులతో పాటు, 'పద్మావతి'గా ఉన్న ఈ సినిమా పేరును పద్మావత్‌గా మార్చాలని కేంద్ర సెన్సార్ బోర్డు సూచించింది. మార్పులతో సినిమా విడుదలకు అనుమతి ఇచ్చింది. ప్రతీ భారతీయుడు గర్వించేవిధంగా సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదలచేస్తున్నట్లు వయాకామ్18 గ్రూప్ సిఈఓ సుధాన్షు వాత్స్ ఒక ప్రకటనలో తెలిపారు. తన పద్మావత్ కల నిజమవుతుందని దర్శకుడు సంజయ్ లీలా బన్సాలి ప్రకటించారు. ఈ సినిమాలో రాజ్‌పుత్ యోధుల గౌరవం, సాహసాలను అందంగా తెరకెక్కించినట్లు ఆయన తెలిపారు.

అభ్యంతరకర దృశ్యాలు తొలగించాలి : కేంద్రమంత్రి అత్‌వాలే

రాజపుత్రులు అవమానంగా భావించే దృశ్యాలను పద్మావత్ సినిమా నుంచి తొలగించే వరకు దానిని విడుదల చేయొద్దని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రామ్‌దాస్ అతవాలే శనివారం అన్నారు. పద్మావతి పేరును 'పద్మావత్'గా మార్చడం మాత్రమే సరిపోదని ఆయన అన్నారు. రాజపుత్రులకు సంబంధించినంత వరకు సినిమాపై వారి అభ్యంతరాలు తొలిగిపోలేదన్నారు. ఆ సినిమా విడుదలను నిలిపివేయాలని అన్నారు.

8 కీలక అంశాలపై 17 నుంచి విచారణ

సుప్రీం కోర్టు అధికారక వెబ్‌సైట్‌లో ప్రకటన



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి, మరో నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు మధ్య కేసుల కేటాయింపు విషయమై విబేధాలు కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టులోని ఐదుగురు సభ్యులతో కూడిన విస్తృత ధర్మాసనాలు 8 కీలక అంశాలపై ఈ నెల 17 నుంచి విచారణ చేపట్టనున్నాయి. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆధార్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌తో పాటు, స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించరాదంటూ 2013లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కూడా సుప్రీం విచారించనున్నది. కేరళలోని శబరిమల ఆలయంలో 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు ప్రవేశం నిషేధించడానికి సంబంధించిన కేసుపై కూడా రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుంది. అంతేకాక ఒక పార్శీ మతానికి చెందిన యువతి ఇతర మతానికి చెందిన యువకుడ్ని వివాహమాడితే ఆమె తన మత గుర్తింపును కోల్పోవలసిందేనా ? అనే చట్టబద్ధమైన ప్రశ్నపై కూడా విచారణను పునరుద్ధరించనున్నది. అలాగే వివాహిత మహిళతో, మరో వివాహమైన పురుషుడు అక్రమ సంబంధం పెట్టుకున్నప్పుడు శిక్ష విధించే చట్టం చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌పైన విచారణ జరపనున్నది. శాసన సభ్యులెవరైన నేర విచారణను ఎదుర్కొంటున్నట్లయితే వారు ఆ సభ్యత్వానికి అనర్హులా? అంటూ తలెత్తిన ప్రశ్నకు సంబంధించి దాఖలైన అభ్యర్థనతో సహా రాజ్యాంగ ధర్మాసనాలు పరిశీలించే ఇతర పిటిషన్లపై కూడా ఈ నెల 17 నుంచి విచారణ ప్రారంభం కానున్నది. ఈ అంశాలన్నిటిని కూడా అంతకుముందు సుప్రీం కోర్టులోని వివిధ ధర్మాసనాలు పరిశీలించి, ముఖ్యమైన చట్టపరమైన అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు విస్తృత ధర్మాసనం పరిశీలనకు పంపినవే. ఈ అంశాలన్నీ కూడా జనవరి 17 నుండి విచారణకు రానున్నాయి. ఇంతకుముందెన్నడూ లేని విధంగా సుప్రీం కోర్టుకు చెందిన సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జె. చలమేశ్వర్, రంజన్ గొగొయ్, ఎంబి లోకూర్, కురియన్ జోసఫ్‌లు శుక్రవారం జరిపిన విలేకరుల సమావేశంలో ప్రధాన న్యాయమూర్తిపైన కొన్ని ఆరోపణలు చేశారు. కేసులను కేటాయించడంలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, దేశ ప్రజాస్వామ్యం దెబ్బతినేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జస్టిస్ దీపక్ మిశ్రాతో బార్ కౌన్సిల్ బృందం భేటీ

న్యూఢిల్లీ : దేశ న్యాయ వ్యవస్థ ఇంతకుముందెన్నడూ లేని విధంగా ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన ప్రతినిధుల బృందం ఆదివారం దేశ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను కలుసుకుంది. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మనన్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. మొత్తం ఏడుగురు సభ్యులు గల ఈ బృందం దీపక్ మిశ్రాతో పాటు, ఇతర న్యామూర్తులను కూడా కలుసుకని ఈ విషయమై వారి అభిప్రాయాలను తీసుకుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఎస్ఎ బాబ్డే, ఎల్. నాగేశ్వర రావులు ఆదివాంర జస్టిస్ చలమేశ్వర్‌ను కలుసుకున్నారని ప్రముఖ ఆంగ్ల పత్రిక పేర్కొంది. బార్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం కూడా జస్టిస్ చలమేశ్వర్‌ను కలుసుకుంది. న్యాయ వ్యవస్థలో ఏర్పడిన ఈ సంక్షోభాన్ని అంతర్గతంగా పరిష్కరించేందుకు బార్ కౌన్సిల్ సానుకూలంగా ఉంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులందరిని ఒక్కొక్కరిగా కలుసుకునేందుకు బార్ కౌనన్సిల్ ఏడుగురు సభ్యులతో కమిటీని నియమించింది. సుప్రీం కోర్టు నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన సమస్యను చర్చించేందుకు న్యాయమూర్తులు అందరితో సమావేశం ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ప్రతినిధుల కమిటి జస్టిస్ దీపక్‌మిశ్రాను కోరింది. ప్రజాహిత వ్యాజ్యాలను అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారణ జరపాలన్న నలుగురు న్యాయమూర్తుల వాదనకు బార్ కౌన్సిల్ ప్రతినిధి బృందం మద్దతు తెలిపింది.

ఢిల్లీ పార్కులో దుండగుల దాడి యువకుని మృతి: మరొకరికి గాయాలు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీ గోవిందపురిలోని ఒక పార్క్‌లో జరిగిన దాడి ఘటనలో 22 ఏళ్ళ యువకుడు మృతి చెందగా, అతని స్నేహితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. జామియా హదార్ద్ ఆసుపత్రి సమీపంలోని మంకీపార్క్‌లో శనివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఈ సంఘటనలో దాడికి గురైన యువకుడు నరేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు నరేష్ స్థానిక త్రిలోక్‌పురి ప్రాంతానికి చెందినవాడు. నరేష్ పైనా, అతని స్నేహితురాలిపైనా పార్కులో దాడి జరిగినట్లు శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో తమకు ఫోను వచ్చిందని పోలీసులు తెలిపారు. వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు తమకు ఇచ్చేయాలని దుండగులు బెదిరించడంతో వారు ప్రతిఘటించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో దుండగులు నరేష్‌ను కత్తితో పొడిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని దుండగులు పారిపోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. తాము అక్కడికి వెళ్ళే సరికి నరేష్ నెత్తురు మడుగులో ఉన్నాడని, అతని శరీరానికి పలు చోట్ల గాయాలయ్యాయని తెలిపారు. ఆ యువతికి కూడా గాయాలయ్యాయని, ఇద్దరిని సమీప ఆసుపత్రికి తరలించామని, కానీ ఆసుపత్రికి తీసుకు వెళ్ళే సమయానికే నరేష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.



ద్వితీయ శ్రేణి పౌరులుగా వలస కార్మికులు

కేంద్రంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ : వలస కార్మికులను కేంద్రం ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. పాస్‌పోర్టును చిరునామా ధృవీకరణగా పరిగణించకూడదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 'వివక్షపూరితమైంది'గా రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, ఇది వలస కార్మికులను ద్వితీయ శ్రేణి పౌరులగా పరిగణించడమేనని ఆయన అన్నారు. పాస్‌పోర్టు చివరిపేజీలో చిరునామా ముద్రించకూడదని,పాస్‌పోర్టును నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించకూడదని, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. విదేశాంగ శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖలకు చెందిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రెండు రంగులతో పాస్‌పోర్టును జారీ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎమిగ్రేషన్ చెక్ అవసరమైన వారికి ఆరంజ్ రంగు పాస్‌పోర్టు, ఎమిగ్రేషన్ చెక్ అవసరం లేని వారికి బ్లూ కలర్ పాస్‌పోర్టు జారీ చేస్తారు.

బడ్జెట్ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం!

44 చట్టాలను ఏకం చేసి ఒకే బిల్లు



న్యూఢిల్లీ : కార్మిక సంస్కరణల్లో భాగంగా రానున్న బడ్జెట్ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ఆమోదింపచేసుకోవాలని కేంద్రం భావిస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వేరువేరుగా ఉన్న కనీస వేతనాల స్థానంలో ఒకే వేతనం నిర్ణయించాలనే ఉద్దేశ్యంతో ఈ బిల్లును తీసుకు వస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే ప్రస్తుతం దేశంలో 44కు పైగా ఉన్న కార్మిక చట్టాలను ఏకం చేసి ఈ బిల్లును రూపొందిస్తున్నారు. వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, సాంఘిక భద్రతతోపాటు వృతిపరమైన భద్రత, ఆరోగ్య, పని పరిస్థితుల్లో భద్రత అనే నాలుగు ప్రధాన అంశాలను మిళితం చేసి ఈ బిల్లును తయారుచేశారు.

'కార్మిక చట్టాల సవరణ బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదింపచేయాలని కోరుకుంటున్నాం. ఈ నెల చివరిలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేనాటికి పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీ ఈ బిల్లును సిద్ధం చేస్తుందని కార్మిక మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లును 2017 ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తరువాత పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి పంపారు. వేతన చెల్లింపులు చట్టం 1936, కనీస వేతన చట్టం 1949, బోనస్ చెల్లింపుల చట్టం 1965, సమాన వేతన చట్టం 1976.. వంటి చట్టాలను ఒకే చట్టంగా రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 'మరో మూడు చట్టాలు చర్చల దశలో ఉన్నాయి. వీటిని కూడా ఈ ఏడాదిలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కార్మిక శాఖ యోచిస్తోంది' అని కూడా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కార్మిక చట్టాలపై వివిధ రకాలుగా ఉన్న నిర్వచనాలను, అధికారాలను ఈ సవరణ బిల్లుతో తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కనీసవేతన చట్టం, చెల్లింపుల చట్టం కార్మికులందరికీ వర్తించేవిధంగా లేవు. ఈ రెండు చట్టాలు షెడ్యూల్ చేయబడిన ఉద్యోగులకు పరిమితం చేయబడ్డాయి. అయితే నూతనం చట్టం అన్ని రంగాల్లోని ఉద్యోగులకు కనీస వేతనం, సమయానికి చెల్లించే విధంగా రక్షణ కల్పిస్తాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ జాతీయంగా కనీస వేతనం ఉండే విధంగానూ, కనీస వేతనాన్ని రాష్ట్రాలు నిర్ణయించకుండా నిరోధించడంలోనూ ఈ చట్టం తోడ్పడుతుంది. అలాగే వేతనాలు, చెల్లింపుల్లో వివాదాలను పరిష్కరించడానికి సమర్ధవంతమైన, వేగవంతమైన యంత్రాంగం ఏర్పాటుకు కూడా ఈ చట్టం ఉపయోగపడనుంది. అలాగే వివిధ రకాల ఉల్లంఘనలకు హేతుబద్ధమైన జరిమానాలు విధించడానికి కూడా ఈ చట్టం ఉపయోగ పడనుంది.

ప్రతి మోసాన్ని వెలుగులోకి తెచ్చేది రచయిత కలమే

ద హిందూ 'లిట్ ఫర్ లైఫ్'లో రాజ్ మోహన్ గాంధీ

చెన్నై : సమాజంలో జరుగుతున్న ప్రతి మోసాన్ని వెలుగులోకి తెచ్చేది, నొక్కి చెప్పేది రచయిత కలమేనని ప్రముఖ చరిత్ర కారుడు రాజ్‌మోహన్ గాంధీ అన్నారు. ప్రముఖ ఆంగ్ల పత్రిక ద హిందూ నిర్వహిస్తున్న 8వ సాహితి ఉత్సవం ఆదివారం చెన్నైలోని లేడీ ఆండాల్ స్కూల్‌లో ప్రారంభమైంది. "లిట్ ఫర్ లైఫ్-2018" పేరిట ఈ ఉత్సవం జరుగుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్తలు, పుస్తక ప్రేమికులు పాల్గొంటారు. ఈ సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా పలువురు వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి లిట్ ఫర్ లైఫ్-2018 డైరెక్టర్, క్యూరేటర్ నిర్మలా లక్ష్మణ్ స్వాగతం పలికారు. హిందూ పబ్లిషింగ్ గ్రూప్ చైర్మన్ ఎన్.రామ్ మాట్లాడుతూ ముఖ్య అతిథి రాజ్‌మోహన్ గాంధీని, ఆయనకున్న జ్ఞానాన్వేషణను ప్రశంసించారు. దేశ చరిత్రపై ఆయన పరిశోధనను మెచ్చుకున్నారు. శాంతి, సయోధ్య, లౌకిక వాదాలపై గాంధీకి ఉన్న నిబద్ధతను కొనియాడారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ 'హిందూ'తో తనకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకున్నారు. రచయితలకు ఎదురవుతున్న బెదిరింపులను తిప్పికొడుతూ ప్రసంగించారు. "సమాజంలో జరుగుతున్న ప్రతి మోసాన్ని, కపటాన్ని వెలుగులోకి తెచ్చేది పెన్నుకున్న పాళీ'యేనని అన్నారు. వారసత్వంగా వస్తున్న స్వతంత్రాన్ని పరిరక్షించుకోవలసి ఉన్నదని అన్నారు.

మౌనంగా ఉండను : తస్లీమా నస్రీన్

బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ మాట్లాడుతూ స్వేచ్ఛ లేకుండా వాక్‌స్వాతంత్ర్యం ఉనికిలో ఉండదన్నారు. తనకు బెదిరింపులు వస్తున్నప్పటికీ భారత్‌లో నివసించడం తనకెంతో ఇష్టమని చెప్పారు. ప్రభుత్వాలు వాక్ స్వాతంత్ర్యానికి మద్దతు ఎందు కివ్వవని ప్రశ్నించారు. స్వయం నియంత్రణ పేరుతో మనసులోని భావాలను దాచుకోవడం సరైంది కాదని, తనను హత్య చేస్తారన్న సంగతి తనకు తెలుసునని, అయినా తను భయపడనని ఆమె చెప్పారు.

ప్రత్యేకం

ఎయిర్ ఇండియా వాటాల అమ్మకానికి ప్రభుత్వం 'కసరత్తులు'

సిబ్బందికి పిఎస్‌యుల్లో ఉపాధి లేదా విఆర్ఎస్‌కు నిర్ణయం

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు



న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా సంస్థ నష్టాల బారిన పడిందన్న సాకు చూపుతూ అందులో వాటాల అమ్మకానికి సన్నద్ధమౌతున్న ప్రభుత్వం అందులో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వ రంగంలోని సంస్థల్లో ఉపాధి కల్పించడమా లేదా వాలంటరీ రిటైర్మెంట్ పథకాన్ని ప్రకటించడమా అన్న అంశాన్ని పరిశీలిస్తుండగా, మరో వంక ఉద్యోగ సంఘాలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా నిరసిస్తున్నాయి. రుణభారాన్ని తగ్గించుకొనేందుకు 49 శాతం మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది.ఎయిర్ ఇండియా దాదాపు రు. 50వేల కోట్ల మేరకు రుణభారంలో కూరుకుపోయిందని, పన్ను చెల్లింపు దారుల సొమ్మును వృధాకాకుండా చూసేందుకు అందులో వాటాల అమ్మకం ప్రతిపాదనను వ్యూహాత్మకంగా ముందుకు తెస్తూ, దాన్ని ఏ విధంగా అమలు చేయాలన్న అంశంపై వివిధ ప్రత్యామ్నాయాలను మంత్రుల బృందం పరిశీలిస్తోంది. వాటాల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించేందుకు కసరత్తులు చేస్తోంది. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎయిర్ ఇండియా సిబ్బందికి ఉపాధి కల్పించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నా, వాలంటరీ రిటైర్మెంట్ పథకాన్ని కూడా దృష్టిలో వుంచుకున్నదని అధికార వర్గాలు వెల్లడించాయి. సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడానికి వివిధ ప్రత్యామ్నాయాలు పరిశీలనలో వున్నాయని పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్.ఎన్. చౌదరి తెలిపారు. ఎయిర్ ఇండియా సిబ్బంది ముందు ప్రభుత్వ రంగ సంస్థల్లో చేరడం, వాలంటరీ రిటైర్మెంటు తీసుకోవడం వంటి ప్రత్యామ్నాయాలను ఉంచుతారా అన్న ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. ఎయిర్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లో కాంట్రాక్టు సిబ్బందితో సహా 29 వేల మంది సిబ్బంది వున్నారు. ఎయిర్ ఇండియాలో షరతులకు లోబడి విదేశీ విమాన సంస్థలతో సహా వివిధ సంస్థలను భాగస్వాములను చేసేందుకు వీలుకల్పిస్తూ ఈ నెల 10న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇతర స్వదేశీ విమాన సంస్థలతో పోటీ పడే సామర్థ్యాన్ని ఎయిర్ ఇండియాకు కల్పించేందుకే వాటాల అమ్మకం నిర్ణయం తీసుకున్నామని పౌర విమాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను సిఐటియుతో సహా వివిధ కార్మిక సంఘాలు నిర్ద్వందంగా త్రోసిపుచ్చుతున్నాయి.చివరకు ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక సంఘం స్వదేశీ జాగరణ్ మంచ్ కూడా ఇదే వైఖరి తీసుకోవడం ద్వారా ప్రభుత్వ నిర్ణయంపట్ల కార్మికవర్గంలో ఎంత వ్యతిరేకత వుందో స్పష్టమౌతుంది. అలాగే రవాణా, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ కూడా ఈ అంశంపై తొందరపాటు తగదని, ఎయిర్ ఇండియా ప్రతిష్టను కాపాడేందుకు దాని వాటాల అమ్మకానికి బదులు మరో ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలని సూచించింది. గత యుపిఎ ప్రభుత్వం ప్రతిపాదించిన పథకం ప్రకారం ఎయిర్ ఇండియా తిరిగి గాడిలో పడటానికి 2012 నుండి పదేళ్ల కాలంలో రు.30 వేలకు పైగా నిధులు పొందాల్సి వుంది.

సంక్షిప్తం

చనిపోయేందుకు అనుమతించాలి : అత్యాచార బాధితురాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో అత్యాచారానికి గురైన ఒక బాలిక గర్భవతి అయిన సంఘటన వెలుగుచూసింది. దీంతో తనకు బతకాలని లేదని, చావాలనుకుంటున్నానని అందుకు అనుమతించాలని కోర్టును వేడుకుంది. కాగా తమ కుమార్తెకు అన్యాయం చేసిన దుండగుడు పరారీలో ఉన్నాడని, అతని తల్లిదండ్రులు తన కుమార్తెను వివాహం చేసుకునేందుకు అంతకుముందు అంగీకరించారని, ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారని బాధితురాలి తల్లి ఆరోపించింది.

పూనెలో బిల్డర్ హత్య

పూనె : పూనెలోని డక్కన్ జింఖానా ప్రాంతంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు 56 ఏళ్ళ బిల్డర్‌ను కాల్చి చంపారు. దేవేంద్ర షా అనే బిల్డర్‌పై దుండగులు ఐదు మార్లు కాల్పులు జరిపారని, రెండు బుల్లెట్లు షా శరీరంలోకి దూసుకెళ్ళాయని పోలీసులు తెలిపారు. కాల్పులు జరిపిన దుండగులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సిసిటివి ఫుటేజ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. సిసిటివి కెమెరాల్లో కనిపించిన దృశ్యం మేరకు ప్రభాత్ రోడ్డులోని 7వ లైన్‌లో ఉన్న షా భవనం వద్దకు దుండగులు చేరుకున్నారు. అక్కడ లాండ్రీ నడుపుతున్న వ్యక్తితో ఘర్షణకు దిగారు.

ఊపిరాడక నలుగురు ఎలక్ట్రీషియన్ల మృతి

లక్నో: హోటల్‌లో పనిచేస్తున్న నలుగురు కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్లు ఊపిరాడక మృతిచెందారు. ఈ ఘటన లక్నోలోని విహుటీ ఖండ్ ప్రాంతంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హోటల్ బిల్డింగ్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో వీరందరూ నిద్రిస్తున్నారు. వారిని ఆ హోటల్ వాచ్‌మెన్ ఎన్ని సార్లు పిలిచినా లేవకపోవడంతో క్యాబిన్ లోపలికి వెళ్లి చూశాడు. వారు అపస్మారకస్థితిలోకి వెళ్లారనే విషయాన్ని ఆ వాచ్‌మేన్ హోటల్ మేనేజర్‌కు తెలియజేశాడు. వెంటనే వారిని ఆర్ఎమ్ఎల్ ఆస్పత్రికి తరలించగా వారు అప్పటికే మరణించినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు.

ఇరాన్ అణు ఒప్పందాన్ని అమలు చేయాలి

బీజింగ్ : ఆరుదేశాల కూటమితో ఇరాన్ కుదుర్చుకున్న అణు సహకార ఒప్పందాన్ని తాము గట్టిగా సమర్థిస్తున్నట్లు చైనా స్పష్టం చేసింది. ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని, ఇరాన్‌పై ఏకపక్ష ఆంక్షలు విధించటం ద్వారా గందరగోళ పరిస్థితులు సృష్టించవద్దని తాము కోరుతున్నామని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లూకాన్ చెప్పారు. అనేక వ్యయ ప్రయాసలతో రూపుదిద్దుకున్న ఈ ఒప్పందాన్ని సజీవంగా వుంచేందుకు అన్ని వర్గాలూ సహకరించాలని ఆయన కోరారు. రానున్న నాలుగు నెలల్లో ఇరాన్ కొత్త అణు ఒప్పందాన్ని కుదుర్చుకోకపోతే తాము ఆ దేశంపై నూతన ఆంక్షలను విధిపాంతమరిమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చేసిన ప్రకటనపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరాన్-ఆరుదేశాల కూటమి మధ్య కుదిరిన ఒప్పందాన్ని చైనా ఇప్పటికీ గట్టిగా సమర్థిస్తోందని, అత్యంత ప్రధానమైన ఈ బహుళపక్ష విజయం దౌత్యపరమైన, రాజకీయపరమైన ప్రక్రియల ద్వారా అంతర్జాతీయ సమస్యలు పరిష్కరించవచ్చునేందుకు ఉదాహరణగా నిలుస్తోందని చెప్పారు.



తప్పిన ప్రమాదం

టర్కీలో టేకాఫ్ తీసుకుంటున్న విమానం రన్‌వే నుండి స్లిప్ అయి సముద్రపుటంచున ఆగటంతో ఘోర ప్రమాదం తప్పింది.

టర్కీలో త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

అంకారా: టర్కీలో శనివారం రాత్రి ఒక ప్రయాణీకుల విమానం ఘోర ప్రమాదం నుండి త్రుటిలో బయటపడింది. టర్కీ ఉత్తర ప్రాంతంలోని ఒక విమానాశ్రయంలో టేకాఫ్ తీసుకుంటున్న ఒక విమానం రన్‌వే నుండి జారి పోయి కొద్ది దూరంలో వున్న సముద్రపు టం చుకు చేరి నిలిచిపోయింది. విమానం సముద్రంలో పడబోయి తప్పించుకున్న చిత్రాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. అంకారా నుండి వస్తున్న ఈ విమానం ట్రాబ్జాన్ విమానాశ్రయంలో సజావుగానే దిగినప్పటికీ విమానాశ్రయం ఉత్తరభాగం వరకూ వెళ్లిన తరువాత అక్కడ విమానం టైరు రన్‌వేపై నుండి జారిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరూ మరణించటం లేదా గాయ పడటం జరగలేదని అధికారులు చెప్పారు. నల్లసముద్రపుటంచుల్లో ప్రమాదకరంగా వున్న విమానం చిత్రాలను టర్కీలోని పలు మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. ఈ ప్రమాదానికి కారణం వెంటనే తెలియరాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని ట్రాబ్జాన్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది.

ఆఫ్రికాతో సహకారంలో నూతనాధ్యాయం : వాంగ్ ఇ

కిగాలి (రువాండా): తాము చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియటివ్ (బిఆర్ఐ) ప్రాజెక్టు ద్వారా ఆఫ్రికా దేశాలతో సహకారంలో నూతనాధ్యాయం ప్రారంభం కాగలదని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఇ చెప్పారు. ప్రస్తుతం ఆఫ్రికా దేశాలలో పర్యటిస్తున్న వాంగ్ ఇ శనివారం ఇక్కడ రువాండా విదేశాంగ మంత్రి లూయిస్ ముషికివాబోతో భేటీ అయ్యారు. ఈ ఏడాది చైనా-ఆఫ్రికా సహకార వేదిక సదస్సును విజయవంతంగా నిర్వహించటం ద్వారా రువాండాతో మరింత సన్నిహితంగా పనిచేసే అవకాశం లభిస్తుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

తదుపరి కార్యాచరణపై ఉభయకొరియాల చర్చలు

సియోల్: ద.కొరియా నిర్వహించనున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడలలో పాల్గొనేందుకు సిద్ధమై చర్చలకు వచ్చిన ఉ.కొరియా ప్రతినిధి బృందం తదుపరి కార్యాచరణపై సోమవారం నాడు పన్‌మున్‌జం గ్రామంలో భేటీ కావాలని నిర్ణయించింది. ద.కొరియా ప్రభుత్వానికిచెందిన కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించింది. ఈ చర్చల్లో పాల్గొనే ఉ.కొరియా ప్రతినిధి బృందానికి ఆ దేశ సాంస్కృతిక, క్రీడా, పర్యాటక శాఖలకు చెదిన అధికారి నేతృత్వం వహిస్తారని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. పన్‌మున్‌జోన్ గ్రామంలో ద.కొరియా వైపు వున్న పీస్‌హౌస్‌లోనూ, అదే గ్రామంలో ఉ.కొరియా వైపు వున్న టోంగిల్ పెవిలియన్‌లోనూ ఇరువర్గాలూ భేటీ అవుతాయని తెలిపారు. క్రీడాకారులను పంపే అంశంపై జనవరి 15న తుది చర్చలు జరపాలని ఉ.కొరియా ప్రతిపాదించినట్లు ద.కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ ఇంతకు ముందు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఖండాంతర క్షిపణి ప్రయోగంపై తప్పుడు హెచ్చరిక

క్షమాపణ చెప్పిన హవాయి దీవుల ప్రభుత్వం




తప్పుడు హెచ్చరిక అనంతరం మీడియాతో మాట్లాడుతున్న హవాయి గవర్నర్

లాస్‌ఏంజెల్స్: తమ భూభాగంవైపు ఖండాంతర క్షిపణి దూసుకు వస్తోందంటూ ఉత్తర పసిఫిక్ అమెరికా ప్రాంతంలోని హవాయి ప్రభుత్వం జారీ చేసిన తప్పుడు హెచ్చరిక హవాయి దీవుల వ్యాప్తంగా తీవ్ర గందరగోళానికి దారి తీసింది. అయితే క్షిపణి వార్త తప్పని తేలటంతో హవాయి ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పింది. హవాయి ప్రభుత్వ అత్యవసర సేవల నిర్వహణా సంస్థ అడ్మినిస్ట్రేటర్ వెర్న్ మియాగీ శనివారం మధ్యాహ్నం హడావుడిగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ క్షిపణి హెచ్చరిక జారీ చేయటంతోపాటు 'ఖండాంతర క్షిపణి దూసుకు వస్తోంది. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి' అంటూ సెల్‌ఫోన్లకు అత్యవసర సందేశాలను కూడా పంపారు. ఈ తప్పుడు హెచ్చరికలు టెలివిజన్ ఛానళ్ల వార్తా ప్రసారాలలో సైతం ప్రసారం కావటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు లోనయ్యారు. వెంటనే కొద్ది సేపటికి అధికారులు ఈ హెచ్చరికలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే సెల్‌ఫోన్ల ద్వారా పంపిన సందేశాలను తుడిచి వేసేందుకు వీలు లేకపోవటంతో అప్పటికే ఈ తప్పుడు సందేశం విస్తృతంగా ప్రచారమైన ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసింది. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి సర్దుబాటు హెచ్చరికలు పంపినప్పటికీ గందరగోళం తగ్గ లేదు. అమెరికా సైన్యానికి చెందిన పసిఫిక్ కమాండ్ సైతం దీనిని తప్పుడు హెచ్చరికలుగా ధృవీకరించింది. హవాయి దీవులకు ఎటువంటి క్షిపణి ముప్పు లేదని ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. హవాయి గవర్నర్ డేవిడ్ ఐజ్ మాట్లాడుతూ ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిన ఈ తప్పుడు హెచ్చరికలు జారీ కావటం దురదృష్ట కరం, విచారకరమని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై తాను మీడియా ద్వారా ప్రజలకు క్షమాపణ చెబుతున్నానన్నారు.

ప్రపంచ బ్యాంకు ర్యాంకులలో వివక్ష

చిలీ విమర్శ



శాంటియాగో: వాణిజ్యానుకూల పరిస్థితుల విషయంలో ప్రపంచ బ్యాంకు ఆయా దేశాలకు ప్రకటించిన ర్యాంకులు వివక్షతో కూడి వున్నాయని చిలీ ప్రభుత్వం విమర్శించింది. ప్రపంచ బ్యాంకు ప్రకటించిన పోటీతత్వ ర్యాంకుల విషయం తమకు అన్యాయం జరిగిందని, ఇది తీవ్ర ఆందోళనకరమైన విషయమని అధ్యక్షురాలు మిచెల్లి బాచ్లెట్ వ్యాఖ్యానించారు. కాగా తన పదవీ కాలంలో ప్రకటించిన ఈ ర్యాంకులలో చిలీకి స్థానం దక్కకపోవటంపై ప్రపంచ బ్యాంకు ప్రధాన ఆర్థిక వేత్త పాల్ రోమర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయా దేశాల అభివృద్ధిపై ప్రభావం చూపే విధంగా అంతర్జాతీయ సంస్థలు ప్రకటించే ర్యాంకులు విశ్వసనీయంగా వుండాలని బాచ్లెట్ ప్రపంచ బ్యాంకుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ ర్యాంకింగ్‌లలో దొర్లిన తప్పుపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని తమ ప్రభుత్వం కోరుతోందని ఆయన వివరించారు. ప్రపంచ బ్యాంకు వెల్లడించిన ర్యాంకుల్లో 2014లో బాచ్లెట్ అధికారం స్వీకరించిన నాడు 34వ స్థానంలో వున్న చిలీ ప్రస్తుతం 55వ స్థానంలో నిలిచింది. 2015లో ఈ దేశం ర్యాంకు 41వ స్థానానికి దిగజారింది. 2016లో 48వ స్థానంలోనూ 2017లో 57 వ స్థానంలోనూ చిలీ నిలిచినట్లు ప్రపంచ బ్యాంకు నివేదికలు చెబుతున్నాయి. చిలీలో వాణిజ్యానుకూల పరిస్థితులు క్షీణించాయనటం కన్నా అధ్యయనంలో తాము అనుసరించిన విధానంలోనే తప్పులు దొర్లి వుండవచ్చని, దీనితో పాటు ప్రపంచ బ్యాంకు అధికారులు, సిబ్బంది రాజకీయ ప్రయోజనాలతో కూడా ఇది ముడిపడి వుండవచ్చని ఆయన వివరించారు.

పెరూలో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 7.3 పాయింట్ల తీవ్రత నమోదు

లీమా: పెరూలో ఆదివారం నాడు పెను భూకంపం సంభవించినట్లు అమెరికా భూభౌతిక పరిశోధనా సంస్థ (యుఎస్‌జిఎస్)వెల్లడించింది. రిక్టర్ స్కేల్‌పై 7.3 పాయింట్ల తీవ్రత నమోదు చేసుకున్న ఈ ప్రకంపనల ధాటికి ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరిగినట్లు వార్తలందలేదు. పెరూలోని దక్షిణ, నైరుతి దిశలో భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.48 గంటల సమయంలో భూగర్భంలో 12.1 కి.మీ లోతున ఈ ప్రకంపనలు సంభవించినట్లు యుఎస్‌జిఎస్ వెల్లడించింది. అయితే ఈ ప్రకంపనల అనంతరం సునామీ హెచ్చరిక జారీ చేసిందీ లేనిదీ స్పష్టంగా తెలియరాలేదు. కానీ పెరూ, చిలీలోనికొన్ని తీర ప్రాంతాలలో ప్రమాదకరమైన రీతిలో అలలు ఎగసిపడే ప్రమాదం వుందని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం ఒక ప్రకటనలో హెచ్చరించింది.

బ్రెగ్జిట్ ఫలితం తారుమారు?

నిష్క్రమణ అనుకూలవాదుల ఆందోళన



లండన్: ఐరోపా దేశాల కూటమి (ఇయు) నుండి నిష్క్రమించాలంటూ బ్రిటన్ ప్రజలిచ్చిన తీర్పు తారుమారయ్యే ప్రమాదం పొంచి వున్నదని బ్రిటన్ నిష్క్రమణ అనుకూల వాదులు (బ్రెగ్జిట్ క్యాంపెయినర్స్) ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటన్ నిష్క్రమణ వాదుల అనుకూల బృందం నేత నీజెల్ ఫరాజ్ ఆదివారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బ్రెగ్జిట్ కోసం ప్రజలిచ్చిన తీర్పునకు విరుద్ధంగా బ్రిటన్ ఇయులోనే కొనసాగాలంటూ కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థల ఆర్థిక అండదండలతో వ్యవస్థీకృత ప్రచారం కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రెగ్జిట్‌ను వ్యతిరేకిస్తున్న వర్గానికి ప్రస్తుతం పార్లమెంట్‌లో మెజార్టీ వుందని, బ్రెగ్జిట్ అనుకూల వాదులు సంఘటితం కాకుంటే బ్రెగ్జిట్ కోసం సాధించిన చారిత్రాత్మక విజయాన్ని కోల్పోతామని అన్నారు. ఇయులో బ్రిటన్ సభ్యత్వం కొనసాగించే అంశంపై మరోసారి రిఫరెండం నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఫరాజ్ గత వారం హెచ్చరించిన విషయం తెలిసిందే. 2016 జూన్‌లో బ్రిటన్ ప్రజలు ఐరోపా కూటమి నుండి తమ దేశం నిష్క్రమించాలంటూ 52-48 శాతం ఓట్ల మెజార్టీతో తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై మరోసారి తీర్పు కోరే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ప్రకటించిన ప్రధాని థెరెస్సా మే తాము ఇయుతో సామరస్యపూర్వకంగా విడిపోయేందుకు ప్రయత్నిస్తున్నామని, ముఖ్యంగా నిష్క్రమణ అనంతరం దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. అయితే ప్రధాని మే చర్యలు మాత్రం బ్రెగ్జిట్ ప్రచారంపై నీళ్లు చల్లే విధంగా వున్నాయని విమర్శిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

సంక్రాంతికి అన్న క్యాంటీన్లు ఏవీ?

దాటుతున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో అసలు అన్న క్యాంటీన్లు ఏర్పాటవుతాయా లేదా అని సామాన్యులకు అనుమానం కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం వెలగపూడి సచివాలయం సమీపంలో మాత్రమే క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లిమర్ల, రాజాం, కాకినాడ, గుంటూరు, ఒంగోలు, కందుకూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, హిందూపురంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని పలుమార్లు మంత్రివర్గ సమావేశంలో చర్చించినా ఇప్పటికీ అమలు కాలేదు. ముఖ్యంగా రోజువారీ కూలికెళ్లే పేదలు, చిరుద్యోగుల కడుపు నింపాలనే ఆలోచనతో ఉదయం పూట రెండు ఇడ్లీలు, పొంగల్, టమోటా బాత్ వంటి టిఫిన్‌ను కేవలం రూపాయికే అందివ్వాలనేది అన్న క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశం. మధ్యాహ్న సమయంలో సాంబారు అన్నం, పులిహోరా, పెరుగన్నం ఒక్కో దానికి రూ. 5 చొప్పున రేటు నిర్ణయించారు. ఇప్పటికే తమిళనాడులో అమలు చేస్తున్న అమ్మ క్యాంటీన్ల తరహాలో రాష్ట్రంలో కూడా వీటిని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా 2014 అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి కనీసం నాలుగు ప్రధాన పట్టణాల్లో 35 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ప్రకటించారు. తమిళనాడులో విజయవంతంగా అమలవుతున్న అమ్మ క్యాంటీన్ల నిర్వహణను స్వయంగా పర్యవేక్షించేందుకు మంత్రుల బృందం కూడా రెండు, మూడుసార్లు వెళ్లి పరిశీలించింది. ఒక్క చెన్నైలోనే ఏర్పాటు చేసిన 203 క్యాంటీన్లలో దాదాపు 18 లక్షల మంది పేదలు ఆ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, అదే తరహాలో మన రాజధాని అమరావతిలో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే ఈ హామీలన్నీ ప్రకటనల వరకే పరిమితమయ్యాయి. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, జగ్గయ్యపేటతోపాటు గుంటూరు జిల్లా మంగళగిరిలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ ఇటీవలే ప్రకటించారు. వాటికి పురపాలక కమిషనర్లే స్థల సేకరణ చేయాలని సూచించారు. అయినా ఎక్కడా పురోగతి కనిపించడంలేదు. 2018 సంక్రాంతి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 50 అన్నక్యాంటీన్లను ఎట్టిపరిస్థితిలోనైనా ఏర్పాటు చేస్తామని స్వయంగా సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. సంక్రాంతి అయితే వచ్చేసింది కానీ ఎక్కడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయలేదు.

పెదవి విప్పండి..!

వివక్ష చూపుతున్నారని, కొన్ని ఎంపిక చేసిన కేసులను జూనియర్ న్యాయ మూర్తుల నేతృత్వంలోని కొన్ని ఎంపిక చేసిన ధర్మాసనాలకు మాత్రమే కేటాయిస్తున్నారని ఇది ఏకపక్షంగా సాగుతోందని సీనియర్ న్యాయ మూర్తులు ఆందోళన వ్యక్తం చేశారని వారు ఈ లేఖలో వివరించారు. ఇది న్యాయవ్యవస్థ పాలన పైన, శాంతి, భద్రతల పరిస్థితిపైన తీవ్ర ప్రభావం చూపే అంశమని ఈ లేఖలో పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి సర్వోన్నత న్యాయస్థానం సారథే అయినప్పటికీ కేసుల కేటాయింపు విషయంలో ఏకపక్షంగా వ్యవహరించరాదన్న వారి వాదనతో తాము ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ధర్మాసనాల ఏర్పాటు, కేసుల కేటాయింపు వంటి అంశాలకు సంబంధించిన నియమ నిబంధన లకు అనుగుణంగా పరిష్కరించాల్సిన అవసరం వుందన్నారు. న్యాయవ్యవస్థలోనూ, సుప్రీంకోర్టు పైన ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణమే ఈ చర్యను చేపట్టాల్సి వుందని వారుసూచించారు. అయితే అది చేసే వరకూ పెండింగ్ కేసులతో సహా ప్రధానమైన కేసులన్నింటినీ ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలన్నారు. ఇటువంటి చర్యలు మాత్రమే సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని ప్రజలకు కలిగిస్తాయని, సుప్రీం కోర్టు సారథిగా ప్రధాన న్యాయమూర్తి కొన్ని సున్నితమైన కేసుల కేటాయింపు విషయంలో నిర్దిష్ట ఫలితాలను ఆశించే విధంగా తన అధికారాలను దుర్వినియోగం చేయరాదని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలని తాము కోరుతున్నామని వారు ఈ లేఖలో పేర్కొన్నారు.

జస్టిస్ లోయ మృతిపై సందేహాలు లేవు : ఎఅనుజ్ లోయ

ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయ మృతిపై తనకు ఎటువంటి అనుమానాలు లేవని ఆయన కుమారడు అనూజ్ లోయ ఆదివారం తెలిపారు. బి.హెచ్. లోయ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడని ఆరో పణలు వచ్చిన సంగతి తెలిసిందే. న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూజ్ లోయ మాట్లాడుతూ అంతకుముందు అనుమానాలు ఉండేవని ఇప్పడన్నీ తీరిపోయాయని చెప్పారు. తన తండ్రి మృతి విషయమై తన కుటుంబాన్ని వేధించడం ఆపివేయాలని రాజకీయ నేతలను, ఎన్జీఓలను ఆయన అభ్యర్థించారు.

కత్తులు దూసిన కోళ్లు

ప్రజాశక్తి-గోదావరి, కృష్ణా, అనంతపురం, చిత్తూరు ప్రతినిధులు

సంక్రాంతి పండుగ ఆదివారం భిన్న దృశ్యా లను ఆవిష్కరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకవైపు యువజనులు, ప్రజల్లో ఐక్యమత్యాన్ని, సామ రస్యాన్ని ప్రభోదిస్తూ ప్రజాసంఘాలు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తుండగా.. మరోవైపు గోదావరి జిల్లాల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ కోడి పందేలను వేడుకగా దగ్గరుండి మరీ వేయించడం చర్చనీయాంశంగా మారింది. కోడి పందేలు జరక్కుండా గట్టి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, జిల్లా స్థాయి పోలీసు అధికారులు 144వ సెక్షన్ విధించి పందేలను ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వ బోమని ప్రకటించినా అన్నీ ఉత్తుత్తే అని తేలిపోయింది. పందేలు యథేచ్ఛగా సాగిపోయాయి. ఒక్క కోడి పందేలే కాదు.. అనంతపురం జిల్లాలో పందులు పందేలను ఎమ్మెల్యే జెసి ప్రభాకరరెడ్డి,కృష్ణాలో పొట్టేళ్ల పోటీలను పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించగా.. చిత్తూరు జిల్లాలో జల్లికట్టు పోటీలను నిర్వహించారు. ఇక పందేల్లో భాగంగా గుండాటలు, మూడు ముక్కలాటలు రంజుగా సాగాయి. మద్యం ఏరులై పారింది.

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 300 బరుల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. జంగారెడ్డిగూడెంలోని శ్రీనివాసపురం, పాల్లకొల్లు ఏరియాలోని పూలపల్లి, కలగంపూడి, భీమడోలు మండలంలోని గుండుగొలను, పెదవేగి మండలం, భీమవరం, కొవ్వూరు, తాళ్లపూడి, పోడూరు, పెనుమంట్ర, చాగల్లు, దేవరపల్లి, జీలుగుమిల్లి, వీరవాసరం, ఆకివీడు, పాలకోడేరు, ఆచంట ప్రాంతం లోనూ యథేచ్ఛగా పందేలు వేశారు. గుండుగొలనులో ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, బయ్యన్నగూడెంలో పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్ స్వయంగా పందేలను ప్రారంభించారు. పందేలపై పోలీసులు చేతు లెత్తేయడంతో బరుల వద్ద మూడు ముక్కలాట, గుండాట యథేచ్ఛగా సాగాయి. మద్యం ఏరులై పారింది. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ కొనసాగుతుందని పోలీసులు చెప్పినప్పటికి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. తొలి రోజే రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు మేర పందేలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి పెద్దఎత్తున పందెంరాయుళ్లు జిల్లాకు చేరుకుంటున్నారు. వెంప గ్రామంలో పందేలను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా వివాదం చోటుచేసుకుంది.

తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల, అల్లవరం మండలం గోడి, గోడిలంక ప్రాంతాలతోపాటు జిల్లాలో 90కి పైగా బరుల్లో ఆదివారం కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. ఒక్క మురమళ్లలోనే భోగి రోజు రూ.25 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయని అంచనా. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పందెం రాయుళ్లు రావడంతో పందేలు జరిగిన ప్రాంతం జనంతో కిక్కిరిసింది. జిల్లావ్యాప్తంగా భోగి రోజున రూ.70 కోట్లకుపైగా పందేలు జరిగాయని అంచనా. ఐ.పోలవరం మండలం మురమళ్లలో 15 ఎకరాల్లో 10 బరులు సిద్ధం చేశారు. 2,500 మంది తిలకించేలా మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులు రాకుండా వందమంది గార్డులను నియమించారు. ఐదు వేల వాహనాలు పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ బరిని కోటిన్నరకు వేలం వేసినట్టు, గుండాటల నిర్వహణకు రూ.50 లక్షలకు వేలం పాట జరిగిందని ప్రచారం జరుగుతోంది. ఇక్కడ 20 గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద మద్యం, బిర్యానీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) మురమళ్లలో పందేలను ప్రారంభించారు. గతేడాది కూడా ఈయనే పందేలను ప్రారంభించారు. ఎంఎల్‌సి బొడ్డు భాస్కర రామారావు, ముమ్మిడివరం ఎంఎల్ఎ సోదరుడు దాట్ల పృథ్వీరాజ్, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, కుడుపూడి చిట్టబ్బాయి, మురమళ్ల సర్పంచి తెయ్యేటి శ్రీనుబాబు తదితరులు పందేలను తిలకించారు. సుమారు 600 మంది విఐపిలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వేలకుపైగా పందెంరాయుళ్లు వచ్చారని అంచనా. ఫ్లడ్ లైట్ల కాంతిలోనూ రాత్రి సమయంలో పందేలు సాగాయి. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలతోపాటు తెలంగాణా జిల్లాల నుంచీ పందెంరాయుళ్లు కార్లలో మురమళ్ల చేరుకుని కోట్లలో పందేలు వేస్తున్నారు. స్టేడియం మాదిరి ఏర్పాటు చేసిన బరిలో ఆరు స్క్రీన్లు ఉండగా వేలాదిమంది కూర్చొని పందేలను వీక్షించారు. విఐపి గ్యాలరీలను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ నోట్ల కట్టలను పట్టుకుని పందెం రాయుళ్లు తిరుగుతూ బెట్టింగ్‌లు వేశారు. అమలాపురం మండలం కామనగరువు, ఉప్పలగుప్తం మండలం కూనవరం, చల్లపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి ప్రాంతాల్లోనూ పందేలు జోరుగా సాగాయి. ఐ.పోలవరం, కొత్తపాకలతోపాటు కాట్రేనికోన మండలంలోని చెయ్యేరు, గెద్దనాపల్లిలో పెద్ద బరులు ఏర్పాటు చేశారు. కాట్రేనికోన, లచ్చియ్య చెరువు, నడవపల్లి, వేట్లపాలెంలో బరులు ఏర్పాటు చేశారు. అల్లవరం మండల కేంద్రంతోపాటు కామనగరువు, చల్లపల్లి, ఎస్.యానాంలోనూ భారీ బరి ఏర్పాట్లు చేశారు. రాజోలు మండలం సోంపల్లి, గోడిలోనూ జోరుగా పందేలు సాగాయి. ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు నియోజకవర్గంలో సుమారు 13 చోట్ల పందేలు జరిగాయి. ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లోనూ యథేచ్ఛగా జరిగాయి.

అంపాపురం వెంచర్‌లో నాలుగెకరాల్లో జూదం

కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాలలో కోడిపందేలు, పేకాట జోరుగా సాగాయి. ఆదివారం ఒక్కరోజే కోట్లాది రూపాయలు చేతులు మారాయి. గన్నవరం నియోజకవర్గంలోని అంపాపురం వెంచర్‌లోని నాలుగు ఎకరాల్లో జూదం జోరుగా సాగింది. పేకాట కోసం మూడు గుడారాలు వేశారు. ఒక్కో దాంట్లో నాలుగు కౌంటర్ల చొప్పున మొత్తం 12 కౌంటర్లు ఏర్పాటు చేశారు. కోడి పందేల కోసం ఆరు షామియానాలు ఏర్పాటు చేశారు. కోళ్లకు కత్తులు కట్టి వాటిని బరిలో వదులుతున్నారు. ఇక్కడ కనీస పందెం రూ.50 వేలుగా నిర్ణయించారు. మండలంలో అనేక గ్రామాల్లో పందేలు జరిగాయి. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, తిరువూరు, మైలవరం, జి.కొండూరు, బాపులపాడుతోపాటుగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున కోడిపందేలు జరిగాయి. కొల్లేరు పరీవాహక ప్రాంతంలోని కలిదిండి, కైకలూరు, మండవల్లి, నందివాడ మండలాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కలిదిండి మండలంలోని తాడినాడ, ఆవకూరు, సారా రుద్రవరం, మిలటరీపేట, కైకలూరు నియోజకవర్గంలో ఆదివారం ఒక్కరోజునే రూ.10 కోట్లు పందాలు నడిచి ఉంటాయని అంచనా వేస్తున్నారు.

ఈడ్పుగల్లులో పొట్టేలు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో గొడవర్రు, ఈడ్పుగల్లు గ్రామాల్లో జూదాలు నిర్వహించారు. ఈడ్పుగల్లులో పొట్టేలు పందేలను పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు.వందలాది మంది తిలకించారు.

తాడిపత్రిలో పందుల పోటీలను ప్రారంభజంచిన ఎమ్మెల్యే ప్రభాకరరెడ్డి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో స్థానిక ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి పందుల పందేలను ఆదివారం ప్రారంభించారు. కోళ్ల పందేలు కాకుండా పందులకు పోటీలు నిర్వహించడం చర్చనీయాంశమయ్యింది. ఈ పోటీలు ఎలా జరుగుతాయోనని చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తాడిపత్రి బిఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ సమీపంలోని మైదానంలో పందుల పోటీలను నిర్వహించారు. జిల్లాలోని కడప, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి యజమానులు పందులను పెద్దసంఖ్యలో తీసుకువచ్చారు. పందుల పోటీలను తిలకించటానికి ప్రజలు పెద్దఎత్తున్న తరలివచ్చారు.

చిత్తూరు జిల్లాలో జల్లికట్టు

చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని అనుపల్లి గ్రామంలో ఆదివారం జల్లికట్టు పోటీలను నిర్వహించారు. జల్లికట్టులో పశువుల కొమ్ములను రంగవల్లికలతో అలంకరించి వాటి మధ్య పలకలను అమర్చారు. సుమారు 500 పశువులతో జల్లికట్టు కార్యక్రమాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి జల్లికట్టును చూడటానికి వేలాది మంది తరలివచ్చారు. జల్లికట్టులో వదిలిన పశువులను పట్టుకోవడానికి పలువురు యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. పశువులను పట్టుకోవడానికి ప్రయత్నించిన కొందరు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి.

భారత్ చేరిన నెతన్యాహూ

మొదటి పేజీ తరువాయి

హఫీయా నగరాన్ని భారత సైనికులు విముక్తి చేశారు. ఆనాడు 15వ ఇంపీరియల్ సర్వీస్ అశ్వికదళంలో పనిచేసిన భారత సైనికులు అనేక మంది ఈ పోరాటంలో అమరులయ్యారు. దాదాపు 900 మంది సైనికులకు ఇజ్రాయిల్‌లోనే అంత్యక్రియలు జరిగాయి. వీరి పోరాటం ఫలితంగా 1918 సెప్టెంబర్ 23న హఫియా స్వతంత్రం పొందింది. భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అధికారిక నివాసమైన తీన్‌మూర్తి భవన్ సమీపంలో ఉండటంతో ఈ యుద్ధ స్మారకాన్ని కూడా తీన్ మూర్తి చౌక్‌గా పిలుస్తూవచ్చారు. గతేడాది మోడీ ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఈ చౌక్ పేరు మార్చాలని ప్రతిపాదించింది. ఇప్పుడు దానికి తీన్‌మూర్తి హఫీయా చౌక్‌గా అధికారికముద్ర పడింది.

15 ఏళ్ల విరామం తర్వాత..

భారత్‌లో పర్యటించిన రెండో ఇజ్రాయిల్ ప్రధాన మంత్రిగా నెతన్యాహూ రికార్డులకెక్కారు. 15 ఏళ్ల కిందట 2003లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించారు. అప్పట్లో భారత ప్రధానిగా బిజెపి సీనియర్ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి ఉన్న సంగతి విదితమే.



పండగ వేళ ప్రమాదాలు



మొదటి పేజీ తరువాయి

చోటుచేసుకుంది. రహదారిపై మంచు విపరీతంగా ఉండటంతో ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. మృతిచెందిన వారిలో గ్రామ సర్పంచ్ ముత్యాల నరసమ్మ (45), పామంజి మంజుల(43), కారు డ్రైవర్ జాఫర్ ఉన్నారు. సర్పంచ్ భర్త ముత్యాల మల్లికార్జున్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చెన్నయ్‌కు తరలించారు.

నెల్లూరు ప్రశాంతినగర్‌లో జరిగిన మరో ప్రమాదంలో స్కూటర్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అక్కడక్కడే మృతిచెందారు. ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో మేకల సుబ్రమణ్యం, వెంకటేష్ మృత్యువాత పడ్డారు. రాపూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. రహదారిపై రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది.

పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం తేతలి గ్రామపరిధిలో మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. తేతలికి చెందిన వేంద్ర సత్యనారాయణ(43), కాళ్ల మండలం పెద అమిరానికి చెందిన జల్లా చినసోమయ్య(44) తేతలి గ్రామ కూడలిలో జాతీయ రహదారిపై దాటుతుండగా.. అదే సమయంలో తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు వస్తున్న ఇండిగో కారు వీరిని ఢీకొంది. అనంతరం ప్రమాద స్థలికి వంద మీటర్ల దూరంలో ఉన్న గేదెల పాకలోకి కారు దూసుకుపోయింది. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పొగ మంచు, మితిమీరిన వేగం ప్రమాదానికి కారణమని గుర్తించారు. మృతులిద్దరూ సంక్రాంతి పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వస్తున్నట్లు తెలిసింది.

ఇదే జిల్లా చింతలపూడిలో ఓ ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి బజాజ్ షోరూమ్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఏలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు అశ్వారావుపేట నుంచి ఏలూరుకు ప్రయాణికులతో బయలుదేరింది. ఆ బస్సు స్థానిక బజాజ్ షోరూమ్ వద్దకు వచ్చేసరికి కట్ ప్లేట్‌లు విరిగిపోయాయి. దీంతో స్టీరింగ్ పనిచేయక బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న బజాజ్ షోరూమ్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో షోరూమ్ ముందు భాగంలో ఉన్న షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. షెడ్డు కింద ఉన్న యమారెడ్డి, శివ, శ్రీను గాయాలపాలయ్యారు. వారిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో యమారెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విహార యాత్రలో గుండెపోటుతో పర్యాటకుని మృతి

తూర్పుగోదావరి జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పాపికొండల విహారయాత్రలో హైదరాబాద్ సూరూర్ నగర్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగి డోర్నాల శశిధర్‌రెడ్డి(52) గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హట్స్ మేనేజర్ సహకారంతో లాంచీ ద్వారా పోచవరం తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్ సహాయంతో రేఖపల్లి పిహెచ్‌సికి తరలించారు. మార్గం మధ్యలోనే చనిపోయినట్లు వైద్యాధికారి శివకృష్ణారెడ్డి తెలిపారు.



'ఎంఎల్ఏ' కల్యాణ్ రామ్

మార్చి నుంచి 'ఎంఎల్ఏ' ప్రచారం

నందమూరి కల్యాణ్ రామ్ కథానాయకుడిగా రూపొందుతోన్న సినిమా 'ఎంఎల్ఏ'. మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి అనేది ఉప శీర్షిక. ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌లను సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం విడుదల చేశారు. కొత్త లుక్‌లో ఎంతో స్టైలిష్‌గా కల్యాణ్ రామ్ ఈ సినిమాలో కనబడుతున్నట్టు ఈ టీజర్ ద్వారా అర్థమవుతుంది. 'వస్తున్నాడు వచ్చేస్తున్నాడు.. మన అందరి ఆశాజ్యోతి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, నమస్తే తెలంగాణ..' అన్న డైలాగ్ సినిమాపై ఆసక్తి రేకెత్తిస్తోంది. ఎమ్మెల్యే గెటప్‌లో స్టైల్‌గా కళ్లద్దాలు పెట్టుకోవడం, కండువా వేసుకోవడం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం ద్వారా ఉపేంద్ర మాధవ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. కాజల్ కథానాయికగా చేస్తోంది. విశ్వప్రసాద్ సమర్పణలో, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌ల సంయుక్త నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. టాకీ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేసుకుంది. వచ్చే నెలలో విదేశాల్లో గీతాలు చిత్రీకరణతో పూర్తి చేస్తుంది. "ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ చిత్రం హీరో కల్యాణ్ రామ్ కెరీర్‌లో ఒక మంచి చిత్రం అవుతుంది అని నమ్ముతున్నాం. నూతన దర్శకుడు ఉపేంద్ర ఈ చిత్రాన్ని చాలా వినోదభరితంగా మలిచారు. మార్చిలో వేసవి సెలవుల సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. రవి కిషెన్, పోసాని , జయప్రకాశ్ రెడ్డి, అజయ్, వెన్నెల కిశోర్, పృథ్వీ, శివాజీ రాజా, ప్రభాస్ శ్రీను, లాస్యా , మనాలి రాథోడ్ ఈ చిత్రం లోని ప్రధాన నటులు. కల్యాణ్ రామ్ ఈ చిత్రంతో పాటు 'నా నువ్వే' సినిమా కూడా చేస్తున్నాడు. ఇందులో ఆయనకు తమన్నా జోడీగా నటిస్తుంది. కాజల్ 'పారిస్ పారిస్' అనే తమిళ చిత్రంలో నటిస్తుంది. బాలీవుడ్‌లో వచ్చిన 'క్వీన్' సినిమాకు ఇది రీమేక్‌గా రాబోతోంది.

ఇక యుద్ధమే



'కృష్ణార్జున యుద్ధం'లో నాని

వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద విజయాలు నమోదు చేసుకుంటున్న హీరో నాని. 'ఎంసీఏ...మిడిల్ క్లాస్ అబ్బాయి' తర్వాత ఆయన హీరోగా చేస్తున్న సినిమా 'కృష్ణార్జున యుద్ధం'. యాక్షన్ కింగ్ అర్జున్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను భోగి సందర్భంగా ఆదివారం ట్విట్టర్ ద్వారా విడుదల చేశాడు. శనివారం ట్విటర్ వేదికగా ఈ సినిమాకు సంబంధించిన కీలక ప్రకటన చేశారు. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 'ఎంసీఏ'ను పెద్ద సక్సెస్ చేసినందుకు ధన్యవాదాలు. మామూలుగా ఓ సినిమా విడుదలకు దాదాపు నెల రోజులు ముందుగా ఫస్ట్‌లుక్, ఫస్ట్ సాంగ్ విడుదల చేస్తుంటాం. మేం ముందే ఆ పాటను చూస్తుంటాం. ఫస్ట్‌లుక్ కూడా సిద్ధమైపోయి ఉంటుంది. ఇదంతా ఎవరి కోసం చేస్తున్నామో..వాళ్లని ఎందుకు చివరి వరకు ఎదురుచూసేలా చేయడం అని మొన్న నాకు అనిపించింది. మనకు అన్నింటి కన్నా పెద్ద పండుగ సంక్రాంతి. భోగి రోజున కృష్ణ, సంక్రాంతి రోజున అర్జున్ ఫస్ట్‌లుక్‌లను, కనుమ రోజు సినిమాలోని ఫస్ట్‌సాంగ్‌ను మీరు చూడబోతున్నారు. మీ అందరికీ నచ్చుతాయని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నాడు నాని. ఆదివారం విడుదల చేసిన 'కృష్ణార్జున యుద్ధం' ఫస్ట్‌లుక్‌లో కోపంగా చూస్తూ కన్పించాడు. మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ కథానాయికలు. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.



'అయ్యారీ' చిత్రంలో మనోజ్ బాజ్‌పాయ్, సిద్ధార్థ్ మల్హోత్ర

'అయ్యారీ' 26న కాదు ఫిబ్రవరి 9న

నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'అయ్యారీ'. ఈ సినిమాను ఈనెల 26న విడుదల చేయాలని మొదట భావించారు. కానీ ఫైనల్‌గా ఫిబ్రవరి 9వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు ప్రకటించారు. మనోజ్ బాజ్‌పాయ్, సిద్ధార్థ్ మల్హోత్ర కీలకపాత్రలో నటించిన ఈ సినిమాలో రకుల్ ప్రీత్‌సింగ్, పూజా చోప్రా కథానాయికలుగా చేశారు. ఈ సినిమా ఈనెల 26న విడుదల కావాల్సి ఉంది. కానీ ఆ రోజు రిలీజ్ చేయకుండా ఫిబ్రవరిలో విడుదల చేస్తున్నారు. ఈనెల 25న సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పద్మావత్', 26న ప్యాడ్‌మేన్ విడుదలవుతున్నాయి. అందువల్ల రెండు వారాలు పాటు 'అయ్యారీ' చిత్రం రిలీజ్‌ను వాయిదా వేశారు. చివరకూ ఫిబ్రవరి తొమ్మిదన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నీరజ్ పాండే ట్వీట్ చేశారు. ఇద్దరు ఆర్మీ ఆఫీసర్ల మధ్య జరిగే యుద్ధమే ఈ చిత్రమని దర్శకుడు చెబుతున్నాడు.



రణవీర్ సింగ్



దీపికా పదుకొనే

'గుల్లీ బాయ్' మొదలెట్టాడు

అలియా భట్, రణవీర్ సింగ్ కాంబినేషన్‌లో 'గుల్లీ బాయ్' చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సంగీతం నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రానికి జోయా అక్తర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ముంబాయికి చెందిన రాపర్లు గుల్లీ బాయ్, నజీ పాత్రల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా ప్రారంభానికి సంబంధించిన విషయాలను రణవీర్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. రణవీర్ నటించిన 'పద్మావత్' చిత్రం ఈనెల 25వ తేదీన ప్రేక్షకుల ముందుకురానుంది.

ప్రేమ 'మిఠాయి'



రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శిపై క్లాప్ కొడుతున్న విజయ్ దేవరకొండ

డార్క్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న కొత్త చిత్రం 'మిఠాయి'. రెడ్ యాంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా తెరకెక్కనుంది. ఆదివారం ఈ సినిమా హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా, క్రాంతి మాధవ్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయ్ దేవరకొండ క్లాప్ కొట్టారు. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ 'ఈ సినిమా ద్వారా దర్శక నిర్మాతగా పరిచయమవుతున్న ప్రశాంత్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుంటే.. రాహుల్ రామకృష్ణ, కమల్ కామరాజు, ప్రియదర్శి, శ్వేత, గాయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిఫరెంట్ కథ. తెలుగులో డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న సినిమా ఇది' అని అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఈ సినిమాకు పనిచేస్తున్న యూనిట్‌లో అందరూ నాకు 'పెళ్ళిచూపులు' నుండి పరిచయమే. ముఖ్యంగా ప్రశాంత్ నాకు మంచి ఫ్రెండ్. డార్క్ కామెడీ సినిమా అనగానే చాలా క్యూరియస్‌గా వెయిట్ చేస్తున్నాను' అని చెప్పారు. మంచి కథ అని ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుందని రాహుల్ రామకృష్ణ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం : వివేక్ సాగర్.

ప్రీ రిలీజ్ వేడుకకు చిరు అతిథి

చూసి చూడంగానే నచ్చేశావే..అడిగీ అడంగంగానే వచ్చేశావే....అనే గీతంతో అందరి దృష్టిని ఆకర్షించింది 'ఛలో' చిత్రం. నాగ శౌర్య హీరోగా చేస్తున్న ఈ సినిమాలో రష్మిక మండన్న కథానాయిక. వెంకీ కుడుముల దర్శకుడు. శంకర ప్రసాద్ ముల్పూరి సమర్పణలో నిర్మాత ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని ఐరా క్రియేషన్స్ బ్యానర్లో ప్రొడక్షన్‌లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఈనెల 25న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా వస్తున్నాయని నాగశౌర్య చెప్పారు. ఈ విషయాన్ని ట్విట్టర్‌లో ద్వారా ప్రకటిస్తూ చిరంజీవితో దిగిన సెల్ఫీని పోస్టు చేశాడు శౌర్య. "ఆయన ఒప్పుకోవడం, భోగి సందర్భంగా దాన్ని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. నా ఆనందానికి అవధులు లేవు. థ్యాంక్యూ సర్' అని పేర్కొన్నాడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. ఫిబ్రవరి 2న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రానికి సాయి శ్రీ రామ్ సినిమాటోగ్రఫీ, పాటలు : భాస్కర భట్ల, కాసర్ల శ్యామ్, డ్యాన్స్ : రఘు, విజయ్, ఫైట్స్ : వెంకట్.



చిరంజీవి, నాగశౌర్య

అనగనగా ఓ రాజకుమారుడు



అలియా భట్




నవీన్, అమృత

నవీన్ బాబు, సంజన, అమృత హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న సినిమా 'అనగనగా ఓ రాజకుమారుడు'. రమాదేవి సమర్పణలో రామ్ సాయి గోకులం క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోంది. 'షాలిని' ఫేమ్ షెరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పీవీ రాఘవులు నిర్మాత. కమెడియన్ సుమన్ శెట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సినిమా గోవాలో మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. లవ్ , కామెడీ, అండ్ థ్రిల్లర్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ని గోవా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో పూర్తి చేశారు. సరికొత్త పాయింట్‌తో తెరకెక్కే ఈ సినిమాలో కథకు సరిపోయేలా హీరో హీరోయిన్స్ బాగా సెట్ అయ్యారని దర్శకుడు షెరాజ్ చెప్పారు. 'ప్రేమకథా చిత్రంగా తెరకెక్కే ఈ సినిమాలో గోవా నేపథ్యంలో కథ సాగుతుంది. అక్కడ తెరకెక్కించిన సన్నివేశాలు ఆద్యంతం ఆసక్తి కలిగిస్తాయి. రెండో షెడ్యూల్‌ని త్వరలోనే హైద్రాబాద్‌లో మొదలు పెట్టనున్నాం' అని నిర్మాత తెలిపారు.

అత్యుత్తమ నటి

దీపికా పదుకొనే దేశంలోనే అత్యుత్తమ నటి అని దర్శకుడు విశాల్ భరద్వాజ్ ప్రశంసించారు. త్వరలో దీపికా పదుకొనే, ఇర్ఫాన్ ఖాన్ కాంబినేషన్‌లో ఓ సినిమా చేయబోతున్నాడు. మొదట హనీ త్రీహాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించాల్సి ఉంది. విశాల్ కథ అందించాడు. కానీ ఆ దర్శకుడు ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో భరద్వాజే ఆ బాధ్యతలను తీసుకున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం విశాల్ మీడియాతో మాట్లాడుతూ "నేను ఎప్పుడూ దీపికాతో పనిచేయడానికి ఎదురు చూస్తూ ఉంటా. ఈమె ఇప్పుడున్న నటుల్లో అత్యుత్తమ నటి. ఇర్ఫాన్ ఖాన్ నా అభిమాన నటుల్లో ఒకడు. అందుకే వీరిద్దరితో పనిచేయడానికి చాలా ఆసక్తిగా ఉన్నాను" అని భరద్వాజ్ పేర్కొన్నాడు. దీపికాతో పని చేయడం ఈ దర్శకుడికి ఇదే మొదటిసారి. ఇటీవల ఆమె నటించిన 'పద్మావత్' చిత్రాన్ని కర్ణిసేన వివాదం చేసిన నేపథ్యంపై ఆయన స్పందిస్తూ "నేను రెండేళ్ల క్రితమే నా సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకున్నాను. ఇది ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేని కథ. మొత్తానికి 'పద్మావత్' సినిమా విడుదల అవుతుండడం చాలా సంతోషంగా ఉంది. అయితే రాజస్థాన్‌లో విడుదల కాకపోవడం బాధాకరమే. సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చాక దేశం మొత్తంలో ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చు' అని అన్నారు.

మోస్ట్ హ్యాండ్సమ్



హృతిక్ రోషన్

హృతిక్ రోషన్ ప్రపంచ నటులందరిలోనూ అందగాడిగా రికార్డుకెక్కాడు. హాలీవుడ్ నటులు రాబర్ట్ పాటిసన్, తైవాన్ నటుడు గాడ్‌ఫ్రీ, క్రిస్ ఈవాన్స్, డేవిడ్ బోరీయన్జ్ వంటి స్టార్స్ అంతా హృతిక్ తర్వాత స్థానంలోనే ఉన్నారు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కూడా ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నటుల లుక్స్, ప్రపంచ వ్యాప్తంగా ఆయనకున్న అభిమానులు, ఈ హీరో చిత్రాలు బాక్సాఫీస్ వద్ద చేసే కలెక్షన్లు, ప్రకటనలు వీటన్నింటి ఆధారంగా వరల్డ్ టాప్‌మోస్ట్. కామ్ అనే వెబ్‌సైట్ ఈ జాబితాను రూపొందించింది. బాలీవుడ్ గ్రీక్ దేవుడిగా పిలుచుకునే ఈ హీరో గత ఏడాది సెక్సీయిస్ట్ ఆసియన్‌మేన్‌గా నిలిచాడు. ఈ జాబితాలో హాలీవుడ్ స్టార్‌హీరో రాబర్ట్ పాట్సిన్ రెండో స్థానంలోనూ గాడ్‌ఫ్రీ గోవా, క్రిస్ ఈవాన్స్, సల్మాన్, డేవిడ్ బోరీన్జ్, నోయా మిల్స్, హెన్రీ కావిల్, టామ్ హిడిల్‌స్టోన్ తరువాత స్థానాల్లో నిలిచారు. హృతిక్ ఇప్పుడు మేథమేటిసియన్ ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న 'సూపర్ 30' సినిమాలో చేస్తున్నాడు. వికాశ్ బాహ్లా దర్శకత్వం వహిస్తున్నాడు. దీంతో 2020 క్రిస్మస్‌కు విడుదల కానున్న 'క్రిష్ 4' కూడా చేయనున్నాడు.

ప్రజాశక్తి
విజయవాడ
సోమవారం 15-1-2018

రూపాయి



క్రెడిట్ స్కోర్ మెరుగుపడాలంటే

ఆదాయం ఎంత ఉంది? ఉద్యోగం ఎక్కడ చేస్తున్నారు? అప్పు ఇచ్చేందుకు ఇలాంటి విషయాలే ప్రధానం కాదు. గతంలో మీరు తీసుకున్న రుణాలను ఎలా చెల్లించారు? ఎప్పటికప్పుడు.. అవసరాలు లేకున్నా.. అప్పు తీసుకునేందుకు ఆరాటపడుతుంటారా? మీ క్రెడిట్ స్కోరు ఎలా ఉంది? తదితరాలూ ఇప్పుడు రుణం ఇచ్చేందుకు బ్యాంకులకు ప్రాతిపదికగా మారాయి. ఇలాంటివన్నీ తెలియజేసేదే సిబిల్ ట్రాన్స్‌యూనియన్ స్కోరు. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే అప్పులను నెలనెలా తిరిగి చెల్లిస్తున్న తీరును తెలుసుకునేందుకు ఉపయోగపడేదే సిబిల్ నివేదిక. అసలు సిబిల్ నివేదిక అంటే ఏమిటి? దానివల్ల ప్రయోజనాలేమిటి? సిబిల్ స్కోర్ ఆధారంగా మాత్రమే లోన్లు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధపడతాయి? ఇదే ఈ వారం 'రూపాయి' కథనం..

క్రెడిట్ సులభమే కానీ..!!

రుణం.. అప్పు, క్రెడిట్.. పదాల్లో సారూప్యత ఉండొచ్చేమోగానీ.. వాటి అరం మాత్రం ఒక్కటే. ఆపద్ధర్మంగా, అత్యవసర సందర్భాల్లో ఉపయోగపడే ఆర్థిక అవసరాలనే రుణంగా పేర్కొంటాం. అధికారిక రుణ సంస్థలు అంటే వివిధ జాతీయ బ్యాంకులు ఖాతాదారులకు రకరకాల రుణాలు అందజేస్తుంటాయి. నిర్ధిష్ట కాలపరిధిలో తిరిగి చెల్లించే విధంగా రుణం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. కొన్ని ఉదాహరణలు చూద్దాం!!

ఉదయ్‌శంకర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. డెబ్బైవేల రూపాయలకుపైగా జీతం. ఈ మధ్యే పెళ్ళయ్యింది. కొత్తకారు కొనాలనే ఆలోచన వచ్చింది. దానికి తన భార్యా ఓకే చెప్పింది. తనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినే. కారుకోసం రెండు లక్షల వరకూ పెట్టుబడిపెట్టి మిగతా సొమ్ము బ్యాంకులో లోనుగా తీసుకోవాలనుకున్నారు. అనుకున్న ప్రకారం ఉదయ్ కార్‌లోన్ కోసం అప్లయి చేశాడు. ఎలాగూ ఆదాయం ఎక్కువకనుక లోన్ సులభంగా వస్తుందనే ధీమాతో ఉన్న సమయంలో "సారీ.. యువర్ కార్‌లోన్ ప్రపోజల్ హేజ్ రిజెక్టెడ్" అని మొబైల్‌కి సందేశం వచ్చింది. దీంతో ఉదయ్‌కి అసలు సమస్యేంటో అర్థంకాలేదు. రుణ సంస్థ లోను ఇవ్వడానికి ఎందుకు నిరాకరించింది?

ఉదాహరణ

జగదీష్ ప్రయివేటు ఉద్యోగి. నెలకు లక్షకుపైగా జీతం. రెండు బ్యాంకుల్లో వ్యక్తిగత అకౌంట్‌లు ఉన్నాయి. బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు వేయడం, తియ్యడం, చెక్ ద్వారా క్యాష్ బదిలీలు వంటివి జగదీష్‌కి అలవాటే. జీతం ఆధారంగా ఒకటి రెండు బ్యాంకుల క్రెడిట్ కార్డులూ ఉన్నాయి ఇలాంటి నేపథ్యంలో కొత్త ఇంటి కొనుగోలు కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలనుకున్నాడు. బ్యాంకులో హౌసింగ్ లోన్‌కోసం అప్లై చేశాడు. కానీ జగగీష్‌కి లోను ఇవ్వడానికి బ్యాంకు నిరాకరించింది. కారణం అతనికి సంబంధించిన ఆర్థికలావాదేవీల్లో క్రమశిక్షణ లేవకపోవడమే. క్రెడిట్ కార్డుల చెల్లింపులు ఏమాత్రం సరిగ్గాలేవు. లోను రాకపోవడానికి ప్రధానకారణం ఇదే. లోను కోసం ఇలాంటి చిక్కుముడులు లేకుండా ఉండాలంటే అంతుకు తగ్గట్టుగానే ముందస్తు ఆర్థిక ప్రణాళిక, క్రమశిక్షణ అవసరం. ఉదయ్‌శంకర్, జగదీష్ వంటి ఉదాహరణలు మనకు నిత్యం చాలానే తారసపడుతుంటాయి. అందుకు కారణాలు ఇప్పుడు చర్చిద్దాం.

సిబిల్‌పై అవగాహన ముఖ్యం

అసలు మీ సిబిల్ స్కోరు బ్యాంకులకు ఏ వివరాలు తెలియజేస్తుందో.. మీ రుణ దరఖాస్తుపై నిర్ణయం తీసుకునేందుకు బ్యాంకులు



ఆ వచ్చే నివేదికలో ఏయే వివరాలు పరిశీలిస్తాయో? లోను కోసం వెళ్ళే ముందుగానే తెలిసి ఉండాలి. సాధారణంగా సిబిల్ నివేదిక అంటే పరిశీలిస్తే మీకు ఎన్ని రుణాలు ఉన్నాయన్న సంగతి తెలుస్తుంది. అందులో ఏ తరహా రుణాలున్నాయి.. గృహ, వాహన, ఆస్తి తనఖాల్లాంటి హామీతో కూడిన అప్పులున్నాయా? వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డులాంటివి ఎన్ని ఉన్నాయా? హామీతో ఉన్న రుణాలు..



హామీలేని రుణాల మధ్య నిష్పత్తి ఎలా ఉంది? మీపై ఉన్న మొత్తం అప్పు ఎంత? అనేది నివేదికలో క్లియర్‌గా ఉంటుంది. అంటే మీ అప్పుల గురించి మీరు చెప్పకుండానే సిబిల్ నివేదిక బ్యాంకర్లకు సాధికారికంగా తెలియజేస్తుంది.


రుణాలు ఎలా చెల్లిస్తున్నారు?

రుణాలు తీసుకోవడమే కాదు, వాటిని తిరిగి సరిగా, నిర్ణీత కాలంలో చెల్లించినప్పుడు మాత్రమే మనం మంచి రుణ గ్రహీతలమవ్వగలం. తీసుకున్న రుణాల వాయిదాలను, క్రెడిట్ కార్డుల బిల్లులను సకాలంలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చెల్లిస్తున్నామా? లేదా? వాయిదాలు, బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరిగిందా? అయితే అలా ఎన్నాళ్లపాటు జరిగింది? మరి ఇప్పటి పరిస్థితి ఏమిటి? మీ క్రెడిట్ కార్డు బిల్లులకు సంబంధించి ఎప్పుడైనా సెటిల్‌మెంట్లు చేసుకున్నారా? అలా చేసుకోవాలనే ఆత్రుతతో ఉన్నారా? ఇవన్నీ లోను తీసుకోవడానికి కొలమానాలే. కొంతమంది అదేపనిగా రుణాల కోసం దరఖాస్తు చేస్తుంటారు. దీనివల్ల వారికి ఎంత రుణభారం పడుతోంది? కొత్తగా తీసుకోబోయే రుణం వల్ల వారికి ఆర్థిక ఇబ్బందులు ఏమైనా వస్తాయా? అనేది బ్యాంకులు ఆలోచిస్తాయి. మీ ఆదాయ.. అప్పుల నిష్పత్తి ఎలా ఉంది? అనే విషయాల్ని బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. ఆ తర్వాత అన్నీ బావుంటే అదనంగా మీకు రుణం ఇవ్వొచ్చా? లేదా? అనేది నిర్ణయిస్తాయి.

అందుకే, రుణం తీసుకోబోయే ముందుగానే వ్యక్తిగత సిబిల్ నివేదికను తెలుసుకోవడం ద్వారా బ్యాంకు రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటుందా లేదా?అనేది తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. అందుకోసం క్రెడిట్ బ్యూరో అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్ళి, నామమాత్రపు రుసుము చెల్లింపు ద్వారా క్రెడిట్ స్కోర్ తెలుసుకోవచ్చు. ఎంత మంచి క్రెడిట్‌స్కోరు ఉంటే అంత త్వరగా మీ రుణ దరఖాస్తు అమోదం పొందేందుకు వీలవుతుంది. రుణం పొందేందుకు ఇంతకంటే సక్రమమైన మార్గాలు ఉండవు. ఉన్నాయంటే అవన్నీ తాత్కాలికంగా, మభ్యపెట్టే అనాధికార ప్రయత్నాలే అని భావించాలి.

బ్యాంకు అకౌంట్ ఉండాల్సిందే

వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వల్లనూ సిబిల్ స్కోర్



బలోపేతమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఈ రోజుల్లో నూటికి తొంభై తొమ్మిది శాతం మంది ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతున్నాయి. సేవింగ్స్ అకౌంట్స్ ద్వారా జరిపే లావాదేవీలూ సిబిల్ స్కోర్‌ను పెంచే విషయంలో సహకరిస్తాయి.

వ్యక్తిగత బ్యాంకు అకౌంట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు, డబ్బు నిల్వలు, నగదు– బదిలీ, పంపిణీ, చెక్ ట్రాన్స్‌ఫర్ వంటి వసతుల్ని రెగ్యులర్‌గా వినియోగించుకోవడం వల్ల బ్యాంకింగ్ రంగంపట్ల ఓ అవగాహన ఏర్పడుతుంది. బ్యాంకు ఖాతావల్ల ఎలాంటి సౌకర్యాలున్నాయనే విషయాల్ని సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. డబ్బులు పొదుపు చేయడం, వేరొకరికి ట్రాన్స్‌ఫర్ చేయడం, సేవింగ్ అకౌంట్ ద్వారా వస్తువులు కొనుగోలు చేయడం వంటివి బ్యాంకు అకౌంట్ ద్వారా చేస్తూ ఉండటం మంచిది. దీనివల్ల సదరు అకౌంట్ దారుడి ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక శక్తిసామార్థ్యాల్ని బ్యాంకులు అంచనా వేయడానికి వీలుకలుగుతుంది. బ్యాంకులతో సత్సంబంధాలు కలిగిన ఖాతాదారులకు కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు వాటికవే ముందుకొస్తుంటాయి. కేవలం రుణం తీసుకోవడం కోసం మాత్రమే బ్యాంకు అకౌంట్ తెరవడం అంత సమర్థనీయం కాదు. వ్యక్తిగత ఖాతాలోని తీరుతెన్నులను బట్టీ బ్యాంకులు స్పందిస్తాయి.

వి.చైతన్య



'రూపాయి'కి మీరూ రాయండి!




బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్‌ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...
పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా


చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి





జత చేయండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని జంతువులు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనిదో జతచేయండి!

పొడుపు కథ

నాది ఓ ప్రత్యేకత
ఆరేడు రంగుల ఏకత
చిరుజల్లులు పడితే
విల్లులా నింగిలో
పుడతా..?


జవాబు: ఇంద్రధనుస్సు

జోక్ :

టింకు : అంకుల్! టెన్త్‌క్లాసు పుస్తకం ఇవ్వండి..
షాపు అతడు : లేవు బాబూ!
టింకు : అయితే ఐదవ క్లాసు పుస్తకాలు రెండు ఇవ్వండి..!

మట్టి పిల్లులు తెలుసా!

పిల్లలూ! మీరెప్పుడైనా మట్టిపిల్లులు గురించి విన్నారా? ఇవీ పిల్లులే. ఇవి మట్టిరంగులో ఉండడం వల్ల ఆ పేరొచ్చింది. అయితే ఇవి ఉండేది మనదేశంలో కాదు. వీటిని శాండ్‌క్యాట్స్ అంటారు. వీటిని పట్టుకోవడం చాలా కష్టం. ఇవి తొందరగా ఎవరి కంటా పడవు. రాత్రిళ్ల మాత్రమే తిరుగుతాయి.



అలాంటి శాండ్‌క్యాట్స్ గురించి తొలిసారిగా గతేడాది ఏప్రిల్ 26న ప్రపంచానికి తెలిసింది! మెరుస్తున్న కళ్లతో చూస్తున్న మూడు శాండ్‌క్యాట్స్ పిల్లలు మొక్కల గుబురుల్లో దాగుండగా జీవ శాస్త్రవేత్తల బందం చూసింది. ప్రపంచంలోని 40 అడవిజాతి పిల్లుల పరిరక్షణపై పనిచేస్తున్న 'పాంథేరా' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ఈ బ్రైటన్ నాయకత్వంలోని బృందం శాండ్‌క్యాట్స్ కోసం గత నాలుగేళ్ళుగా ఆఫ్రికాలో అధ్యయనం చేస్తోంది. ఎట్టకేలకు మొరాకన్ సహారాలో ఆరు నుంచి ఎనిమిది వారాల వయసున్న శాండ్‌క్యాట్‌ని ఈ బృందం కనుగొంది.

ఇంట్లో మచ్చిక చేసుకునే పిల్లిజాతి కన్నా శాండ్‌క్యాట్స్ భిన్నంగా ఉంటాయి. వీటి చెవులు పెద్దవిగా ఉంటాయి. వాటి మీద ఉండే బొచ్చు మట్టి రంగులో ఉంటుంది. కళ్లు ఆకుపచ్చరంగులో, పెద్దవిగా ఉండి మెరుస్తుంటాయి. అంతేకాదు ఇవి ఆఫ్రికా ఇసుక రంగులో ఇట్టే కలిసిపోతాయి. సాధారణ పిల్లుల్లాగ శాండ్ క్యాట్స్ అస్సలు శబ్ధం చేయవు.






తమ రంగు, రూపులతో ప్రకృతిలో కలిసిపోయి, జీవిస్తాయి. ఇవి సురక్షిత ప్రదేశాల్లో దాక్కుంటాయి. తమని పరిశీలించేవారి కళ్లు గప్పి తిరగాలనుకున్నప్పుడు, తమకు శత్రువులు ఎదురైనప్పుడు ఆత్మరక్షణ కోసం మట్టిరంగులో ఉన్న తమ బొచ్చు రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది. వీటిలో కనిపించే మరో విశేషం ఇవి అస్సలు పారిపోవు.

శాండ్‌క్యాట్స్ సంఖ్య ఎక్కువగా లేదని పరిశోధకులు చెబుతున్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే శాండ్‌క్యాట్స్ ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. ఈ బృందం తీసిన శాండ్‌క్యాట్స్ పిల్లుల వీడియో, ఫోటోలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. కొందరు శాండ్‌క్యాట్స్‌ని ఇళ్లల్లో పెంచుకోవాలనుకున్నారు. కానీ 'అడవిలోని పిల్లి జాతుల పరిరక్షణ లక్ష్యానికి ఇది పూర్తిగా విరుద్ధం.. అందుకే ఈ "సంస్కృతిని మేం ప్రోత్సహించం" అని బృంద నాయకుడు బ్రైటన్ చెబుతున్నారు. ★

చుక్కలను కలిపి రంగులు వేయండి!



పిల్లలూ! పక్కన చిత్రంలో ఉన్న చుక్కలను కలిపి, రంగులు వేయండి!



కోహ్లీ ఒక్కడే...

- దక్షిణాఫ్రికా 335 ఆలౌట్
- టీమిండియా 183/5

సెంచూరియన్ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో భారతజట్టు ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఆదివారం టీమిండియా రెండోరోజు ఆట ముగిసే సమయానికి కోహ్లీ 85 హార్దిక్ పాండ్యా 11 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు దక్షిణాఫ్రికా జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు 335 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టు సారథి డుప్లెసిస్ రెండోరోజు అత్యధికంగా 63 పరుగులు చేసి అవుటయ్యాడు. టీ విరామానికి భారత జట్టు రెండు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. కోహ్లీ 39, విజయ్ 31 పరుగులతో టీ విరామ సమయానికి క్రీజ్‌లో ఉన్నారు. 45.5 ఓవర్‌లో రబాడ బౌలింగ్‌లో 10 పరుగులు చేసిన రోహిత్ శర్మ ఎల్‌బిడబ్ల్యుగా అవుటై మరోసారి నిరాశపరిచాడు. అప్పటికి టీమిండియా స్కోర్ 132 పరుగులు. పార్థీవ్ పటేల్ 19, కెఎల్ రాహుల్ 10, పుజరా డక్కౌట్ అయ్యారు.

ఓవర్‌నైట్ స్కోర్ 269/6 తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా మరో 66 పరుగులు మాత్రమే జోడించి అందరూ అవుటయ్యారు. మ్యాచ్ ఆరంభంలోనే మహరాజ్(18) వికెట్‌ను కోల్పోయిన సఫారీలు.. ఆ తర్వాత 282 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా ఏడో వికెట్‌ను కోల్పోయింది. అశ్విన్ బౌలింగ్‌లో వరుసగా రెండు బంతుల్లో ఫీల్డర్లు క్యాచ్ జారవిడవడంతో రబాడకు జీవనదానం లభించింది. ఆ తర్వాత కూడా అతడికి మరోసారి క్యాచ్ జారవిడవడంతో మరో ఛాన్స్ లభించింది. రబాడ 34 బంతులను ఎదుర్కొని 11 పరుగులు చేయగా.. మరో ఎండ్‌లో కెప్టెన్ డుప్లెసిస్ వేగంగా ఆడి స్కోరు బోర్డును 300 పరుగులు దాటించాడు. చివరకు 324 పరుగుల దగ్గర రబాడ ఎనిమిదో వికెట్‌గా ఇషాంత్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు.

భారత్ ఇన్నింగ్స్ :

మురళి విజయ్ (సి) డికాక్ (బి) మహరాజ్	46
కెఎల్ రాహుల్ (సి అండ్ బి) మోర్కెల్	10
ఛటేశ్వర పుజరా (రనౌట్)	0
కోహ్లీ (నాటౌట్)	85
రోహిత్ శర్మ (ఎల్‌బి) రబాడ	10
పార్థీవ్ పటేల్ (సి) డికాక్ (బి) లుంగీనెగ్డీ	19
హార్థిక్ పాండ్యా (నాటౌట్)	11
అదనపు పరుగులు	2
మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి	183



దిగ్గజాల సరసన షమీ



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో భారత బౌలర్ షమీ దిగ్గజాల సరసన నిలిచాడు. అతి తక్కువ మ్యాచుల్లో 100 వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో షమీ మూడో స్థానంలో ఉన్నాడు. ఈ ఫీట్‌ను షమీ 29 టెస్ట్‌ల్లో సాధించగా.. ఇర్ఫాన్ పఠాన్ 28 టెస్టుల్లో సాధించి రెండో స్థానంలో, భారత్‌కు తొలి ప్రపంచకప్ అందించిన దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ 25 టెస్టుల్లోనే వంద వికెట్లు సాధించి మొదటి స్థానంలో ఉన్నారు. అంతేకాక టెస్టుల్లో 100 వికెట్లు తీసిన 20వ భారత బౌలర్‌గా షమీ నిలిచాడు. రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 15 ఓవర్లు వేసిన షమీ 58 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు.

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ టైటిల్‌తో హైదరాబాద్ హంటర్స్ జట్టు



హైదరాబాద్ హంటర్స్‌కే పిబిఎల్ ట్రోఫీ

- ఫైనల్లో బెంగళూరు బ్లాస్టర్స్‌పై 4-3తో గెలుపు

హైదరాబాద్ : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ టైటిల్‌ను హైదరాబాద్ హంటర్స్ కైవసం చేసుకుంది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్ జట్టు 4-3 పాయింట్ల తేడా బెంగళూరు బ్లాస్టర్స్ జట్టుపై విజయం సాధించింది. మాజీ వరల్డ్ నెంబర్ వన్ కరోలినా మారిన్ (హైదరాబాద్) నేతృత్వంలోని జట్టు పిబిఎల్-2018 టైటిల్‌ను గెలుచుకుంది.

పురుషుల డబుల్స్ : ఎం.కిడో/షియాంగ్ (హైదరాబాద్) 9-15, 10-15 ఎం.బియో/ఆర్ఎస్.రంగ్ (బెంగళూరు) జోడీ విజయం (1-0 పాయింట్ల ఆధిక్యతలో బెంగళూరు)

పురుషుల సింగిల్స్ (ట్రంప్) హైదరాబాద్ : ఎల్.హెచ్.లీ (హైదరాబాద్) 15-7, 15-13 ఎస్.డియో (బెంగళూరు)పై విజయం (2-1 ఆధిక్యతలో హైదరాబాద్)

పురుషుల సింగిల్స్ (ట్రంప్) బెంగళూరు : బి.ఎస్. ప్రణీత్ (హైదరాబాద్) 8-15, 10-15 అక్సెల్‌సన్ (బెంగళూరు) విజయం (3-2 ఆధిక్యతలో బెంగళూరు)

మహిళల సింగిల్స్ : కరోలినా మారిన్ (హైదరాబాద్) 15-8, 15-14 గిల్మోర్ (బెంగళూరు)పై విజయం (3-3 పాయింట్లతో ఇరుజట్లు సమానం)

మిక్సిడ్ డబుల్స్ : పి.జెడ్.బెర్నాడెత్/ఎస్.రాన్కీరెడ్డి (హైదరాబాద్) 15-11, 15-12 కెఎస్.రంగ్/ఎన్ఎస్.రెడ్డి (బెంగళూరు)పై విజయం (4-3 హైదరాబాద్ విజయం)

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు యుకి బాంబ్రీ అర్హత

చెన్నై : యుకి బాంబ్రీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించాడు. ఆదివారం కెనడాకు చెందిన పీటర్ పొలన్‌స్కీపై 1-6, 6-3, 6-3తో గెలుపొందడం ద్వారా ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు బాంబ్రీ మూడోసారి అర్హత సాధించాడు. 2015లో కూడా బాంబ్రీ అర్హత సాధించిన బాంబ్రీ ఆండీ ముర్రే చేతిలో ఓడిపోయాడు. 2016లో థామస్ బెర్డిచ్ చేతిలో మొదటిరౌండ్‌లోనే ఓటమి చెందాడు. 2009లో బాంబ్రీ ఆస్ట్రేలియన్ ఓపెన్ బాలుర సింగిల్స్ టైటిల్ సాధించాడు. భారత్‌కు చెందిన మరో టెన్నిస్ క్రీడాకారుడు రామ్‌కుమార్ రామనాథన్ ఓటమిపాలై నిరాశపరిచాడు.

కబడ్డీ ఓవరాల్ ఛాంప్స్ కృష్ణా జట్లు



ప్రజాశక్తి-గుడివాడ

పీపీఆర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్ లీగ్ పోటీల్లో కృష్ణా మహిళ, పురుషుల జట్లు ఓవరాల్ ఛాంపియన్‌లుగా నిలిచాయి. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐ.ఎల్) సౌజన్యంతో కబడ్డీ పోటీలు జరుగుతున్న విషయం విదితమే. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్లు తమ తమ ప్రత్యర్థులపై విజయం సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఫైనల్స్‌కు చేరుకున్న జట్లు నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడ్డాయి.

హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలు

మహిళల ఫైనల్స్‌లో కృష్ణా, అమరావతి జట్లు తలపడ్డాయి. రెండు జట్లలో జాతీయ, రాష్ట్ర క్రీడాకారిణులు ఉండటంతో తొలి నుంచి పోటీ హోరా హోరిగా సాగింది. చివరి వరకూ ఎవరు గెలుస్తారో ఉత్కంఠ నెల కొంది. అయితే చివరిలో కృష్ణాజిల్లా జట్టు మెరుగైన ఆట తీరును కనపరిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. కృష్ణాజిల్లా 23-19 తేడాతో అమరావతి జట్టుపై విజయం సాధించింది. గుంటూరు, కృష్ణా జిల్లా మధ్య జరిగిన పురుషుల ఫైనల్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగింది. ఈ పోరులో కృష్ణాజిల్లా జట్టు గుంటూరు జట్టుపై విజయం సాధించింది. అంతిమంగా గుంటూరుపై కృష్ణాజిల్లా జట్టు కేవలం ఒకే ఒక్క పాయింట్ ఆధిక్యంతో విజయం సాధించింది. ఈ పోటీలో కృష్ణాజిల్లా జట్టు 39 పాయింట్లు సాధించగా గుంటూరు జిల్లా జట్టు 38 పాయింట్లు సాధించింది. మొదటిస్థానంలో నిలిచిన జట్టుకు రూ. లక్ష, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ. 75వేలు, మూడో స్థానం సాధించిన జట్టుకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతులతో పాటు షీల్డ్స్ అందజేశారు.

గోవాపై ఆంధ్ర విజయం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఆదివారం విశాఖలో జరిగిన మస్తక్ అలీ టీ 20 మ్యాచ్‌ల్లో ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక జట్లు గెలుపొందాయి. ఉత్కంఠభరితంగా ఆంధ్ర-గోవా జట్ల మధ్య సాగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన గోవా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. అశ్విన్ 52, విహారి 57, రిక్కీ 65 పరుగులు సాధించారు. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గోవా జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 183 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో 18 పరుగుల తేడాతో ఆంధ్రా జట్టు గెలుపొందింది.

రెండో మ్యాచ్‌లో తమిళనాడు, హైదరాబాద్ జట్లు తలపడగా ఇందులో 16 పరుగుల తేడాతో తమిళనాడు గెలుపొందింది. టాస్ గెలిచిన తమిళనాడు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 193 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 177 పరుగులు మాత్రమే చేయడంతో ఓటమి తప్పలేదు.

మూడో మ్యాచ్‌లో కర్నాటక-కేరళ జట్లు బరిలోకి దిగాయి. టాస్ గెలిచిన కర్నాటక 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 182 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కేరళ 19.2 ఓవర్లకు ఆలౌటై 161 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. దీంతో 20 పరుగుల తేడాతో కర్నాటక విజేతగా నిలిచింది. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్లే గెలుపొందడం గమనార్హం.



తమిళనాడు హైదరాబాద్ మ్యాచ్ దృశ్యం

తమిళనాడు, కర్నాటక జట్లు గెలుపు

రిషబ్ పంత్ రికార్డ్ సెంచరీ
హిమాచల్‌ప్రదేశ్‌పై ఢిల్లీ గెలుపు

న్యూఢిల్లీ: ఢిల్లీ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ రికార్డ్ సెంచరీ సాధించాడు. కేవలం కేవలం 32 బంతుల్లోనే సెంచరీ సాధించిన తొలి వికెట్ కీపర్‌గా ఈ ఫీట్ సాధించాడు. ఆదివారంనాడు ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన సయ్యద్ ముస్తాక్ ఆలీ టి20లో ట్రోఫీలో సెంచరీతో చెలరేగాడు. అంతేగాక టీ20 చరిత్రలో రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ నమోదు చేసిన క్రీడాకారుడిగా నిలిచాడు. తొలిగా బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ 20 ఓవర్లలో 144 పరుగులు విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బరిలోకి దిగిన ఢిల్లీ జట్టు వికెట్ నష్టపోకుండా 11.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 38 బంతులు ఎదుర్కొన్న పంత్ 12 సిక్సర్లు, 8 ఫోర్లతో అజేయంగా 116, గౌతం గంభీర్ 33 బంతుల్లో 30 పరుగులు చేసి నౌటౌట్‌గా నిలిచారు. టీ20ల్లో వేగవంతమైన సెంచరీ రికార్డు క్రిస్‌గేల్ పేరుపై ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా 2013లో పుణె వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గేల్ 30 బంతుల్లోనే 100 పరుగులు చేశాడు.

అండర్-19 వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన కుర్రాళ్లు

పృథ్వీ షా సెంచరీ మిస్

100 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 94 పరుగులు



బే ఓవల్ (న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ జట్టు అదరగొట్టింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసి ప్రత్యర్థి ఎదుట భారీ స్కోర్ సాధించింది. భారతజట్టు సారథి పృథ్వీషా 100 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 94 పరుగులు చేసి తృటిలో సెంచరీకి ముందు అవుటయ్యాడు. మన్‌జోత్ కల్రా 86, శుభం గిల్ 63 పరుగులు చేసి భారీ స్కోరు సాధనకు కృషి చేశారు. దీంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ 4 వికెట్లు పడగొట్టగా విల్ సూథర్‌ల్యాండ్ పరమ్ ఉప్పల్, ఆస్టిన్ వా చెరో వికెట్ నేల కూల్చారు. 329 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. ఆసీస్ జట్టులో జాక్ ఎడ్వర్డ్స్ 73, జొనాథన్ మెర్లో 38, బాక్స్‌టెర్ జె హెూల్ట్ 39 పరుగులు చేశారు. మిగతా వారెవరూ పెద్దగా రాణించలేదు. భారత బౌలర్లలో శివం మావి 3, కమలేష్ నాగర్‌కోటి 3 వికెట్లు పడగొట్టగా అభిషేక్ శర్మ, అనుకూలల్ సుధాకర్ రాయ్ చెరో వికెట్ తీసుకున్నారు. ఆస్ట్రేలియాపై తొలి మ్యాచ్‌లో గెలిచిన టీమిండియా 2 పాయింట్లు సాధించింది. కెప్టెన్ పృథ్వీషాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఆదివారం జరిగిన ఇతర మ్యాచ్‌లు...

ఐర్లాండ్ 207/8 (48 ఓవర్లు) శ్రీలంక 208/3 (37.3 ఓవర్లు)
7 వికెట్ల తేడాతో శ్రీలంక విజయం
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ధనుంజయ(లంక) (101 నాటౌట్)

దక్షిణాఫ్రికా 341/7 (50 ఓవర్లు) కెన్యా 172/7 (50 ఓవర్లు)
159 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రైనార్డ్ టోండర్(ద.ఆఫ్రికా) (143 పరుగులు)

నేడు జరిగే మ్యాచ్‌లు...

బంగ్లాదేశ్ X కెనడా (లింకోలన్ మైదానం)
ఇంగ్లండ్ X నమీబియా (క్వీన్స్‌టౌన్ మైదానం)

దేశానికి రైతు వెన్నెముక

- అలాంటి రైతన్నలను సిఎం అవమానించడం బాధాకరం
- 2019లో విజయం మనదే..
- ప్రజాసంకల్ప యాత్రలో జగన్

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చిత్తూరు)



నెన్నూరులో జన సందోహం మధ్య అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

దేశానికి వెన్నెముక రైతేనని, అలాంటి రైతున్నలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవమానించటం బాధాకరమని వైసిపి అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఆదివారం 62వ రోజు ప్రజాసంకల్పయాత్ర చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని నెన్నూరు గ్రామం నుంచి ప్రారంభమైంది. సొరకాయలపాళెం, కమ్మపల్లి పంచాయతీ బేసూరి కండ్రిగ, రాబిళ్లవారిపల్లె మీదుగా పార కాల్వ వరకూ కొనసాగింది. నెన్నూరు గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జన సందోహం మధ్య సంక్రాంతి సంబరాలలో భాగంగా అభిమానులు రోడ్లపై ముగ్గులతో అలంకరించి జగన్‌కు ఘన స్వాగతం పలికారు. యువతీ, యువకులు ఉత్సాహంగా జగన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. భారతదేశంలో రైతులు బాగుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా జీవిస్తారన్నారు. అలాంటి వారిని చంద్రబాబునాయుడు 'దండగా' అనడం సమంజసం కాదన్నారు. రాబోవు ఎన్నికల్లో విజయం వైసిపిదేనని, ప్రతి కుటుంబాన్నీ ఆదుకునేందుకు కృషి చేస్తానని అన్నారు. మహిళలకు ప్రత్యేక గుర్తింపును కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.1000, రూ.1500 ఇస్తున్న పింఛన్‌ను రూ.2 వేల వరకూ పెంచుతానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 45 సంవత్సరాలకే పింఛన్ పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పార్టీలకతీతంగా లక్షలాది గృహాలను కట్టించారన్నారు. నేడు చంద్రబాబు పాలనలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు, టిడిపి కార్యకర్తలకే గృహాలను మంజూరు చేయడం అన్యాయమన్నారు. ఎంతో మంది పేదవారు గృహాలు లేక, నిలవడానికి నీడలేక అవస్థలు పడుతుంటే ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారని తెలిపారు. రైతులకు పగటి పూట 9 గంటల విద్యుత్‌ను ఇస్తామని, ఇప్పుడు రాత్రి సమయంలో 3 గంటలు, పగటి సమయంలో 4 గంటలు విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు విషసర్పాల భారిన పడి మృత్యువాతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైసిపి అధికారంలోకి రాగానే పగటిపూటే 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తానని తెలిపారు. అనంతరం ప్రయివేటు కళాశాలలు అధ్యాపకులు తమ జీతాలు పెంచేందుకు కృషి చేయాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపిలు మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు దామోదర్‌రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించేదెలా?

- పిసిబిలో సిబ్బంది కొరత
- ఔట్‌సోర్సింగ్‌లోనైనా భర్తీ చేయాలని వినతి
- ప్రభుత్వానికి పిసిబి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాలుష్య నియంత్రణ మండలి(పిసిబి)లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ఆశించిన మేర సేవల్ని అందించలేకపోతోంది. సరిపడా ఇంజనీర్లు లేకపోవడం తో పరిశ్రమల్లో కాలుష్యాన్ని నియంత్రిం చలేకపోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పిసిబిలో చైర్మన్, మెంబర్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ మినహాయించి 497 పోస్టులుండేవి. విభజనానంతరం ఏపీకి 289 పోస్టులు మంజూరయ్యాయి. అందులో ప్రస్తుతం 126 మంది మత్రమే పనిచేస్తున్నారు. 106 ఇంజనీర్లకుగాను ప్రస్తుతం 34 మందే పనిచేస్తున్నారు. అలాగే సైంటిఫిక్ సిబ్బంది కూడా 68 పోస్టులకు గాను 45 మందే పనిచేస్తున్నారు. సరిపడా సిబ్బంది లేనందున ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనైనా తక్షణం టెక్నికల్ విభాగంలో 90 పోస్టుల్ని భర్తీ చేయాలని పిసిబి ప్రభుత్వాన్ని కోరింది.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందున్నామంటూ, సింగిల్ డెస్క్ పాలసీలో పరిశ్రమలకు సులభంగా అనుమతులిస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఏ పరిశ్రమ నెలకొల్పాలన్నా అందుకు ఆయా శాఖల క్లియరెన్స్ అవసరం. ప్రధానంగా పర్యావరణానికి హాని కలగకుండా సరైన ప్రమాణాలున్నాయో లేదో పర్యవేక్షించే కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) అనుమతులు తప్పనిసరి. రాష్ట్ర విభజనానంతరం పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అనుమతులు సులభంగా, వేగంగా ఇచ్చేలా ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్ని రూపొందించింది. అయితే ప్రభుత్వ విధానాలకనుగుణంగా పనిచేసేందుకు మరింత మంది సిబ్బంది అవసరమని పిసిబి అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ఖాళీ పోస్టుల్ని భర్తీ చేసి, పిసిబిని బలోపేతం చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. కొత్త పరిశ్రమలకు అనుమతు లివ్వడంతోపాటు ఉన్న పరిశ్రమల్ని తనిఖీ చేయడం, కాలుష్య కారక పరిశ్రమల్ని నిరంతరం పర్యవేక్షించడం, అనుమతుల రెన్యువల్స్, మున్సిపాలిటీల నుంచి విడుదలయ్యే వ్యర్థాల నిర్వహణ, పలు ప్రాంతాల్లో గాలి, నీటి కాలుష్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం వంటి విధుల్ని పిసిబి నిర్వర్తిస్తోంది. ఈ విధులన్నింటినీ నిర్వర్తించేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నిస్సహాయస్థితిలో పడింది.

దక్షిణాది రాష్ట్రాల కంటే తక్కువే

అనుమతుల మంజూరులో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నా సిబ్బంది విషయంలో మాత్రం దక్షిణాది రాష్ట్రాల కంటే తక్కువ మందే పిసిబిలో పనిచేస్తున్నారు. ముఖ్యంగా సైంటిఫిక్, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేసేవారి సంఖ్య ఏపిలోనే తక్కువ. కీలక విభాగాల్లో పనిచేసే వారు తమిళనాడులో 472 మంది ఉంటే, మహారాష్ట్రలో 314, మధ్యప్రదేశ్‌లో 327, కర్ణాటకలో 400 మంది ఉన్నారు. ఏపిలో మాత్రం 174 మంది మాత్రమే ఉన్నారు.

నామమాత్రంగానే తనిఖీలు

సిబ్బంది తక్కువగా ఉండటం వల్లే పరిశ్రమల్లో తనిఖీలు నామమాత్రంగానే జరుగుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని భారీ కాలుష్య కారక పరిశ్రమల విషయంలో ఎప్పటికప్పుడు వ్యర్థాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కాలం చెల్లిన ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, అనుమతుల పునరుద్ధరణ విషయంలో పలు పరిశ్రమలు ప్రమాణాలు పాటించకపోయినా తనిఖీ చేయలేకపోతున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68